వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

హఫీజ్ సయీద్‌పై ఎన్ఐఎ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ

‘కొత్త రూపంలో పాత ఆరోపణలు’ 07

సంపుటి 09, సంచిక: 284 | ఆదివారం | 13 -09-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### 22ఎ జాబితాలో

# నిషేధిత భూములు తగ్గాయ్



● రిజిస్ట్రేషన్లు నిలిపివేశారనే ఆరోపణలు అవాస్తవం ● ప్రజలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం
● ఏ స్వార్థం లేకుండా ప్రజాసమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం పనిచేస్తోంది ● బిఆర్‌ఎస్ హయాంలో 22ఎ జాబితాలో ప్రభుత్వ అసైన్డ్, ఇతర వ్యవసాయేతర భూములు కలిపి 1.95 లక్షల ఎకరాలు, ప్రైవేట్ భూములు 3.95 లక్షల ఎకరాలు
● కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయేతర భూములు 1.94 లక్షలు, ప్రైవేట్ భూములు 3.73 లక్షలు మాత్రమే ● 22ఎ సమస్యలపై స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, ఇది ప్రజల ప్రభుత్వమని, ఏ స్వార్థం లేకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. పారదర్శకతతో ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో శనివారం ‘రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ కు సంబంధించిన సమస్యల’పై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 22ఎకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించారు. 22 ఎ వివాదాలకు సంబంధించి పలువురు ఎమ్మెల్యేలు చేసిన వీడియోలతో పాటు జిఒలు, గెజిట్ పత్రాలు సభలో ప్రదర్శిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఎపి రాష్ట్రంలోనే 1999లో ఘట్‌కేసర్‌లోని రైల్వే స్టేషన్‌ను రిజిస్ట్రేషన్ చేసిన క్రమంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అప్పటి ప్రభుత్వం నిషేధిత జాబితా రిజిస్ట్రేషన్ చట్టంలో 22ఎ అనేది అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ నిషేధిత జాబితాను 2007లో సుప్రీంకోర్టు కొన్ని రాష్ట్రాలలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో 2009లో తమ భూములు ఆ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం నిషేధిత భూములకు సంబంధించి 2015 వ సంత్సవరంలో 22ను ఎ, బి, సి, డి, ఇ 5 విభాగాలుగా విభించిందని మంత్రి వివరించారు. ఇదే క్రమంలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇందుకు సంబంధించి నియమ నిబంధనలను ఖరారు చేస్తూ 2016లో జిఓ ఇచ్చిందే తప్ప దానిని 2018 నాటికి కూడా అమలు చేయలేదన్నారు. ‘ధరణి’ తీసుకువచ్చి దోచుకునుందుకే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ఉత్తర్వుల అమలును అలస్యం చేసిందన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్న 2026 డిసెంబర్ 7 తేదీ నాటికి 22ఎ నిషేధిత జాబితాలో ప్రభుత్వ, అసైన్డ్ ఇతర వ్యవసాయేతర భూములు కలిపి 1,95,812 ఎకరాలు, ప్రైవేట్ భూములు 3,95,852 ఎకరాలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయయేతర భూములు 1,94, 513, ప్రైవేట్ భూములు 3,73,930 ఎకరాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో 22ఎ జాబితాలో తరువాయి 8లో

**శాసనసభ ఈనెల 16కు వాయిదా** | **శాసనమండలి నిరవధిక వాయిదా**



## ఏకపక్ష సుంకాలపై బ్రిక్స్ దేశాలు ఆందోళన

అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా టారిఫ్‌లు పెంచడాన్ని ఖండించిన సభ్యదేశాలు

### యుద్ధంపై బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్

● ‘అమెరికా దాడి’ ప్రస్తావన లేకుండా తీర్మానం
● ఇరుపక్షాలు గరిష్ఠస్థాయి సంయమనం పాటించాలి
● సరఫరా గొలుసు పునరుద్ధరణకు కలిసి పనిచేద్దాం
● డాలర్ కాదు, స్థానిక కరెన్సీలోనే బ్రిక్స్ వాణిజ్యం
● పశ్చిమాసియాలో నావికుల భద్రతకు భరోసా ఇవ్వాలి
● భద్రతామండలిలో సంస్కరణలకు పిలుపు
● ఉగ్రవాద ప్రతిఘటన బాధ్యతలను దేశాలు నిర్వర్తించాలి
● భారత్‌కు దౌత్య విజయం : మీడియా అభివర్ణన

**న్యూఢిల్లీ :** అమెరికాపేరు ప్రస్తావన లేకుండా 18వ బ్రిక్స్ సదస్సు పశ్చిమాసియాలో ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండించింది. ఇరాన్‌—యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన నాయకులు తమ తమ ప్రసంగాలలో తొలుత కఠిన వైఖరులకు కట్టుబడినప్పటికీ,ఈ భిన్న వాదనలు,వైఖరులను అధిగమించి యుద్ధంపై చేసిన ఏకాభిప్రాయ తీర్మానం అతిథేయ దేశం భారత్‌కు గొప్ప దౌత్యవిజయం. హోర్ముజ్‌లో వాణిజ్య రవాణా,నావికుల భద్రత, ట్రంప్ వాణిజ్య సుంకాలు, గాజాలో ఇజ్రాయెల్ ఉల్లంఘనలు, హింసాకాండ, ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం,ఐక్యరాజ్యసమితి సంస్కరణలపై సదస్సు తీర్మానాలు చేసింది.అమెరికా డాలర్‌లో కాకుండా స్థానిక కరెన్సీలోనే బ్రిక్స్ దేశాల వాణిజ్యం జరగాలని తీర్మానం పేర్కొంది. హోర్ముజ్ జలసంధిలో నావికులకు భద్రత ఇవ్వాలని,వారికి భరోసా ఉండాలని, దీనిని నిర్ధారించాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో ఇరు పక్షాలు గరిష్ఠ సంయమనం పాటించాలని, అంతర్జాతీయ చట్టాలకు లోబడి అందుకు అనుగుణంగా చర్చలు, దౌత్యమార్గాల ద్వారా యుద్ధం ముగించాలని పేర్కొంది. ప్రపంచ వాణిజ్యం,గొలుసుకట్టు సరఫరా వ్యవస్థ సజావుగా సాగిపోయేందుకు కలిసి కృషి చేయాలని సభ్యదేశాలు తీర్మానించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద కూటమిగా తెరమీదకు వచ్చిన బ్రిక్స్, అమెరికా—ఇరాన్ యుద్ధం ఏడవనెలలోకి తరువాయి 8లో

## కాలువలో జారిపడి ఇద్దరు విద్యార్థులు మృతి

మరొక విద్యార్థిని రక్షించిన స్థానికులు

సూర్యాపేట జిల్లా ముకుందాపురం గ్రామంలో విషాద ఛాయలు



ప్రజాపక్షం/మునగాల

ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో జారిపడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా ముకుందాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణానికి చెందిన హరీష్‌నాయుడు, గుడిబండ గ్రామానికి చెందిన లేక స్వరూప్ లు తన స్నేహితుడైన ముకుందాపురం గ్రామానికి చెందిన రణబోతు అప్పిరెడ్డి కుమారుడైన అనుదీప్ ఇంటికి శనివారం వచ్చారు. వీరు ముగ్గురు సరదాగా ఈత కొట్టేందుకు ముకుందాపురంలోని ముక్త్యాలబ్రాంచ్ కెనాల్‌కు వెళ్లారు. కెనాల్‌లోకి దిగిన వీరు కాలుజారీ మునిగిపోయారు. గమనించిన స్థానికులు అనుదీప్‌ను రక్షించగా, తరువాయి 8లో



## ఇక చిన్న తప్పులకు జరిమానాలే

### జైలు శిక్షలుండవ్

● పలు నిబంధనలలోని నేరపూరిత పరిధి నుంచి చిన్న చిన్న సాంకేతిక ఉల్లంఘనలను తొలగింపు
● తెలంగాణ ‘ప్రజా విశ్వాసం’ బిల్లును సభలో ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు ● సిపిఐ, కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం మద్దతు ● శాసనసభ ఆమోదం
● ‘ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్’కు మరింత ప్రోత్సాహం : మంత్రి దుద్దిళ్ల

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ చట్టాల తరహాలోనే రాష్ట్రంలోని పలు నిబంధనలలోని చిన్న చిన్న, సాంకేతిక ఉల్లంఘనలను నేరపూరిత పరిధి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన ‘తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు’ను శాసనసభ ఆమోదించింది. శాసనసభలో శనివారం ‘తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు’ ను మంత్రి ప్రవేశపెట్టగా చర్చ అనంతరం బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బిల్లుకు సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు, కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ రావు, దానం నాగేందర్, బిజెపి సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయ్ హరీశ్ బాబు, ఎంఐఎం సభ్యులు కౌసర్ మొహియుద్దీన్ మద్దతు తెలిపారు. తొలుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సభలో బిల్లు ప్రవేశపెడుతూ ఉద్దేశాలను వివరించారు. రాష్ట్రంలో పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. చిన్న తప్పులకు జైలు శిక్షల స్థానంలో జరిమానాలను మాత్రమే విధిస్తూ మార్పులు తీసుకురానున్నట్లు చెప్పారు. తద్వారా పారిశ్రామికవేత్తలకు, వ్యాపారులకు ఊరట లభించడమే కాకుండా వ్యాపార సౌలభ్యం (ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్), తరువాయి 8లో

### చట్ట సవరణ శుభపరిణామం

● సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని
● అటవీ, ఎక్సైజ్ చట్టాల్లోని అన్యాయమైన నిబంధనలనూ సవరించాలని విజ్ఞప్తి



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా చిన్న చిన్న నేరాలకు జైలు శిక్షలకు బదులుగా ఆర్థిక జరిమానాలు విధించేలా చట్టాలను సవరించడం మంచి నిర్ణయమని సిపిఐ శాసనసభా పక్షనాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అటవీ, ఎక్సైజ్ చట్టాల్లోని అన్యాయమైన నిబంధనలను కూడా సవరించాలని కోరారు. శాసనసభలో శనివారం తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు 2026పై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. గతంలో వ్యాపార కార్యకలాపాల అనుమతులు, నిబంధనలకు సంబంధించి జఠిలంగా ఉండేవని, మరోవైపు తరువాయి 8లో



గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి

## ప్రత్యేక అధికారులు

● వేడుకలు ముగిసేవరకూ మున్సిపల్, పోలీస్ శాఖలు నిరంతర పర్యవేక్షణ
● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
● నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగడానికి చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో లో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, అయితే, మంటప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని చెప్పారు. ఎక్కడెక్కడ మంటపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగడానికి చెరువుల వద్ద చుట్టూ క్రేన్లను ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శాసనమండలి సమావేశ హాల్‌లో హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి తరువాయి 8లో

## ‘క్యూర్’లో ఆస్తిపన్నులు అదనపు వసూళ్లుండవ్

● కనిష్ఠంగా 10శాతం మించవు ● 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లే లక్ష్యం : మంత్రి శ్రీధర్ బాబు ● ‘క్యూర్ బిల్లుకు’ శాసనసభ ఆమోదం
● భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ‘క్యూర్ యాక్ట్ 2026’


ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్లలో ఆస్థి పన్నులను అదనంగా వసూలు చేయబోమని, కనీష్టంగా పది శాతం పన్నులు మించబోవని స్పష్టం చేశారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ‘కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) బిల్లు 2026’ను శనివారం ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సిపిఐ, కాంగ్రెస్, ఎంఐఎం సభలో మద్దతు ప్రకటించగా, బిజెపి సభ్యులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అయితే బిజెపి బహిష్కృత ఎమ్మెల్యే రాజాసింగ్ మాత్రం ఈ బిల్లుకు మద్దతు పలికారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, తరువాయి 12లో

## ‘సౌదీ’ కీలక చమురు పైప్‌లైన్ మూసివేత

మరింత పెరగనున్న ప్రపంచ చమురు సంక్షోభం

● ఎర్ర సముద్రంలో వాణిజ్యంపై పట్టు బిగించిన హౌతీ
● బాబ్‌ఎల్‌మండ్ ద్వీపం, మోఖా ఓడరేవుల స్వాధీనం
● ఇరాన్ సారథ్యంలో కొత్త వార్‌ఫ్రంట్
● ఇరాన్‌–సౌదీ రాయబారుల చర్చలు
● 106 డాలర్లకు చేరిన ముడి చమురు ధర




**రియాద్ :** ఇరాన్ యుద్ధ పరిధి మరింతగా విస్తరించింది. ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీ తిరుగుబాటు సైన్యాలు పట్టు బిగించాయి.పశ్చిమాసియాలో ప్రస్తుతం చమురు రవాణాకు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతున్న బాబ్‌ఎల్‌మండ్ ద్వీపం,మోఖా ఓడరేవులు ఇరాన్ అనుకూల హౌతీ ఉగ్రవాద తిరుగుబాటు సైన్యాల అధీనంలోకి వెళ్ళిపోయాయి.మరోవైపు ఇరాక్ నుండి సౌదీఅరేబియాపై డ్రోన్ దాడులు జరగడంతో అత్యంత కీలకమైన చమురు సరఫరా పైపులైన్‌ను ఆ దేశ ప్రభుత్వం మూసివేసింది.ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు సరఫరాదారు దేశమైన సౌదీఅరేబియా హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణాలు తప్పించుకోవడానికి తరువాయి 12లో




భారత్ – చైనా సంబంధాల అభివృద్ధికి

## సరిహద్దు వెంబడి శాంతి అత్యవసరం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ స్పష్టీకరణ 08

# పాప్‌కార్న్

## బైరాన్‌పల్లి మారణకాండ




జలియన్‌వాలా బాగ్ మారణకాండకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించినప్పటికీ, తెలంగాణ చరిత్రలో బైరాన్‌పల్లి మారణకాండ స్థానిక జ్ఞాపకాల్లోనే ఎక్కువగా నిలిచిపోయింది. అప్పటి వరంగల్ ప్రాంతానికి చెందిన బైరాన్‌పల్లి గ్రామం రజాకార్ల దాడులను ఎదుర్కొనేందుకు స్థానిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. గ్రామస్తులు బురుజు వద్ద కాపలా కాస్తూ వడిసెలు, దేశీ తుపాకులు వంటి పరిమిత ఆయుధాలతో గతంలో జరిగిన దాడులను తిప్పికొట్టారు. రజాకార్లు, హైదరాబాద్ సంస్థాన పోలీసు బలగాలు గ్రామంపై పలుమార్లు దాడి చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 1948 ఆగస్టు 27న జరిగిన తుది దాడిలో హైదరాబాద్ సంస్థానానికి చెందిన పోలీసులు, సాయుధ బలగాలు, రజాకార్లు పాల్గొన్నట్లు వివిధ వృత్తాంతాలు పేర్కొంటున్నాయి. ఈ దళాలు ఫిరంగులు, బ్రెన్ గన్స్ వంటి అధిక శక్తి కలిగిన ఆయుధాలను ఉపయోగించాయి. గ్రామ రక్షణను ఛేదించిన తరువాత అనేక మంది గ్రామస్తులను ఒకచోట చేర్చి కాల్చి చంపారు. అయితే మృతుల సంఖ్య విషయంలో ఆధారాల మధ్య తేడా ఉంది. కొన్ని స్థానిక వృత్తాంతాలు సుమారు 120 మంది మరణించారని చెబుతుండగా, ఇతర చారిత్రక ఆధారాలు ఆగస్టు 27న జరిగిన హత్యలకు '96 మంది' అనే సంఖ్యను ముందుకు తెస్తున్నాయి. ఏదిఏమైనా బైరాన్‌పల్లిపై దాడులు నిజం.. మారణకాండ జరగడం నిజం. ప్రజలు తుపాకులకు ఎదురొడ్డి పోరాడిన మాట నిజం. ఇది 'తెలంగాణ జలియన్‌వాలా బాగ్' ఘటన అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

## మతపరమైన పోరాటం కాదు...


షోయబుల్లా ఖాన్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కేవలం హిందూ–ముస్లిం ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం ఇటీవల కాలంలో జోరుగా సాగుతున్నది. కానీ, ఈ వాదన, ఒక చారిత్రక వాస్తవాన్ని సంకుచితం చేస్తుంది. ఉద్యమానికి ప్రధాన ప్రాతిపదిక భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతులు సాగించిన వర్గపోరాటం. నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా హిందువులతో పాటు ముస్లిం రైతులు, మేధావులు కూడా ప్రతిఘటించారు. ఈ పోరాటంలో మతపరమైన గుర్తింపుకంటే భూమి, శ్రమ, సామాజిక న్యాయం వంటి ప్రశ్నలు ప్రధానంగా నిలిచాయి. ఈ లౌకిక స్వభావానికి షేక్ బందగి జీవితం ఒక ముఖ్యమైన ఉదాహరణ. 1946లో సాయుధ పోరాటం ప్రారంభం కావడానికి ముందే, విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డితో తన పూర్వీకుల భూమి హక్కుల కోసం బందగి సుదీర్ఘ న్యాయపోరాటం సాగించాడు. 1940లో దేశ్‌ముఖ్ అనుచరులు అతన్ని హత్య చేశారు. రైతుల భూహక్కుల కోసం అతను చేసిన పోరాటాన్ని తరువాతి తెలంగాణ ఉద్యమానికి ఒక ముందుమాటగా ఉద్యమ చరిత్ర గుర్తించింది. మరో ప్రముఖ ఉదాహరణ ఉర్దూ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్. 'ఇమ్రోజ్' పత్రిక సంపాదకుడిగా నిజాం నిరంకుశ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు. రజాకార్ల దౌర్జన్యాలను తన రచనల ద్వారా బహిర్గతం చేశారు. 1948 ఆగస్టు 21న రజాకార్లకు అనుబంధంగా ఉన్న వ్యక్తులు హైదరాబాద్‌లో ఆయనపై దాడి చేసి హత్య చేశారు. ఆయన హత్య తెలంగాణ పోరాటంలో ముస్లిం సమాజంలోని ప్రజాస్వామిక, నిరంకుశవాద వ్యతిరేక స్వరాలకు కూడా స్థానం ఉందని చూపించే విషాద ఉదాహరణగా నిలిచింది. అందువల్ల తెలంగాణ పోరాట చరిత్రను మతాల మధ్య ఘర్షణగా మాత్రమే చూడటం కంటే, భూస్వామ్య దోపిడీ, నిరంకుశ పాలన, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా వివిధ వర్గాల ప్రజలు కలసి సాగించిన పోరాటంగా అర్థం చేసుకోవడం చారిత్రకంగా సముచితం.

## ఆయుధాలు లేక...





తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గెరిల్లా దళాలు తమకు అందుబాటులో ఉన్న సాధనాలతోనే ప్రతిఘటనకు కొత్త పద్ధతులు రూపొందించుకున్నాయి. ఆధునిక తుపాకులు, ఇతర ఆయుధాలతో వచ్చిన రజాకార్లు, ప్రభుత్వ బలగాలను ఎదుర్కొనేందుకు రైతుల వద్ద తగిన ఆయుధాలు ఉండేవి కావు. ఈ పరిస్థితిలో వారు ఉపయోగించిన ప్రత్యేకమైన సాధనాల్లో గిల్లోరాలు (గుల్లెలు లేదా స్లింగులు) కూడా ఉన్నాయి. తోలుతో తయారుచేసిన గుల్లెల్లో చిన్న ఇనుప ముక్కలకు బదులుగా బరువైన, నున్నటి నది రాళ్లను ఉంచి



దూరం నుంచి విసిరేవారు. చెట్ల చాటున దాగి, పలువురు ఒకేసారి రాళ్లు విసిరితే శత్రు దళాల్లో గందరగోళం ఏర్పడేది. రాళ్ల దెబ్బలకు గాయాలు, ఎముకలు విరిగేవి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ముందుకు కదిలే రజాకార్లపై ఈ వ్యూహం కొంత ప్రభావం చూపిం ది. ఇలాంటిదే వడిసె కూడా. సాధారణంగా పొలాల్లో పక్షులను చెదరగొట్టడానికి ఉపయోగించి వడిసెల తెలంగాణ పోరాటంలో ఒక కీలకమైన ఆయుధంగా మారింది. 'విడసెల రాళ్లు నింపి, వడివడిగ కొట్టితేను.. నీ మిలటరి పారిపోయిరో నైజాము సర్కరోడా' అంటూ యాదగిరి దాని ప్రాముఖ్యతను చెప్పకనే చెప్పాడు. ఏదిఏమైనా, పరిమిత వనరులతో పోరాడిన రైతాంగం తమ పరిసరాలు, స్థానిక పరిజ్ఞానం, గెరిల్లా వ్యూహాలను ఎలా ఉపయోగించుకున్నదో గుల్లెల వినియోగం సూచిస్తుంది.

## సైనిక చర్య తర్వాత కూడా..

హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనం కావడంతో తెలంగాణ రైతాంగ పోరాటం ముగిసిపోయిందని సాధారణ చరిత్ర పాఠ్యాలు చెబుతాయి. కానీ వాస్తవానికి రైతాంగ సాయుధ పోరాటం మరో దశలోకి ప్రవేశించింది. నిజాం, రజాకార్లపై సాగిన పోరాటం స్థానంలో భారత సైన్యానికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం కొనసాగింది. జనరల్ జెఎన్ చౌధురి ఆధ్వర్యంలోని సైనిక పరిపాలన తెలంగాణ గ్రామాల్లో కమ్యూనిస్టు



ప్రభావాన్ని అణచివేయడానికి చర్యలు చేపట్టింది. రైతులు భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి వారికి అప్పగించాలన్న ప్రయత్నాలను ప్రతిఘటించారు. వేలాది మందిని అరెస్టు చేసి నిర్బంధ శిబిరాలకు తరలించగా, అనేక గ్రామాల్లో సైనిక దాడులు, చిత్రహింసలు చోటు చేసుకున్నాయి. ఈ పోరాటంలో మరణించిన వారి సంఖ్యపై చరిత్రకారుల మధ్య ఏకాభిప్రాయం లేదు. సుమారు 4,000 నుంచి 5,000 మంది మరణించారన్న వాదన బలంగా ఉంది. అయితే వారిలో 2,517 మందిగా పి. సుందరయ్య నమోదు చేయగా, వారందరినీ భారత సైన్యం చంపలేదని చరిత్రకారుడు డిఎన్ ధనగారే అంటారు. – **బిఎస్ఎస్ మైత్రేయి**

# ఆధిపత్యాన్ని బ్రిక్స్ బద్దలు కొట్టేనా?

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాలతో కూడిన 'బ్రిక్స్' ను పశ్చిమ దేశాల ఆధిపత్య ధోరణికి గండి కొట్టే ఒక వేదికగా అందరూ ఆకాంక్షిస్తున్నారు. సంపద దోపిడీకి గురవుతున్న దక్షిణార్థ గోళంలోని అధిక అభివృద్ధి చెందిన దేశాలు ఇందులో భాగస్వామి కావడమే ఇందుకు కారణం. రష్యా, చైనాలు పశ్చిమ దేశాలకు దీటుగా నిలుస్తుండగా, భారతదేశం, దక్షిణ ఆఫ్రికా, దక్షిణ అమెరికాలోని బ్రెజిల్ దేశాలు అపారమైన సహజ వనరులు, జనాభా కలిగిన దేశాలు. బలీయమైన అంతర్జాతీయ శక్తులు ఎదిగే అవకాశముంది. బ్రిక్స్‌లో ఈ ఐదు దేశాలే కాకుండా మరో 6 సభ్యదేశాలు కలిపి, ప్రపంచంలో 49 శాతం జనాభా, 40 శాతం జిడిపికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అందుకే అమెరికా, సహా పశ్చిమ దేశాలకు బ్రిక్స్ సమావేశాల పట్ల పైకి ఆసక్తి లేనట్లు కనిపించినా, ఏమి జరుగుతోందో ఒక కన్నేసి ఉంటాయి.

బ్రిక్స్ అనగానే ప్రధానంగా గుర్తొచ్చేది డాలర్‌కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీ. ఈ ప్రతిపాదనను బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా బలంగా ముందుకు తీసుకువస్తుంటారు. అలాగే శతకోటీశ్వరులుపై 2 శాతం సంపద పన్ను విధించాలనే ప్రతిపాదన కూడా నలుగుతోంది. ఈ అంశాలు బ్రిక్స్ అనుబంధ ఫోరమ్స్‌లలో చర్చకు వచ్చాయి. బ్రిక్స్ కామన్ కరెన్సీ సాకరమవుతుందేమోననే భయం అమెరికాకు వెంటాడుతూనే ఉంది. అందుకే రియో డి జెనిరోలో జరిగిన గత బ్రిక్స్ సదస్సు సమయంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రయత్నాలపై గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా డాలర్‌ను పక్కన బెట్టే ఎలాంటి కరెన్సీని అంగీకరించబోమని, అలా చేస్తే ఆయా దేశాలపై టారిఫ్‌ను వంద శాతం పెంచేస్తామని హూంకరించారు ట్రంప్. అయితే, బ్రిక్స్ కామన్ కరెన్సీ ఒక అడుగు ముందు రెండు అడుగులు వెనక్కి అనే మాదిరిగానే సాగుతోంది.

ఈసారి బ్రిక్స్‌కు అధ్యక్షత స్థానంలో ఉన్న భారతదేశ రాజధాని న్యూ ఢిల్లీలో 18వ సమావేశం ప్రారంభమైంది. దీనికి రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్‌లు ఇక్కడకు చేరుకున్నారు. తమ నేలపై బాంబుల వర్షం కురిపిస్తున్నా అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఎదురొడ్డి నిలుస్తున్న ఇరాన్ దేశం అధ్యక్షుడు మౌసూద్ పెజిష్కియాన్ ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఢిల్లీ సదస్సు ఉమ్మడి ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బ్రిక్స్ సభ్యదేశాలతో ముడిపడి ఉన్న రష్యా ఉక్రేన్ యుద్ధం, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం, ఇరాన్ – సౌదీ అరేబియా–యుఎఇ సంబంధాలు తదితర అంశాల నేపథ్యంలో సదస్సు ప్రాధాన్యత సంతరించుకున్నది. గత సమావేశాల్లో రష్యా–ఉక్రేన్ దాడుల విషయంలో అనేక తర్జన భర్జనలు జరిగాయి.

పాతికేళ్ల క్రితం మొగ్గ తొడిగిన ఆలోచనతో ఏర్పాటైన బ్రిక్స్ 18 ఏళ్లుగా ప్రస్థానాన్ని సాగిస్తున్నది. జి 7 జి 21 శిఖరాగ్ర కూటములకు భిన్నంగా మానవత, సమతా దృక్పథంతో ఈ కూటమి పని చేస్తుంది. వెన్న వెంటనే ప్రపంచ రాజకీయ చిత్రపటంలో మార్పులు ఆశించడం అత్యాశే అయినప్పటికీ బ్రిక్స్ ఒక సానుకూల వేదిక. పరస్పర సహకారం, అసమాన ఎగుమతి దిగుమతుల అంతరాల తగ్గింపు, డాలర్ రహిత వాణిజ్య ప్రోత్సాహం, సాంకేతిక మార్పిడి, బహుళ ధృవ ప్రపంచ గమనంలో బ్రిక్స్ ఒక ఉత్తమ వేదిక. ఇది సరైన మార్గంలో ముందుకు సాగితే ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ సాధ్యమే. అగ్ర రాజ్యాల వివక్షా పూరిత ఆధిపత్యానికి చెక్ పెట్టే ఒక సాధనం ఈ కూటమి. ●

# ఐదు దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటానికి గురు 'అవంతే'

**ల్యూక్ రొటెల్లో, మోత్ విస్నెస్కి**

పోర్చుగల్ రాజధాని లిస్బన్‌కు సమీపంలోని శెజాల్ నగరంలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన 'అవంతే ఉత్సవం' (ఫెస్టా డొ అవాంతే) 50వ వార్షికోత్సవంలో లక్షలాది మంది కమ్యూనిస్టులు, కార్మికులు, యువకులు, మద్దతుదారులు పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి పేరు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రచురించే 'అవంతే!' పత్రిక నుంచి వచ్చింది. ఆ పదానికి ఆంగ్లంలో 'ముందుకు' అనే అర్థం. ఈ భారీ సమాహారాన్ని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తుంది. ప్రతి ఏడాది జరిగే ఈ ఉత్సవం 1974 కార్నేషన్ విప్లవం తరువాత పోర్చుగల్‌లో ప్రజాస్వామ్యం కోసం సాగిన పోరాటాన్ని స్మరించుకుంటుంది. వామపక్ష, కమ్యూనిస్టు భావజాలానికి అనుకూలంగా ఉన్న పోర్చుగీస్ సైనిక విభాగాలు నిర్వహించిన ఈ తిరుగుబాటు రక్తపాతం లేకుండా జరిగింది. దాంతో 40 ఏళ్లకు పైగా దేశాన్ని భయానక నిర్బంధం, రాజకీయ అణచివేతతో పాలించిన ఫాసిస్టు 'ఎస్టాడో నోవో' పాలనకు తెరపడింది. ఎస్టాడో నోవో ప్రభుత్వం దేశంలో వేలాదిమంది కమ్యూనిస్టులను అరెస్టు చేసి, జైళ్లలో పెట్టి, చిత్రహింసలకు గురిచేసింది. పోర్చుగీస్ వలస పాలనలో ఉన్న ప్రాంతాల్లో దాని హింస మరింత విస్తృతంగా సాగింది. గినియాబిస్సావు, కేప్ వెర్డే, అంగోలా, మొజాంబిక్, తూర్పు తిమోర్ తదితర ప్రాంతాల్లో శక్తివంతమైన వలస వ్యతిరేక ఉద్యమాలు ఏర్పడ్డాయి. 1960ల నుంచే అవి స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటాలు ప్రారంభించాయి. విప్లవం జరిగే సమయానికి ఎస్టాడో నోవో ప్రభుత్వం లక్షలాది మందిని, ప్రధానంగా సాధారణ పౌరులను, హతమార్చింది. సైనికుల తుపాకుల గొట్టాలకు శాంతికి ప్రతీకగా కార్నేషన్ పూలను పెట్టినందుకు ఈ విప్లవానికి 'కార్నేషన్ విప్లవం' అనే పేరు వచ్చింది. ఈ విప్లవం వలస విమోచన ఉద్యమాలపై పోర్చుగల్ సాగిస్తున్న యుద్ధాలకు ముగింపు పలికింది. ప్రజాస్వామ్యాన్ని తిరిగి తీసుకొచ్చింది. అయితే ఈసారి కార్మికులు ఉద్యమానికి నాయకత్వం వహించారు. సమ్మెలు, భారీ ప్రజా ఆందోళనలు, విప్లవ వ్యతిరేక కుట్రలతో కూడిన అస్థిరమైన పరివర్తన దశ తరువాత పోర్చుగల్ రాజ్యాంగ పరిషత్‌ను ఎన్నుకుంది. అందులో కమ్యూనిస్టులకు గణనీయమైన ప్రాతినిధ్యం లభించింది. దాని ఫలితంగానే 1976 లో ప్రగతిశీల రాజ్యాంగం రూపొందింది. ప్రతి ఏడాది జరి గే 'అవంతే' ఉత్సవంలో ఈ రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా స్మరించుకుంటారు.

ఈ ఉత్సవం విస్తృతమైన సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుంది. సాహిత్యం, కళా ప్రదర్శనశాలలు, నాటకం, సినిమా, శాస్త్ర విజ్ఞానం, రాజకీయ చర్చలు, నృత్యం, సంగీతంఅన్నీ ఇందులో భాగమవుతాయి. ప్రధాన మార్గాల్లో డ్రమ్ బృందాల చుట్టూ చిన్న చిన్న సమూహాలు ఏర్పడుతుంటే, సింఫనీ ఆర్కెస్ట్రాలు, రాక్ బ్యాండ్లు వేలాది మందిని ఆకర్షిస్తాయి. వారి ప్రదర్శనల మధ్య '25 డె ఎబ్రిల్ సెంప్రె, ఫాసిస్మొ మున్కా మయిస్' (ఏప్రిల్ 25 ఎప్పటికీ; ఫాసిజం మళ్లీ ఎన్నటికీ వద్దు) వంటి నినాదాలు మారుమోగుతాయి. లిస్బన్‌లోని కమ్యూనిస్టు పార్టీ శాఖలు ఆహారం, సమాచార సామగ్రి, పార్టీ ప్రచార వస్తువులతో పెద్ద స్టాళ్లను ఏర్పాటు చేస్తాయి. నగరానికి వెలుపల ఉన్న పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రాంతీయ శాఖలు కూడా తమ తమ ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రతిబింబించే స్టాళ్లను ఏర్పాటు చేస్తాయి. ఆయా ప్రాంతాలకు చెందిన సంప్రదాయ ఆహార పదార్థాలతో పాటు కళా ప్రదర్శనలు, గోడచిత్రాలు కనిపిస్తాయి. సార్వత్రిక ప్రజా రవాణా కోసం, జాతీయ పార్కుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఆహార స్వావలంబన కోసం స్థానిక డిమాండ్లు ఆ గోడచిత్రాల్లో వ్యక్తమవుతాయి.

పార్టీ యువజన విభాగమైన పోర్చుగీస్ కమ్యూనిస్టు యువజన సంఘం(జెసిపి)కు చెందిన ఒక సభ్యుడు చెప్పినట్లు, ఆహారాన్ని ప్రదర్శించడం కూడా రాజకీయ ప్రకటనగానే మారుతుంది. ఒకవైపు జాతి, మతపరమైన అణచివేతల మధ్య నిలిచిన వంటకాల సంప్రదాయాలను అది ప్రతిబింబిస్తుంది. మరోవైపు దేశం ఆహార స్వావలంబన కోసం సాగిస్తున్న పోరాటాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.

యురోపియన్ యూనియన్ (ఇయు) అమలుచేసే ఆర్థిక విధానాలు ప్రతి దేశం కొన్ని నిర్దిష్ట వస్తువుల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇచ్చేలా చేస్తాయి. ఫలితంగా పోర్చుగల్ వ్యవసాయ రంగం స్వయం సమృద్ధి స్థితి నుంచి దిగుమతులపై ఆధారపడే స్థితికి చేరింది. భూసంస్కరణలు, వ్యవసాయ సమీకరణలో పోర్చుగల్ గతంలో సాధించిన విస్తృత పురోగతి కూడా ఈ పరిణామంతో ప్రభావితమైంది. ఈ భారాన్ని గ్రామీణ కార్మిక వర్గం మోయాల్సి వచ్చింది. అదే సమయంలో పోర్చుగల్‌లోని అతిపెద్ద నగరాలు, అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక ప్రాంతాలు గృహాలపై ఊహాజనిత పెట్టుబడులు, ఆర్థిక వ్యవస్థలో అనధికారికత పెరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దేశంలో బలవంతంగా సాగిన పారిశ్రామికీకరణ తగ్గుదలతో పాటు ఇయు పౌరులకు స్వేచ్ఛగా దేశాల మధ్య సంచరించే అవకాశాలు పెరిగాయి. దీంతో మొత్తం ఆర్థిక వ్యవస్థ పర్యాటకరంగం వైపు మళ్లింది. ఫలితంగా తరతరాలుగా నివసిస్తున్న ప్రాంతాల నుంచి కార్మికవర్గంలోని విస్తృత వర్గాలు బయటకు వెళ్లాల్సి వచ్చింది. వారు ఆతిథ్య రంగంలోకి, తాత్కాలిక ఉపాధిలోకి బలవంతంగా అడుగుపెట్టక తప్పలేదు. 'అవంతే' ఉత్సవానికి వచ్చిన వారందరూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీతో ప్రత్యక్షంగా అనుబంధం ఉన్నవారు కాదు. అయినప్పటికీ 1974 విప్లవం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచిన పౌర స్వేచ్ఛలను కాపాడాలనే పార్టీ పిలుపు దేశంలోని అనేక వామపక్ష, ప్రగతిశీల ఉద్యమాలకు చెందిన ప్రజలను ఆకర్షించింది. అదే సమయంలో ప్రతి రోజూ, ప్రతి సాయంత్రం జరిగే సంగీత కార్యక్రమా



లకు వివిధ నేపథ్యాల నుంచి వచ్చిన యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవ ప్రాంగణంలోని స్టాళ్లు, దారుల వెంట పోర్చుగీస్ రాజ్యాంగంలోని వివిధ అంశాలను ప్రతిబింబించే గోడచిత్రాలు కనిపించాయి. యంగ్ పయనీర్స్ విభాగంలో అయినా, అంతర్జాతీయ విభాగంలో అయినా, శ్రామిక ప్రజల చట్టబద్ధ హక్కులను కాపాడాలనే భావన మొత్తం ఉత్సవంలో ప్రధాన సాంస్కృతిక ప్రవాహంగా కనిపించింది. రాజకీయ మితవాద శక్తులు రాజ్యాంగంలోని కొన్ని అంశాలను బలహీనపరచడానికి లేదా తమకు అనుకూలంగా కొత్త అర్థాలు చెప్పడానికి న్యాయపరమైన పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో, పౌర స్వేచ్ఛల పరిరక్షణ నిరంతర ప్రక్రియ అని కమ్యూనిస్టు పార్టీ ఉత్సవానికి వచ్చిన వారికి గుర్తుచేసింది. కొత్త రాజకీయ, ఆర్థిక పరిస్థితులు ఏర్పడిన ప్రతిసారీ వాటిని ఎదుర్కొంటూ ఆ పోరాటాన్ని కొనసాగించాల్సి ఉంటుందని పార్టీ పేర్కొంది. రాజ్యాంగంలోని 73వ అధికరణాన్ని ఒక జెసిపి సభ్యుడు ప్రస్తావించాడు. శాస్త్రీయ ఆవిష్కరణలు సమష్టి ప్రయోజనం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆ అధికరణం హామీ ఇస్తుంది. అయితే లింగ గుర్తింపుకు అనుగుణమైన వైద్య సేవలు పొందేందుకు పోర్చుగల్‌లోని ట్రాన్స్‌జెండర్ పౌరులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను ఆయన దానితో పోల్చారు. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రజాస్వామిక హక్కులను కాపాడకుండా, కొన్ని విభజనవాద శక్తులు వ్యూహాత్మకంగా తీవ్ర మితవాద పక్షంతో చేతులు కలిపి రాజ్యాంగంలోని కొన్ని అంశాలను సవాలు చేయడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ఈ ఏడాది 'అవంతే' ఉత్సవం పోర్చుగల్‌లో తీవ్రతరమైన ఛాందసవాద పార్టీ 'చేగా' (చాలు!) రాజకీయ ప్రభావం పెరుగుతున్న సమయంలో జరిగింది. ఈ పార్టీని అమెరికాలోని 'మగా' ఉద్యమంతో పోలుస్తున్నా రు. శుభ్రమైన పోర్చుగల్ కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చే చేగా నినాదాలతో కూడిన పోస్టర్లు లిస్బన్ అంతటా కనిపిస్తున్నాయి. నగరంలోని వేలాది వీధి దీపాల స్తంభాలపై ఆ పార్టీ నాయకుడి ముఖచిత్రా లు కనిపించాయి. పోర్చుగల్‌లో చాలా సంవత్సరాలుగా సోషలిస్టు పార్టీ (పిఎస్), సోషల్ డెమొక్రటిక్ పార్టీ (పిఎస్‌డి) మారుమారుగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే ఈ రెండు పార్టీలూ ఇప్పుడు స్తబ్దతకు గురయ్యాయని, కార్మిక వర్గానికి, చిన్నా పెద్దా పెట్టుబడిదారీ ప్రయోజనాలకు మధ్య ఏర్పడిన సంబంధాలను సమర్థంగా నిర్వహించలేకపోతున్నాయని విమర్శకులు అంటున్నారు. దీనివల్ల ఆర్థిక పెట్టుబడి శక్తులకు మరింత స్వేచ్ఛ లభించింది. అవి పిఎస్, పిఎస్‌డి పార్టీలలోనూ, వెలుపల కూడా ప్రభావాన్ని పెంచుకున్నాయి. అధికారాన్ని క్రమంగా మితవాదుల చేతుల్లోకి మార్చే ప్రక్రియకు అవి మధ్యవర్తిత్వం వహిస్తున్నాయని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లోనూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం, శాంతి, ప్రగతికి గట్టి రక్షకురాలిగా నిలిచింది. గత డిసెంబర్, జూన్ నెలల్లో జరిగిన రెండు సాధారణ సమ్మెల్లో ఇది స్పష్టంగా కనిపించింది. పోర్చుగీస్ కార్మికుల సాధారణ సమాఖ్య (సిజిటిపిఐఎన్) నాయకత్వంలో జరిగిన ఈ సమ్మెలు ప్రభుత్వం ప్రతిపాదించిన కార్మిక చట్టాల ప్యాకేజీని వెనక్కి తగ్గేలా చేశాయి. అదే సమయంలో తీవ్ర కుడిపక్ష రాజకీయాల అసలు ఉద్దేశాలపై పోర్చుగీస్ ప్రజల్లో కొత్తస్థాయి రాజకీయ చైతన్యాన్ని అవి మేల్కొల్పాయి.

ఈ ఉత్సవంలో పాలస్తీనా సంఘీభావం ప్రధాన అంశంగా నిలిచింది. అంతర్జాతీయ ప్రతినిధుల విభాగంలో పాలస్తీనా విమోచన సంస్థ ప్రతినిధులు సమాచార స్టాళ్లను ఏర్పాటు చేశారు. సంగీత కార్యక్రమాల్లో పాలస్తీనా కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. అనేక అధికారిక ప్రదర్శనల్లో పాలస్తీనా జెండాలు కనిపించాయి. పలువురు పాల్గొనేవారు కూడా ఆ జెండాలను చేతబట్టారు. ఉత్సవం ముగింపు దశకు చేరుకున్నప్పుడు వేలాదిమంది పార్టీ సభ్యులు, సందర్శకులు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ, జెసిపి జెండాలను చేతబట్టి ప్రధాన వేదిక ముందు ఉన్న ప్రాంగణాన్ని నింపారు. 'పిసిపి' అంటూ నినాదాలు, 'క్యూబా వెన్సెర్' (క్యూబా విజయం సాధిస్తుంది!) అంటూ నినాదాలు మారుమోగాయి. ఆ ప్రాంగణాన్ని ఉర్రూతలూగించాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ నాయకుల ప్రసంగాలను వినేందుకు కూర్చున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పాలో రైముండో పాలస్తీనాకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న అంతర్జాతీయ ఉద్యమానికి పార్టీ సంఘీభావాన్ని మరోసారి ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ విధానాలకు అనుగుణంగా నడిచే ప్రభుత్వాలు చూపించని సంఘీభావాన్ని ప్రపంచవ్యాప్తంగా వీధుల్లోకి వస్తున్న ప్రజలు చూపిస్తున్నారని ఆయన అన్నారు. పాలస్తీనా రాజ్యాన్ని గుర్తించడానికి నిరాకరిస్తున్న పిఎస్/ పిఎస్‌డి ప్రభుత్వం అందుకు ఉదాహరణ అని ఆయన విమర్శించారు. ముగింపు కార్యక్రమంలో క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్‌కానెల్ వీడియో సందేశం కూడా ప్రసారం చేశారు. క్యూబా సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ సాగిస్తున్న పోరాటాన్ని ఆయన అభినందించారు. క్యూబా కమ్యూనిస్టు పార్టీ తరఫున సంఘీభావాన్ని ప్రకటించారు. 'క్యూబా ప్రజల గౌరవం, ధైర్యం, సిద్ధాంతపరమైన నిబద్ధత, త్యాగ స్ఫూర్తి, విప్లవ స్ఫూర్తిని సామ్రాజ్యవాదులు జీర్ణించుకోలేకపోతున్నారు' అంటూ డియాజ్‌కానెల్ అన్నా రు. 'కమ్యూనిస్టు పార్టీలకు జయహో!' అని ఆయన తన సందేశాన్ని ముగించారు. నాయకుల ప్రసంగాలు ముగిసే సమయానికి ఉత్సవం చివరి ఘట్టం కోసం ప్రజల్లో ఉత్కంఠ పెరిగింది. 'ది ఇంటర్నేషనల్', 'అవంతే, కామరాడా' (ముందుకు, కామ్రేడ్!), ఉత్సవ ఉద్యమగీతమైన 'కార్వల్హేసా' గీతాలు వినిపించాయి. ప్రపంచ కార్మికవర్గ ఐక్యత అనే సందేశాన్ని నాయకులు ప్రసంగాల్లో వ్యక్తం చేశారు. చివరి ఘట్టంలో అదే ఐక్యత నృత్యంగా, సంగీతం గా, సామూహిక ఉత్సాహంగా ప్రత్యక్షమైంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు జెండాలు వేలాదిమంది చేతుల్లో రెపరెపలాడాయి. చేతుల్లోనూ, మనసుల్లోనూ కార్నేషన్ పూలతో ప్రజలు ఉత్సవానికి ముగింపు పలికారు.

*(పీపుల్స్ వరల్డ్ సౌజన్యంతో ఐపిఎ సర్వీస్ నుంచి)*

# తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు...మల్లు స్వరాజ్యం

నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా & నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆ యుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. వేలాది గ్రామాలు వెట్టి చాకిరీ నుండి విముక్తి పొందాయి. పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. కాని ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరులు కావడం కడు విషాదకరం. తెలంగాణ సాయుధ పోరాటయోధులలో ఒకరుగా నిలిచిన మల్లు స్వరాజ్యం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని (ప్రస్తుత సూర్యాపేట జిల్లా) తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో భీంరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు 1931వ సంవత్సరంలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'స్వరాజ్' అనే నినాదం పట్ల ఆమె తల్లిదండ్రులు ఎంతగానో ప్రభావితులై ఆ స్వరాజ్యోద్యమ కాలాన్ని గుర్తుచేసే విధంగా ఆమెకు 'స్వరాజ్యం' అని పేరు పెట్టడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. మల్లు స్వరాజ్యం భూ స్వా మ్య కుటుంబంలో జన్మించిన నూ ఆలోచనలు, ఆశయాలు మాత్రం సమ సమాజం వైపుగా పయనింపజేశాయి. ఆమె తన సోదరుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బి.ఎన్. రెడ్డి) అడుగుజాడల్లో నడిచి క్రమంగా ఆమె తెలంగాణ సాయుధ పోరుబాట దిశగా ముందుకు సాగారు. స్థానిక భూ స్వామ్యుల, జమీందారుల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా మరియు రజాకారుల అరాచకాలకు, అకృత్యాలకు వ్యతిరేకం గా ప్రారంభమైన తెలంగా ణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం పదమూడేళ్లకే తుపాకీ పట్టి తెలంగాణ ఉద్యమానికి 'సాయుధ దన్ను'గా నిలిచి ఉ



ద్యమించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భాగంగా మల్లు స్వరాజ్యం మహిళా కమాండర్ గాను ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్‌జిల్లాలలో ఉద్యమాలు నిర్వహించారు. 1947 లో రజాకార్లు తన ఇంటిని తగులబెట్టినను, నిజాం ప్రభుత్వం తనని పట్టించిన వారికి పదివేల రూపాయల జరిమానాను ప్రకటించినా ఏ మాత్రం అధైర్యపడకుండా మరింతగా ముందుకు సాగి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ఒక వ్యక్తిగా కాకుండా 'ప్రజాశక్తి'గా ప్రజ్వలించి చివరి దశ వరకు వీరోచిత పోరాటం సాగించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) తరపున ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి మల్లు స్వరాజ్యం రెండు పర్యాయాలు (1978–1983 & 1983– 1984) శాసనసభ్యురాలుగా కొనసాగారు. కార్మిక కర్షక సమస్యలపై ఆమె ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి ఆయా సమస్యల పరిష్కారాల దిశగా ఉద్యమించారు.అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) లో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకురాలిగా మల్లు స్వరాజ్యం అనేక మహిళా సమస్యల పరిష్కారాలకోసం అహర్నిశలు ఉద్యమించారు. ఉమ్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన మద్యపాన నిషేధ వ్యతిరేక పోరాటంలోనూ ఆమె క్రియాశీలకంగా ఉద్యమించారు. 'నా మాటే తుపాకీ తూటా' అన్న పేరుతో మల్లు స్వరాజ్యం ఆత్మకథ వెలువడి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకంగా నిలిచింది. పీడిత ప్రజానీకానికి పోరాట స్ఫూర్తిని రగిలించిన మల్లు స్వరాజ్యం తన 91 సంవత్సరాల వయసులో 2022, మార్చి 19 నాడు మరణించారు.

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా**

**జె.జె.సి.పి.బాబూరావు,** 94933 19690


# పాడి రైతులకు అండగా నిలుస్తాం

- విజయ డెయిరీని మరింత బలోపేతం చేస్తాం
- శాసనమండలిలో మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలుస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఎల్.రమణ, నెల్లికంటి సత్యం, బండ ప్రకాశ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందన్నారు. 2023–2024లో రోజుకు సగటున 3.60 లక్షల లీటర్లు, 2024–25లో 4 లక్షల లీటర్లు, 2025–26లో 3.36 లక్షల లీటర్ల పాలను సేకరించినట్లు వివరించారు. విజయ డెయిరీ ఆధునికీకరణ, నాణ్యమైన పాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌ను పెంచడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పాల డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసాన్ని తగ్గిస్తామని చెప్పారు. పశువైద్యశాఖలో 110 మంది వైద్యులు, 304 మంది కాంపౌండర్లను నియమించినట్లు వెల్లడించారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెల పంపిణీతో పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

### పాడి పరిశ్రమకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



పాడి పరిశ్రమకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. వ్యవసాయ రంగంలో పాడి పరిశ్రమ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో విజయ డెయిరీ పాల సేకరణ ప్రశ్నపై జరిగిన చర్చ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం పాడి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించకపోవడంతో ఈ రంగం క్రమంగా క్షీణించిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలను దిగుమతి చేసుకునే పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. భారీ రుణాలు, సబ్సిడీలు అందించి యువ పాడి రైతులను ప్రోత్సహించాలని కోరారు. రైతులకు గతంలో అందించినట్లు రూ.4 సబ్సిడీ అందించాలని సూచించారు. అలాగే ప్రస్తుతం పాల ధరలు భారీగా పెరిగాయని, వాటిని నియంత్రించాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

### తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దుతాం: మంత్రి వాకిటి శ్రీహరి

క్రీడలను విద్యతో అనుసంధానం చేసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (వైఐపిఇఎస్)ను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు బల్మూర్ వెంకట్ నర్సింగరావు, బి.మహేశ్ కుమార్ గౌడ్, శ్రీపాల్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వైఐపిఇఎస్‌లో స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పరిశోధనతో పాటు ఆధునిక శిక్షణకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నామని, ఇందుకు రూ.272 కోట్ల అంచనా వ్యయం ఉంటుందని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియాన్ని రూ.700 కోట్లతో పిపిపి విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని తెలిపారు.

### నాగ్‌పూర్–వరంగల్ హైవే పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నాగ్‌పూర్ మంచిర్యాల వరంగల్ ఖమ్మం విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని 2027 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ హైవే మొత్తం 310 కిలోమీటర్లు కాగా, అందులో 280 కిలోమీటర్లు తెలంగాణలోనే ఉందని మంత్రి తెలిపారు. భూసేకరణలో రైతులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరకాల ప్రాంతానికి సమీపంలో ఎగ్జిట్ ఏర్పాటు చేసేలా ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు.

### తెలంగాణ సాధనలో కళాకారులది కీలకపాత్ర: మంత్రి జూపల్లి కృష్ణారావు



తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు దాసోజు శ్రవణ్, విజయశాంతి, అద్దంకి దయాకర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన కళా, సాహిత్య రంగాలకు చెందిన ఎనిమిది మంది స్ఫూర్తిప్రదాతలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. తెలంగాణ ఔన్నత్యాన్ని చాటిచెప్పే జానపద కళలు మరుగున పడకుండా కళాకారుల సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జానపద కళలు కనుమరుగైతే రాష్ట్ర సాధన చరిత్రను భావితరాలకు తెలియజేయడం కష్టమవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

### పరిశ్రమలు తరలివెళ్లడం అబద్ధం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



తెలంగాణ నుంచి పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయన్న ప్రచారం అవాస్తవమని ఐటి, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పరిశ్రమలకు టిజిఐఐసి ద్వారా పారదర్శకంగా స్థలాలను కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి ఒక్క పరిశ్రమ తరలివెళ్తే పది పరిశ్రమలను తీసుకొచ్చే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను ఐటి హబ్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

### వ్యవసాయ ఆధారిత కంపెనీలకు ప్రోత్సాహం

తెలంగాణలో వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్నామని ఐటి, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరాం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో సుమారు 47 ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లకు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 229 ఎకరాలకు సంబంధించి రూ.104 కోట్లు చెల్లించామని, తద్వారా 2 వేలకుపైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. తెలంగాణకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత కంపెనీలు భారీగా తరలివచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

### మహిళల అభివృద్ధికి వెయ్యి రోజుల్లో రూ.70 వేల కోట్ల చేయూత: మంత్రి సీతక్క



మహిళల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో బ్యాంకుల సహకారంతో మహిళలకు రూ.70 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందించినట్లు వెల్లడించారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, బస్సుల కొనుగోలు, సూక్ష్మ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, మహిళా రైతులకు డ్రోన్ల అందజేత వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.




# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజాం రాచరికం, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సాగించిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ నిజాం రాచరిక పాలన, భూస్వాముల పెత్తనం, దౌర్జన్యాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం లేకపోవడంతో పాటు సభలు, సమావేశాలు నిర్వహించి పాలకులను ప్రశ్నించే హక్కు కూడా ప్రజలకు లేకుండా చేశారని తెలిపారు. ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. రైతులు పండించిన పంటను కూడా ఇళ్లకు తీసుకెళ్లనివ్వకుండా భూస్వాముల గూండాలు దోచుకునేవారని, చాకలి ఐలమ్మ వంటి కౌలు రైతుల పక్షాన ప్రజా ఉద్యమం నిలిచిందని చెప్పారు. దీనిని భరించలేని దేశ్‌ముఖ్, విసునూరు రామచంద్రారెడ్డి, జన్నపరెడ్డి ప్రతాపరెడ్డి లాంటి వేలాది ఎకరాలు కలిగిన భూస్వాములు ప్రజలపై ఆయుధాలతో దాడులు చేశారని, భూస్వాముల ప్రైవేటు సైన్యంగా రజాకారులు ప్రజలపై తీవ్ర హింసలకు పాల్పడ్డారని, మహిళలపై అత్యాచారాలకు తెగబడ్డారన్నారు. ఈ దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు సాయుధ పోరాటం సాగించారని, లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడంతో పాటు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించి కౌలుదారుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. రాచరిక, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా సాధారణ ప్రజలు సాగించిన ఈ పోరాటం ప్రపంచంలోని అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు.

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బిజెపి ఇప్పుడు ఆ చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఈ.టి.నరసింహ విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్, పి.వి.నరసింహారావు వంటి నాయకులను తమ ఖాతాలో వేసుకోవడంతో పాటు చిట్యాల ఐలమ్మ వంటి కమ్యూనిస్టు ఉద్యమ యోధుల చిత్రాలను ఉపయోగించుకోవడం చరిత్రను దొంగిలించడమేనన్నారు. సాయుధ పోరాటాన్ని మతాల మధ్య జరిగిన యుద్ధంగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు... జనాభా ప్రాతిపదికన

# సంపద పంచడానికి సిద్ధమా?

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాల నరసింహ సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న వారు ముందుగా దేశ సంపద, భూములు, సహజ వనరులు, విద్య, ఉద్యోగాలు, పరిశ్రమల్లో జనాభా ప్రాతిపదికన వాటా పంచడానికి సిద్ధమా? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాల నరసింహ సవాల్ విసిరారు. విశాఖపట్నంలో డిహెచ్‌పిఎస్ 20వ వార్షికోత్సవం సందర్భంగా అంబేద్కర్ ఆడిటోరియంలో జె.వి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా బాల నరసింహ మాట్లాడుతూ శతాబ్దాలుగా సామాజిక, ఆర్థిక అణచివేతకు గురైన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వ్యతిరేకించడం అన్యాయమన్నారు. రిజర్వేషన్లు ఎవరికీ దానం కాదని, సామాజిక న్యాయం సాధించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టం చేశారు. దేశ జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర వెనుకబడిన వర్గాలు గణనీయంగా ఉన్నప్పటికీ సంపద, భూములు, పరిశ్రమలు, విద్య, ఉద్యోగాలు, అధికార వ్యవస్థల్లో వారి వాటా జనాభా నిష్పత్తికి అనుగుణంగా లేదన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న తీరును ప్రశ్నించకుండా రిజర్వేషన్లను మాత్రమే వ్యతిరేకించడం వెనుకబడిన వర్గాలపై వివక్షను కొనసాగించడమేనని విమర్శించారు. కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు పూర్తిగా నిర్మూలించే వరకు రిజర్వేషన్ల అవసరం ఉంటుందని అన్నారు. కుల నిర్మూలన, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ తెలంగాణ అధ్యక్షుడు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, నాయకులు బి.అశోక్, పొన్నగంటి లావణ్య, పొన్నగంటి రాజేష్, బి.సంతోష్, ఆనందరావు, గోపాలరావు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలి

- కనీస ఛార్జి రూ.40.. కిలోమీటర్‌కు రూ.18గా నిర్ణయించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆటో సంఘాల జెఎసి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో మీటర్ ఛార్జీలను పెంచి కనీస ఛార్జిని రూ.40గా, ప్రతి కిలోమీటర్‌కు రూ.18గా నిర్ణయించాలని తెలంగాణ ఆటో రాష్ట్ర సంఘాల యాప్ ఆధారిత సంఘాల జెఎసి నాయకులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రిని కలిసి ఈ నెల 7న జరిగిన ఆటో యూనియన్ నాయకుల సమావేశంలో చర్చించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు విధివిధానాలను రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను రూపొందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. జిఓ నంబర్ 263లో మిగిలి ఉన్న ఆటో పర్మిట్లను త్వరలో జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర జిల్లాల ఆటోలను హైదరాబాద్‌లో నిషేధిస్తూ, ఆయా జిల్లాల ప్రజల అవసరాల కోసం వారికి హైదరాబాద్ నగరంలో ఆటో పర్మిట్లు ఇవ్వాలని జెఎసి నాయకులు కోరారు. ఈ నెల 7న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జెఎసి నాయకులు బి.వెంకటేశం, ఎ.సత్తిరెడ్డి, ముకేష్ గౌడ్, ఎం.ఎ.సలీం, వి.ప్రవీణ్, ఎం.డి.మజీద్, అజయ్ బాబు, రాంకిషన్ తదితరులు ఉన్నారు.

# బిజెపికి బిసిల ఓట్ల బహిష్కరణ

- అసెంబ్లీ బిసి తీర్మానానికి మద్దతివ్వకపోవడం సిగ్గుచేటు: జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో ఓబిసి కాలమ్ చేర్చాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం హర్షణీయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బిసి కులగణన తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా బిజెపి సభ్యులు వాకౌట్ చేయడం బిసిలను అవమానించడమేనని విమర్శించారు. బిజెపి అసెంబ్లీని బహిష్కరిస్తే.. వచ్చే ఎన్నికల్లో బిసిలు బిజెపిని ఓట్లతో బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఈ డిమాండ్లపై కేంద్రం వైఖరికి, అసెంబ్లీ తీర్మానానికి బిజెపి మద్దతు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా బిజెపి నేతల దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. బిసి కులగణనకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేయడంలో చొరవ చూపిన సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నేతలకు శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బిసి కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బిసి ప్రతినిధుల బృందం కలిసి అభినందించింది. కార్యక్రమంలో బిసి సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, పిట్ల శ్రీధర్, తాటిపల్లి వీరస్వామి, తిప్పరశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాయిదా తీర్మానం తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ కెటిపిఎస్ వద్ద ప్రతిపాదిత 2x800 ఎండబ్ల్యు విద్యుత్ విస్తరణ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం తీసుకుబోయే తదుపరి చర్యలు, కాలపరిమితిపైన రాష్ట్ర ప్రభుత్వం సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు సూచించారు. ఈ అంశంపై సభలో చర్చ చేపట్టాలని శాసనసభలో ఆయన శనివారం ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు. ఎన్‌టిపిసి భాగస్వామ్యంతో విద్యుత్ విస్తరణ ప్రాజెక్ట్‌ను స్థాపించేందుకు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని కూనంనేని వాయిదాతీర్మానంలో పేర్కొన్నారు. ప్రస్తుత మౌలిక సదుపాయాలను వాడుకుంటూ తక్కువ ఖర్చుతో ,పర్యావరణ అనుకూలంగా ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


# రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలపై కొనసాగుతోందన్నారు. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. ఇది రాబోయే 24 గంటల్లో దక్షిణ ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయన్నారు. శని, ఆదివారాల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర, ఈశాన్య జిల్లాలైన ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు.

అలాగే నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేశామన్నారు. ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.సోమ, మంగళవారాల్లో ఉత్తర, తూర్పు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు నమోదు కానున్నాయన్నారు.

# నగరాలను హైదరాబాద్ పరిధిలోకి తీసుకురావాలి

- సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న నల్లగొండ, వికారాబాద్, సంగారెడ్డి, సిద్ధిపేట, మెదక్, మేడ్చల్, రంగారెడ్డి పట్టణాలు, నగరాలను హైదరాబాద్ విశ్వ నగర పరిధిలోనికి తీసుకురావాలని, పరిపాలన బాధ్యతలు మాత్రం ఆయా పట్టణాలు, నగరాలకే అప్పగించాలని సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 'గ్రేటర్' హైదరాబాద్‌ను తొలగించి, మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో 'హైదరాబాద్ విశ్వనగరం' అనే ట్యాగ్ మాత్రం ఉండాలని, తద్వారా పెట్టుబడులను, పరిశ్రమలను, కార్పొరేట్ కంపెనీలను ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శాసనసభలో శనివారం జరిగిన "ప్రధాన పట్టణ ప్రాంత (సమగ్ర పాలన) బిల్లు (2026 ఎల్.ఎ. బిల్ నంబర్ 27) అంశంపైన జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి లేదా ఇతర ఉన్నతాధికారుల అధ్యక్షతన పరిసర పట్టణాలతో కూడిన పెద్ద హైదరాబాద్ విశ్వనగరంగా ఏర్పాటు చేసి, అందుకువీలుగా ప్రణాళికలను రూపొందించాలని, ఈ విషయమై నిపుణుల సలహాలు కూడా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ విశ్వనగరం అనే పేరును నిలబెట్టాలని, నగర విస్తీర్ణం పెంచడం లేదా ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ నగరం గతంలో దేశంలోనే రెండవ స్థానంలో ఉండేదని, హైదరాబాద్‌ను తిరిగి ఆ స్థానానికి తీసుకెళ్లాలని సూచించారు.

30 ఏళ్ల క్రితం కాలుష్యరహిత నగరంగా ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం కలుషితనగరంగా మారిందని, ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటే హైదరాబాద్ రెండు లేదా మూడో స్థానానికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిగ్నల్ పడితే 20 నిమిషాలు ట్రాఫిక్ జామ్ అవుతుందని, వర్షాలు పడితే హైదరాబాద్ కంటే గ్రామాలే బాగున్నాయన్నారు. వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఆ కార్యక్రమం ఇప్పటికీ సాధ్యం కాలేదన్నారు పేపర్‌పైన ఆదర్శాలు ఉంటున్నాయని, వాటిని ఆచరణలో అమలు కావడం లేదన్నారు. కలుషితం, ట్రాఫిక్, వర్షం ఇలాంటి పలు సమస్యలను పరిష్కరించే దిశఘా ప్రభుత్వం ఆలోచన చేయాలని కూనంనేని తెలిపారు. వందకు పైగా కాలం చెల్లిన నిబంధనలను సరిచేసేందుకు ఈ బిల్లును ప్రవేశ పెట్టారని, అవుటర్ రింగ్ రోడ్‌లో ఉన్న ప్రాంతాలను క్యూర్ అని పెట్టారని, దీనిని ఎలా అభివృద్ధి చేయాలి, కేంద్రీకృతమైన అధికారాలను వికేంద్రీకరణ చేసి, తద్వారా విశ్వనగరంగా ఎలా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్టుగా తాము భావిస్తున్నామన్నారు.

**రోజురోజుకూ పెరుగుతున్న పట్టణ జనాభా**

రోజురోజుకూ పట్టణీకరణ పెరుగుతోందని, తెలంగాణ రాష్ట్ర జనాభాలోని సగ భాగం ప్రజలు కేవలం మూడు శాతం భూభాగమైన హైదరాబాద్ నగరంలో ఉన్నారని, తద్వారా అనార్థలకు మూలంగా మారుతోందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్ర వైశాల్యం 1,12,077 చదరపు కిలోమీటర్లు ఉండగా, ఇందులో 10,472 చదరపు కిలోమీటర్ల పరిధిలో హైదరాబాద్ నగరం ఉన్నదన్నారు. 2011 ప్రకారం 38.88 శాతం జనాభా ఉంటే, ప్రస్తుతం 50 శాతానికి పెరిగినట్టు అంచనాలు చెబుతున్నాయన్నారు. ఢిల్లీ నగరం 55,083 కిలోమీటర్లు, బెంగుళూరు 8005 కిలోమీటర్లు, హైదరాబాద్ 7257 కిలోమీటర్లు, పూణే 7256 ఆ తర్వాత ముంబయి, చెన్నై, కలకత్తా నగరాలు ఉన్నాయని వివరించారు. ఢిల్లీలో 2011 నాటికి కోటీ 63లక్షల మంది ఉన్న జనాభా ప్రస్తుతంట 3,30కోట్లకు పెరిగిందని, ముంబయి 1.84 కోటీ నుంచి 2.20 కోట్లకు పెరిగిందని, చెన్నైలో 87 లక్షల నుంచి కోటీ 15 లక్షలకు , బెంగుళూరు నగరంలో 85 లక్షల నుంచి కోటీ 30లక్షల మంది పెరిగారని, హైదరాబాద్ నగరంలో 2011 లో 77 కోట్ల జనాభా నుంచి కోటీ 13 లక్షలకు పెరిగారని కూనంనేని వివరించారు. అతి సమీపంలోనే ఢిల్లీ తర్వాత రెండవ స్థానానికి హైదరాబాద్ వెళ్లే అవకాశాలు ఉన్నందున త్వరలోనే స్పష్టమైన ప్రణాళికను రూపా ందించాలని ప్రభుత్వానికి సూచించారు.



శాసనసభలో సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు శనివారం ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు. శాసనసభలో ప్రధాన పట్టణ ప్రాంత (సమగ్ర పాలన) బిల్లు (2026, ఎల్.ఎ.బిల్ నంబర్ 27)పై జరిగిన చర్చ సమయంలో కూనంనేని ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు.

# ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

ఎఐసిసి తెలంగాణ ప్రతినిధులతో మధుయాష్కి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేయడం ద్వారా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని మధుయాష్కి సూచించారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) జాతీయ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్‌ను ఎఐపిసి తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు శనివారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాన్ని అడ్డుపెట్టుకుని సాగిస్తున్న విభజన రాజకీయాలను ఎదుర్కొనేందుకు మేధావి వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, ఎఐపిసి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జి. ఆదిత్యరెడ్డి, డాక్టర్ సౌజన్య, క్వీన్ విక్టోరియా, ధనలక్ష్మి , నితిజ్ఞ, సుబ్బారావు, శశాంక్, భరత్‌రెడ్డి, సంతోష్, అధిత తదితరులు పాల్గొన్నారు.

# రూ.6 కోట్లతో నడకదారులు.. బూడిదలో పోసిన పన్నీరే!

పనుల్లో నాణ్యతా లోపం, కుంగిపోతున్న ఫుట్‌పాత్‌లు, షాపింగ్ మాల్స్ వద్ద ట్రాఫిక్ సమస్యలు





**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ పట్టణ ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వసతులు కల్పించడంతో పాటు నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన బృహత్తర యత్నం నేడు అధికారుల నిర్లక్ష్యం, స్థానిక నాయకుల స్వార్థం కారణంగా పూర్తిగా విఫలమైంది. గతంలో పరిపాలించిన మాజీ పురపాలక సంఘ అధ్యక్షుల కాలంలో సుమారు ఆరు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి రహదారికి ఇరువైపులా పాదచారుల కోసం ప్రత్యేక నడక దారులను నిర్మించారు. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడం, నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడంతో ఆ దారులు కాలక్రమేణా దెబ్బతిని, పలుచోట తీవ్రంగా కుంగిపోయాయి. కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరక పోగా,ప్రజాధనం నీళ్లపాలైందనే తీవ్ర అసంతృప్తి పట్టణ నివాసుల్లో వ్యక్తమవుతోంది.

**ఆక్రమణల మయంలో నడక దారులు :** మరోవైపు ఈ నడక దారులు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కుకుని తమ ఉనికిని కోల్పోతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న పెద్ద వ్యాపార సంస్థలు, బహుళ అంతస్తుల విక్రయ కేంద్రాల వద్ద ఈ సమస్య మరీ విపరీతంగా తయారైంది. రహదారి పక్కన ఉండే వ్యాపారులు తమ విక్రయ సామగ్రిని, ప్రకటన ఫలకాలను నడక దారులపైనే ఉంచుతూ వాటిని తమ సొంత స్థలంలా వినియోగించుకుంటున్నారు. దీనికితోడు కొందరు స్థానిక చోటా మోటా నాయకులు తమ రాజకీయ బలాన్ని, స్వార్థ ప్రయోజనాలను ఉపయోగించుకుని ఈ ప్రజా స్థలాలను ఇతరులకు మాసవారీ చెల్లింపుల ప్రాతిపదికన కేటాయిస్తూ అక్రమ ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. పేదరికం, ఉపాధి అనే నెపాన్ని చూపిస్తూ నడక దారులపై అక్రమంగా తాత్కాలిక కొట్టులు, డబ్బాలు ఏర్పాటు చేయించడంతో పాదచారులకు కేటాయించిన స్థలం పూర్తిగా అదృశ్యమైపోయింది.

**ప్రధాన షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు :** ఈ ఆక్రమణల ఫలితంగా పట్టణంలో వాహనాల నిల్వ, రాకపోకల సమస్యలు తీవ్ర రూపం దాల్చాయి. ముఖ్యంగా ప్రధాన విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల వాహనాలు నిలపడానికి తగిన స్థలం లేకపోవడంతో, వాహనదారులు తమ వాహనాలను రహదారులపైనే నిలిపివేస్తున్నారు. దీంతో నిత్యం గంటల తరబడి రహదారుల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నడక దారులు ఆక్రమణకు గురికావడం, మరోవైపు వాహనాలు రహదారిపైనే నిలపడంతో దారినపోయే ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వాహనాల మధ్య నుంచే నడవాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు,మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లలు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు. చిన్నపాటి ప్రమాదాలు నిత్యకృత్యంగా మారి ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

**అధికారులు స్పందించాలి :** నగరంలో పరిస్థితులు ఇంతగా దిగజారుతున్నప్పటికీ సంబంధిత నగర ప్రణాళికా అధికారులు, పురపాలక యంత్రాంగం కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రజాధనం వృథా అవుతున్నా, చట్టాలకు విరుద్ధంగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు కన్నుమూసి వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై, అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుని,నడక దారులను తిరిగి సాధారణ ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని నగర ప్రజలు బలంగా కోరుతున్నారు.

## మున్సిపల్ భవనానికి.. రూ.7.5 లక్షల నిధులు మంజూరు

సుదర్శన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన పివిఆర్

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** నూతన మున్సిపల్ భవనానికి రూ.7.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయటం జరిగిందని ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్ శనివారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సిఎం ఆర్మూర్‌లో ఇచ్చిన హామీలని నిలబెట్టుకున్నారన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లోఉన్న పనులన్ని చేయిస్తానని హామీనిచ్చారని వినయ్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి టియుఎఫ్ఐడీసీ ఫండ్ కింద 47 కోట్ల నిధులు 18.75 కోట్లను అమృత్ 2.0 కింద సుమారు 43 కోట్లను, నూతన మున్సిపల్ భవనానికి 7.5 కోట్లను మంజూరు చేయటం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన 30 నెలలోనే ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయడం సిఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్‌నుఆయన నివసంలో కలిసి శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** మండల కేంద్రంలోని రైతు వేదికలో రాబోయే గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం సీఐ నిర్మ ల్ రూరల్ యం. కృష్ణ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.గణేష్ ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలు,ప్రజల భద్రత, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఉన్నతాధికారులు జారీ చేసిన సూచనలు, మార్గదర్శకాలను సమావేశంలో పాల్గొన్న వారికి వివరించారు.డీజేలకు సంబంధించి మహారాష్ట్ర సెట్‌అప్‌లకు అనుమతులు లేవని సమావేశంలో స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా,శాంతియూత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.ఈ సమావేశానికి సారంగాపూర్ ఎంఆర్‌ఓ,విద్యుత్ శాఖ అధికారులు కూడా హాజరయ్యారు.సారంగాపూర్ ఎస్‌ఐ శ్రీకాంత్,ఏఎస్‌ఐ వసంత్,పోలీస్ సిబ్బంది,పెద్దలు,యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఓటర్ నమోదులో తప్పులు లేకుండా, పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్ అధికారులకు సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం పాపన్నపేట మండలంలోని లక్ష్మీ నగర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులుఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట తహసిల్దార్ సతీష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎలినో ప్రభావం.. కరెంటు కష్టాలు!

నీరులేక ఎండిపోతున్న వరి పంట



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఎలినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో పాటు విద్యుత్ అంతరాయాలు రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నిజాంపేట్ మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలు నీరులేక బీటలు వారుతున్నాయి. వర్షాలు కురవక చెరువులు, కుంటల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో బోర్లలోనూ నీరు తగ్గింది. దీనికి తోడు కరెంటు సరఫరాలో అంతరాయంతో పంటలకు నీరు అందించలేక రైతులు ఆందోళన చెందుతున్నారు.నస్కల్ గ్రామానికి చెందిన రైతుఎల్లయ్య తన మూడెకరాల్లో సాగు చేసిన వరి పంట నీరందక ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కాపాడేందుకు చర్యలు తీసుకుని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరా యం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్న బిఆర్‌ఎస్

నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** తెలంగాణ స్పీకర్ గడ్డంప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వాఖ్యలకు సభ్యసమాజం తలవంచుకునేలా ఉన్నాయని నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన శివ్వంపేటలో కేటీఆర్, తాతా మధుల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి భారీ ధర్నా నిర్వహించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని, వారు పదేళ్లలో చేయని అభివృద్ధిని వెయ్యిరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాలనను రాష్ట్రప్రజలు చవిచూశారని అన్నారు. అసెంబ్లీలో అభివృద్ధిపై చర్చకు వస్తే బీఆర్‌ఎస్ పార్టీకి పుట్టగతులుండవని, కేసీఆర్ నాయకత్వంలో ఫాంహౌజ్‌లో కుట్రపన్ని తమ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వచ్చే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో కనుమరుగు కానుందని, దళిత ఎమ్మెల్యే అగ్రస్థానంలో ఉంటే ఓర్చుకోని బీఆర్‌ఎస్ నాయకులు దళిత నాయకులపై దాడులకు దిగుతున్నారని అన్నారు.పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి, వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ వైస్‌ఛైర్మన్ మాధవరెడ్డి, సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మురళీగౌడ్, మాజీ జ డ్పీటీసీ కమల పూల్‌సింగ్, లక్ష్మి కాంతరావు, యువ నాయకులు సుధీర్‌రె డ్డి, గోమారం సర్పంచ్ హైమావతి ఆంజనేయులు, అరుణారెడ్డి, గేమ్సింగ్, కండెగారి ఆంజనేయులు, అరుణ్, శ్రీనివాస్ సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

## సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/చెన్నూరు :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి, తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శనివారం చెన్నూరు, వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జాతర నిర్వహించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, కార్మికులు, పేదలు సాగించిన వీరోచిత పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, నాయకులు బడికెల మదునయ్య, పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండల భీంసారి గ్రామంలో చిల్కా దేవిదాస్ ఆధ్వర్యంలో 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల స్థూపాల వద్ద నాయకులు సిర్ర దేవేందర్, కట్ట చంద్రమౌళితో కలిసి నివాళులర్పించారు. అనంతరం విలాస్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నేతృత్వంలో జరిగిన వీరోచిత పోరాటం ఫలితంగానే లక్షలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేదల సమస్యలను విస్మరిస్తున్నాయని విమర్శించారు.వేతనాలు, గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు తప్పవన్నారు. రాజు, గంగారెడ్డి, రాజన పాల్గొన్నారు.

**మావల:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సెం ట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్ళెపెల్లి గంగయ్యతో కలిసి ఆయన డిఇఒను కలసి వినతిపత్రం అందజేశారు.పెండింగ్ బిల్లు లను వెంటనే విడుదల చేయాలని, అల్పాహార పథకాన్ని వంట కార్మికులకే అప్ప గించాలని కోరారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనం ఇవ్వాలని, గ్యాస్, గుడ్ల ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య




**ప్రజాపక్షం/మంచిర్యాల :** రాజీమార్గమే రాజమార్గమని, రాజీతో ఇరువర్గాలు కేసుల నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చని మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. తొమ్మిది బెంచ్‌ల ద్వారా 3,500 లకు పైగా కేసులు పరిష్కరించినట్లు ఆయన వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు స మయం, డబ్బు ఆదా కావడంతో పాటు అప్పీలు లేకుండా అంతిమ తీర్పు లభించి ఇరువర్గాలు గెలిచినట్లవుతుందని పేర్కొన్నారు. 32 సివిల్ దావాలు, 3, 300లకు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని తె లిపారు. వీటికితోడు రూ. 17 వేల విలువైన రెం డు సైబర్ క్రై మ్ కేసులు, రూ.9,84,000 విలువైన 16 బ్యాంక్ ప్రిలిటిగేషన్ కేసులు, ఇతర కేసులు రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. కవిత, న్యాయమూర్తులు నిర్మల, సీనియర్ సివిల్ జడ్జి డి. రామ్మోహన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, పోలీస్ లైజన్ ఆఫీసర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం

తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే

**ప్రజాపక్షం/దండేపల్లి :** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు శనివారం ప్రత్యేక విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లు తీసుకొచ్చిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను సరిచూశారు.ఎంపిడిఒ జాగర్లమూడి ప్రసాద్, ఆర్ఐ బొద్దుల భూమన్న, సీనియర్ అసిస్టెంట్ అరుణ్, ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, రాజుగూడ సర్పంచ్ జైనేని రాజవ్వ భీమయ్య, జిపిఒ తిరుమల, బిఎల్ఓలు పద్మ, పుష్పలత, జ్యోతి, గ్రామస్థులు పాల్గొన్నారు.



## బిఆర్‌ఎస్ హయాంలోనే గడి పెద్దపూర్ అభివృద్ధి

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండలం లోని గడి పెద్దాపూర్ గ్రామ అభివృద్ధి చరిత్రను ఎవరూ మర్చిపోవద్దని, గ్రామం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సకల సౌకర్యాలతో కళకళలాడుతోందంటే అది కేవలం బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమైందని బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చెన్న కృష్ణ గౌడ్ స్పష్టం చేశారు. గురువారం గడి పెద్దాపూర్ గ్రామంలో బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ బిఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.గ్రామ అభివృద్ధి గురించి మాట్లాడే ముందు గత చరిత్రను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని, వాస్తవాలు తెలుసుకోకుండా బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బాబు మోహన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జాతీయ రహదారి 161 నుంచి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వరకు దాదాపు కోటి రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మించిన చరిత్ర బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదే. ఈ రోడ్డు వల్ల గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. అదే విధంగా చంటి క్రాంతి కిరణ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రాథమిక పాఠశాల నుంచి బిజిలీపూర్ గ్రామం వరకు మరో బీటీ రోడ్డును నిర్మించిన ఘనత కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదే.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

బిజెపి గరిమిళ్ల జోన్ అధ్యక్షుడు రాజుకుమార్



**ప్రజాపక్షం/మంచిర్యాల:** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బిజెపి గరిమిళ్ల జోన్ అధ్యక్షుడు అమీరిశెట్టి రాజుకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంచిర్యాల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా 13 నెలల పాటు హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలోనే ఉండిపోయిందని, ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల అకృత్యాల నుంచి 1948 సెప్టెంబర్ 17న సర్దార్ పటేల్ చేపట్టిన 'ఆపరేషన్ పోలో'తోనే తెలంగాణకు నిజమైన విముక్తి లభించిందన్నారు. కేంద్రంతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా చేపట్టి పోరాట స్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోట్ల సత్యం, పల్లి రాకేష్, మేడికొండ శ్రీనివాస్, కర్రె లచ్చన్న, తూటి సరస్వతి, తరుణ్ సింగ్, రాకేష్ రైన్వా, పచ్చ వెంకటేశ్వర్లు, ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** వినాయక చవితి పర్వదిన్నాన్ని పురస్కరించుకొని నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో ఏలంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరతోష్ ఫంకజ్ తెలిపారు. ఈ సందర్బంగా జిల్లా జెడ్‌పి కార్యాలయంలో వివిద కుల మతాలకు చెందిన పెద్దలతో ఫీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించినన జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ ఈ సందర్బంగా మాట్లాడుతూ వినాయక చవితి నావరాత్రి ఉత్సవాలను శాంతయుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ,ప్రజలు ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవిస్తూ మత సామరస్యాన్ని కాపాడాలని అన్నారు. వినాయక ప్రతిమను ప్రతిష్టించదలిచిన వారు ముందస్తు సమాచారం అందించేందుకు తెలంగాణ పోలీస్ పోర్టల్ https||p olicepo rtal.tspolice gov inindexhtmఅందుబాటులో ఉందని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా మండపం వివరాలు, నిమజ్జనం ,తేది నిమజ్జనానికి వెళ్లే మార్గం తదితర వివరాలను ముందస్తుగా నమోదు చేయాలని సూచించారు.ఎట్టి పరిస్థిల్లోను అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లు డిజేలకు అనుమతిలేదని నిబందనలకు అనుగుణంగా మైకులు , స్పీకర్లను ఉదయం 6 గంటలనుండి రాత్రి 10 గంటలకు వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎవరైన నిబందనలకు విరుద్దంగా డీజేలను ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులతో పాటు డీజే యాజమానులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ము ఖ్యంగా యువత సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని నిర్దారణ లేని ఫార్వర్డ్ మెసేజ్‌లను ఇతరులకు పంపకుండా జాగ్రత్త వహించాలని ఎస్‌పి సూచించారర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విదంగా షోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు వాఖ్యలు చేయవద్దని అనుమానాస్పద సమాచారం,తప్పుడు ప్రచారం కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిఎస్‌పి సంగారెడ్డి, టిసిసి కార్యదర్శి తోపాజ అనంత్ కిషన్ ,మున్సిపల్ కౌన్సిలర్లు ,సంతోష్, రెవెన్యూ శాఖ తరపున జైరామ్, మున్సిపల్ శాఖ తరపున జైరాం, డా.ప్రవీన్ కుమార్ డిఎమ్‌ఓ గణేష్ మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి




**ప్రజాపక్షం/మెదక్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసు నిబంధనలు పాటించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ టౌన్,రూరల్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్ల గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి మండపాన్ని పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని అనుమతి పొ ందాలని సూచించారు. మండపాల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, 24 గంటలూ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, క్యూలైన్లు ఏ ర్పాటు చేయాలని సూచించారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లకు అ నుమతి ఉంటుందని, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌పి కోరారు. సమావేశంలో డిఎస్‌పి ప్రసన్నకుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆదర్శ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహన్ని జిల్లా కలెక్టర్ కె.హైమావతి శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఆసుత్రిలో రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని మోడల్ స్కూల్ బాలికల వసతి గృహన్ని సందర్శించి భోజన ప్రక్రియను పరిశీలించారు. స్టాక్, ఇతర రికార్డులను తనిఖీ చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. మోను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు.ఇష్టానుసారంగా వ్యవహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## విజయానికి సరైన మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యం: ఎస్‌పి మహేశ్ బి.గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఏయే సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నారో గుర్తించి ప్రణాళిక ప్రకారం ఆయా సబ్జెక్టులపై ఎక్కువ దృష్టి సారించి సబ్జెక్టులపై పట్టు సాధించాలని జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే సూచించారు. శనివారం ఎస్సై, కానిస్టేబుల్ తోపాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ మాట్లాడుతూ చదువుతున్న సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని తమలోనే ఉంచుకోకుండా నిపుణులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు నిర్ధిష్ట వెయిటేజీ ఉంటుందని దానికి అనుగుణంగా ప్రిపరేషన్ కొనసాగిస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో అభ్యర్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చిన్న చిన్న వైఫల్యాలకు నిరుత్సాహపడకుండా వాటిని పాఠాలుగా తీసుకొని మరింత పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సిఐలు, ఎస్సైలు, స్కిల్‌గురూ డా.విజయ రఘురామరాజు, ఆల్ ఇండియా పోలీస్ ట్రైనర్, సిడిటి లైఫ్ కోచ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ మహేశ్ కుమార్, నవీన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన బిఆర్ఎస్



**ప్రజాపక్షం/గజ్వేల్:** దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ చివరికి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తూ అవమానించే స్థాయికి దిగజారినట్లు జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్కగల్ల కరుణాకర్, మాజీ ఎంపిపి మోహన్ విమర్శించారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దళిత సీఎం పేరుతో తొలిసారిగా దళితులను మోసం చేసినట్లు ఆరోపించారు. దళిత బంధు, మూడెకరాల భూమి అంటూ హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కినట్లు ఎద్దేవా చేశారు. కేసీఆర్ బాటలో నడిచిన నాయకులు అదే దారిలో నడుస్తూ దళితుల పట్ల చిన్నచూపు, అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నట్లు మండిపడ్డారు. దళితులు నడిచిన నేల అపవిత్రమైందని పేర్కొంటూ ఆ పార్టీ నేతలు పసుపునీళ్లు చల్లి వివక్షత, అగ్రకుల ఆధిపత్య ప్రదర్శించడం వారి మనస్తత్వానికి పరాకాష్టగా నిలిచినట్లు విమర్శించారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలపై బీఆర్ఎస్ అధిష్ఠానం సమాధానం చెప్పాలని, బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న దళిత నాయకులు, కార్యకర్తలు ఆత్మవిమర్శ చేసుకోవాలని, దళితులను అవమానించే రాజకీయాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దళితుల గౌరవాన్ని కాపాడుకోలేని పార్టీలో కొనసాగడం కంటే బయటకు వచ్చి సామాజిక న్యాయం కోసం పోరాడటం మేలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో దళితులకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని, జాతీయ స్థాయిలో దళిత నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు తెలంగాణలోనూ కీలక పదవులు ఇవ్వడం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని అన్నారు. ఈ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మల్కగల్ల కరుణాకర్, వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పోతగల రవి, జిల్లా కార్యదర్శి సొక్కం సురేష్, కర్రోల ప్రవీణ్, కొడకండ్ల బాలు, వీరేష్, గడ్డం నవీన్, అశోక్, మల్లేష్, సాయిలు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి

జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యాం ప్రసాద్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ నేడు పరిశీలించి, సర్వేలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన రైతులందరూ వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి, తమ పంటల వివరాలను యాప్‌లో ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని డి హెచ్ ఎస్ ఓ సూచించారు.డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా జిల్లాలో సాగు చేస్తున్న పంటలపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులోకి వస్తుందని,దీని ఆధారంగా భవిష్యత్‌లో మెరుగైన పథకాలు, సబ్సిడీలు అమలు చేయడం, రైతుల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త పంటలు మరియు కొత్త రకాలను పరిచయం చేయడం, మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని తెలిపారు.ప్రత్యేకంగా ఎర్ర మిరప, కూరగాయలు, పసుపు, పూలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటల వివరాలను తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేయాలని సూచించారు. ఉద్యాన పంటల విస్తీర్ణంపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటే భవిష్యత్ ప్రణాళికలు మరియు ప్రభుత్వ పథకాల అమలు మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిన్నకల్వల గ్రామ సర్పంచ్ శ్రావంతి రమేష్, ఉద్యానవన విస్తరణ అధికారి మహేష్,వ్యవసాయ శాఖ సర్వే వాలంటీర్ హరీష్ మరియు రైతులు పాల్గొన్నారు.

# సాదాబైనామా దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ చిత్రా మిశ్రా




**ప్రజాపక్షం/కరీంనగర్:** భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై శుక్రవారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, నో మ్యాపింగ్, సాదా బైనామా దరఖాస్తులు, ప్రజావాణి అర్జీల పరిష్కారం, ప్రభుత్వ భూముల వివరాల నిర్వహణ తదితర అంశాలపై మండలాల వారీగా పురోగతిని తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని, వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి అర్హత ఉన్న వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌లో భాగంగా చేపడుతున్న 'నో మ్యాపింగ్' ప్రక్రియపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దశను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. 'నో మ్యాపింగ్' ప్రక్రియలో భాగంగా నోటీసులు అందించిన వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తీసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అర్హుల జాబితాను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి అవకాశం లేకుండా రికార్డులను పరిశీలించాలని సూచించారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా దరఖాస్తులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండలాల పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు వెంటనే అందించే విధంగా రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డు సమర్పించాలి

కలెక్టర్ గరిమా అగర్వాల్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తంగళ్లపల్లి మండలం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న 185, 186, 187, 188, 189, 190, 191 పోలింగ్ బూత్‌లలో బిఎల్ఏ సమక్షంలో బూత్ లెవెల్ అధికారులు చేపడుతున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి సంబంధిత బిఎల్‌వోలకు సమర్పించాలని అన్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ, యువకులు ఎంత మంది ఓటు హక్కు కోసం చేసిన ధరఖాస్తుల వివరాలతో పాటు నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. మండలంలో ఉన్న అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో 9712 అనామలీస్ ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులతోపాటు సంబంధిత బిఎల్‌ఓలు నోటీసులు అందిన ఓటర్లకు అవగాహన కల్పించి తమ ధృవీకరణ పత్రాలు సమర్పించేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ సమ గ్ర సవరణ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్, బిఎల్ఓ సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండి బిఎల్‌ఓలకు సూచనలు అందిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు తదితరులు ఉన్నారు.

## నిరుపేద కళాకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణానికి చెందిన నిరుపేద కళాకారుడు ఎలుకపెల్లి బుచ్చిరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని హుస్నాబాద్ సిపిఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ వరంగల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా శనివారం ఆయన పార్థివదేహంపై పూల మాల వేసి నివాళ్లు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టనానికి చెందిన బుచ్చిరాజు కళారంగాపై మక్కువతో అద్భుతమైన చిత్రాలను గీసి తమ ప్రతిభను కనబరిచేవాడని బాబాసాహెబ్ అంబేద్కర్, స్వామి వివేకనందుని, మహత్మాగాంధీ లాంటి మహా నాయకుల చిత్రాలను గీయడం కాకుండ వారి శిల్పిలానే తయారుచేసి అమ్ముతూ కుటుంబాని పోశించుకుంటున్న తరుణం బుచ్చిరాజు ఆకాల మృతి చెందడంతో కుటుంబం పెద్దను కోల్పోయిందని నేడు జీవనోపాధి కోల్పోయిందని వారి కుటుంబాన్ని తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం ఆదుకోవాలని ముఖ్య మంత్రి రేవంతు రెడ్డి గడిపె మల్లేశ్ కోరారు.

## విద్యుత్ కోసం రాజీవ్ రహదారిపై ధర్నా

సాగుకు 12 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతుల డిమాండ్



**ప్రజాపక్షం/కొండపాక:** వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రోజున బందారం అంకిరెడ్డిపల్లి దర్గా రాంపల్లి దుద్దెడ గ్రామాలకు చెందిన రైతులు రాజీవ్ రహదారి దుద్దెడ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సత్యంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ డిఈ తో మాట్లాడడం జరిగింది. రేపటినుండి పాత పద్ధతి ప్రకారం విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. పలువురు మాట్లాడుతూ, వ్యవసాయానికి నిర్ణీత సమయం మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంటలు కీలక దశలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ బావులు, బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ కోతలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. పగలు, రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పంటలకు సకాలంలో నీరందించలేకపోతున్నామని పేర్కొన్నారు. రైతులకు 12 గంటల పాటు నిరంతరంగా, కోతలు లేకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రాజీవ్ రహదారిపై రైతులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వెంటనే నివారించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ కోఆర్డినేటర్ ర్యాగాల్ల దుర్గయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నూనె కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు నీల సత్యం, దుద్దెడ సర్పంచ్ మిద్దె శివకుమార్, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ గాలి బాలయ్య, నాయకులు తేలు అశోకు, పిడిశెట్టి శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, ఐదు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యపై రోడ్డెక్కిన రైతన్నలు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** రైతులకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన రైతులు ఆయా మండలాల్లో ధర్నా, రాస్తారోకోలు నిర్వహించి సబ్‌స్టేషన్‌లో వినతి పత్రం అందచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 8 గంటలు సైతం విద్యుత్ రావటం లేదని ఆరోపించారు. తమ పంటలు ఎండిపోతున్నాయన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీనిచ్చినట్లుగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండలం జక్కపూర్‌లో లక్ష్మిదేవిపల్లి, చిన్నకోడూరు మండలం మల్లారం, సికింద్లపూర్ రాజీవ్‌రహదారిపై రైతులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నంగునూర్ మండలం కోదండరాజ్‌పల్లిలో రైతులు విద్యుత్ సమస్యపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో బిఆర్ఎస్ నేతలు కుంబాల ఏల్లారెడ్డి.హరీష్, జిల్లా రైతుబంధు డైరెక్టర్ మేడికాయల వెంకటేశం. సర్పంచు. హరీష్. మాజీ సర్పంచి జయవర్ధన్ రెడ్డి ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఎన్‌టిపిసిలో మరో కీలక మైలురాయి!

3X800 మెగావాట్ల ప్రాజెక్టు పనులు ప్రారంభం




**ప్రజాపక్షం/గోదావరిఖని:** ఎన్‌టిపిసి రామగుండం తెలంగాణ స్టేజ్2లో భాగంగా 3X800 మెగావాట్ల ప్రాజెక్టు అభివృద్ధికి సంబంధించి కీలక ఘట్టమైన ప్రధాన ప్లాంటు సైట్ లెవలింగ్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టు విద్యుత్తు ఉత్పత్తికి సంబంధించిన బాయిలర్, టర్బయిన్, జనరేటర్ (బి.టి.జి.) ప్యాకేజీని బి.హెచ్.ఈ.ఎల్. సంస్థకు అప్పగించారు. ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ (ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమంత సైట్ లెవలింగ్ పనులకు పూజలు నిర్వహించి అధికారికంగా ప్రారంభించారు. సైట్ లెవలింగ్ పనుల ప్రారంభంతో తెలంగాణ స్టేజ్2 పురోగతిలో మరొ ముందడుగు పడిందని, తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు ఎన్‌టిపిసి కట్టుబడి ఉందని ఈ.డి. తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి, బిహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల పవర్ ప్లాంట్లను తెలంగాణ రాష్ట్రంలోని రామగుండంలో నిర్మిస్తామని, వీటి ద్వారా చేపట్టిన విద్యుత్తు ఉత్పత్తిలో 80 శాతం తెలంగాణ రాష్ట్రానికి ఇస్తామని ప్రకటించింది.ఇందులో భాగంగా ఇప్పటివరకు 1,600 (2X 800) మెగావాట్ల ప్లాంట్లను రామగుండంలో నెలకొల్పి విద్యుత్తు ఉత్పత్తి చేపడుతున్నారు. మిగిలిన 2,400(3X800) మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణాలకు సంబంధించిన భూమి పూజను శనివారం ప్రారంభించడం పట్ల రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాలు



**ప్రజాపక్షం/మేడిపెల్లి:** జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి మండలం కొండాపూర్ లో తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను కమ్యూనిస్టు పార్టీ నాయకులు వివరించారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ పోరాటంలో పేదలు, రైతులు, కూలీలు, మహిళలు చూపిన ధైర్యసాహసాలు, వీరత్వం, త్యాగాలు మరువలేనివని నాయకులు పేర్కొన్నారు. దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు ఐక్యంగా పోరాడి, సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పంచడం, మూడు వేల గ్రామాలను విముక్తి చేయడం, 4,500 మంది అమరుల త్యాగాలు వంటి విజయాలను సాధించారని తెలిపారు. నాటి పోరాట ఫలితాలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేడు ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, విద్య, వైద్యం, వ్యవసాయ సంక్షోభం, పోరాడిసాదించుకున్న కార్మికుల హక్కుల హననం, సామాజిక సమస్యలు, అవినీతి, ప్రజాస్వామ్య హక్కుల సమస్యలు పరిష్కారం కావాలంటే నాటి తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు చిట్యాల లక్ష్మ ణ్, రాజయ్య వారి బృందం పాటలు పాడారు. మండల కార్యదర్శి మునుగూరి హన్మంతు, పార్వడ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు ఎదలాపురం దుబ్బరాజం. ఎదలాపురం గంగారాజం, పిట్టల నారాయణ. గంగానరసయ్య, రాములు, చిలువేరి గంగాచారి, రవి, నాగంగు, నరసవ్వ, లక్ష్మి , మంజుల, పాల్గొన్నారు.

## డిజెలకు అనుమతి లేదు: డిసిపి రామ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గోదావరిఖని:** సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి తెలిపారు. శనివారం గోదావరిఖనిలోని కోదండరామాలయంలో గణేష్ ఉత్సవ కమిటిలు, మండప నిర్వాహకులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి డీసీపీతోపాటు గోదావరిఖని ఏసీపీ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. డీజే శబ్దం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, అందుకే నిషేధం అమల్లో ఉందన్నారు. శోభాయాత్రను మధ్యాహ్నం ప్రారంభించి సాయంత్రం 6 గంటలలోపు ప్రధాన చౌరస్తాకు చేరుకుని, గోదావరిఖని బ్రిడ్జి వద్ద గోదావరినదిలో నిమజ్జనం ప్రశాంతంగా చేయాలని డీసీపీ సూచించారు.

# ఖేలో ఇండియాలో పతకాలు సాధించాలి

తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలపాలి

'ఆల్ఫోర్స్' చైర్మన్ వి.నరేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** వచ్చే డిసెంబర్‌లో తెలంగాణలో జరిగే ఖేలో యూత్ గేమ్స్‌లో యోగా క్రీడాకారులు ఎక్కువ పతకాలు సాధించాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఆల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్లో జరిగిన 17వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల యోగా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వతహాగా క్రీడాకారుడైన రాష్ట్ర ముఖ్య మంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని దానిలో భాగంగా ప్రతిష్టాత్మక కేసులో ఇండియా పోటీలకు మన రాష్ట్రం అతిథ్యమిస్తుందని అన్నారు. యోగాతోపాటు మిగతా క్రీడలో రాణించి తెలంగాణను నంబర్‌వన్‌గా నిలపాలన్నారు. యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు పరిచయం అయిందని రానున్న ప్రపంచ స్థాయి యోగా పోటీల్లో భారతదేశానికి తిరుగులేదన్నారు. కేవలం పాఠ్యాంలకే పరిమితం కాకుండా క్రీడల్లో భాగస్వాములు అయితే రిజర్వేషన్ ద్వారా విస్తృత ప్రయోజనాలు ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలో ఘనంగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యమే లక్ష్యంగా క్రీడాకారులు సాధన చేయాలన్నారు.అనంతరం విజేతలకు అతిథులు ట్రోఫీలతోపాటు వ్యక్తిగత మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయస్థాయి పోటీలో పతకం సాధించిన దీపక్ పెడరేషన్ బాధ్యుడైన మనోజ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.జనార్దన్ రెడ్డి, టి.రమేష్ రెడ్డి, కృష్ణ, బి.కమలాకర్, రామకృష్ణ, మనోజ్, స్వరూపాచారి, గంగాధర్, కిష్టయ్య, మల్లేశ్వరీ, ఆనంద్ కిషోర్ , వీణావాణి పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు



**ప్రజాపక్షం/వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 10 రోజుల పాటు (సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు) ఈ వేడుకలు జరగనున్నాయి. ఆలయంలో ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నందున, ప్రధాన ఆలయంలో వినాయక నవరాత్రులను ఏకాంతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. భక్తుల దర్శనార్థం ఆలయ అనుబంధ విభాగమైన శ్రీ భీమేశ్వరస్వామి మండపంలో ప్రత్యేకంగా గణపతి మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాల అలంకరణలతో మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి శుక్రవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ రామ్ కిషన్ రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఆలయ పండితులు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సేవలో పువ్వాడ కుటుంబం

15 ఏళ్లుగా ఉచిత సేవా కార్యక్రమాలు

నేడు దివ్యాంగులకు కృత్రిమ పాదాలు వితరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో మానవతా సేవ, దాతృత్వం, సామాజిక బాధ్యతకు పెద్దపీట వేస్తూ ఖమ్మం జిల్లాలో పువ్వాడ నాగేశ్వర రావు కుటుంబం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పువ్వాడ ఫౌండేషన్ స్థాపించి పేదలు, నిరుపేదలు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు, మందుల పంపిణీ, గర్భిణీలకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులతో వైద్య సేవలు పొందలేని వారికి సైతం అండగా నిలుస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ పువ్వాడ కుటుంబం ప్రజలకు అండగా నిలిచింది. మమత ఆసుపత్రి ద్వారా వైద్య సేవలను విస్తృతం చేశారు. వైద్య రంగ సేవలతో పాటు సామాజిక బాధ్యతగా ఆపదలో ఉన్న వారికి చేయూతనందిస్తున్నారు. పువ్వాడ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మమత వైద్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు, సిపిఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదిన సందర్భంగా పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 88 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని రోటరీ క్లబ్‌లో పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొననున్నారు.

# వినాయక చవితి సందర్భంగా గిరిజన దర్బార్ రద్దు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రతీ సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలను వినాయక చవతి సందర్భంగా రద్దు చేసినట్లు ఐడిఒసి, ఐటిడిఎ అధికారులు వెల్లడించారు. వినాయకచవితి సోమవారం ప్రభుత్వ అధికారిక సెలవు కావడంతో ఈ కార్యక్రమాలు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు దీనిని గమనించాలని, ఎవరూ కార్యాలయాలకు రావద్దని సూచించారు. తిరిగి వచ్చే సోమవారం 21వ తేదీ నాడు యధావిధిగా గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

లోక్ అదాలత్‌లో 5,800 కేసులు పరిష్కారం




**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** రాజీ మార్గమే రాజ మార్గమని రాజీ పడదగిన కేసుల్లో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం. నాగరాజు తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మూడవ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో ఖమ్మంలో తొమ్మిది, సత్తుపల్లి, మధిరలో మూడు చొప్పున ఏర్పాటు చేసి వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు, ప్రమాదాలకు సంబంధించిన కేసులు, బ్యాంక్, ఆర్థిక సంబంధిత కేసులు, కుటుంబ పంచాయతీలు సహా రాజీపడదగిన కేసులన్ని రాజీ పడటం మంచిదన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని ఆయన తెలిపారు. అంతే కాకుండా రెండు పక్షాలు సంతృప్తికర ఫలితాలు పొందే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందన్నారు. ఖమ్మంజిల్లా లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించడంలో ఐదవ స్థానంలో నిలిచిందని ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ పోలీస్ శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయాధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. పరిష్కారమైన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అందజేశారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు వి. శీనయ్య, కృష్ణార్జున్, మహేష్‌నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ సభ్యులు యడ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

# బిసి రెసిడెన్షియల్ కళాశాలకు ఐటిసి సహకారం



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బిసి సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల (బాలికల)కు ఐటిసి సంస్థ సిఎస్ఆర్ నిధులతో విద్యా సామాగ్రిని అందించింది. సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆధ్వర్యంలో డెస్క్‌టాప్‌లు కంప్యూటర్ ల్యాబ్ ఫర్నీచర్ అదనపు డెస్కులు బెంచీలు అందచేశారు. కాంపిటీషన్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఐఐడి జెఇఇ నీట్ ప్రిపరేషన్ మెటీరియల్ కూడా అందించారు. విద్యార్థులు ఈ వనరులను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిసి జిఎం చంగల్ రావు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# వివి పాలెంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భట్టివిక్రమార్క యువసేన సహకారంతో మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శనివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన గ్లెనీగల్స్, ఫోర్టిస్ నెట్‌వర్క్ ఆసుపత్రుల వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య సేవలను అందించారు. ప్రజలకు గుండె, కంటి, దంత, జీర్ణకోశ, శ్వాసకోశకు సంబంధించిన విభాగాల నిపుణులు పాల్గొని సేవలు అందించారు. ప్రజలకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కాపా ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఉపసర్పంచ్ గుగులోత్ ప్రవీణ్, కిలారు అనిల్‌కుమార్, వెంకటరమణ, మురళీకృష్ణ, రాజు, తగరం నాగరాజు, హర్ష, రాజు, శ్రీను పాల్గొన్నారు.

# చర్యలకు జంకెందుకు ?



కట్టడి లేని అవినీతి

డిమాండ్‌గా మారిన లంచం

**ప్రజాపక్షం/ఖమ్మం :** గతంలో గుట్టు చప్పుడు కాకుండా ఇచ్చింది పుచ్చుకుని అక్రమమో, సక్రమమో కానీ పనులు చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ పని చేయాలన్న ఆ పనికి ఓ రేటు కట్టి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నెల నెల క్రమం తప్పకుండా వేతనాలు ఇస్తున్నా లంచం లేకుండా పని చేసే పని లేదు. పాలనలో అత్యంత కీలకంగా ఉన్న శాఖల్లోనే వసూళ్ల ఎక్కువగా సాగుతున్నాయి. అవినీతికి సంబంధించి నేరుగా ఫిర్యాదులు చేసినా పలు సందర్భాల్లో అవినీతి విషయం నిగ్గు తేలినా చర్యలు తీసుకోవడం లేదు. చర్యలకు కొందరి విషయంలో ప్రజాప్రతినిధులు అడ్డుపడటం మరి కొందరి విషయంలో ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తున్నారు. చర్యలకు ఉన్నతాధికారులు జంకుతుండడంతో ఇప్పుడు అవినీతి కట్టలు తెగింది. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖ లో అవినీతి గురించి పలుమార్లు బహిర్గతమైనా చర్యలు తీసుకున్న సందర్భం లేదంటే అతిశయోక్తి కాదు. ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ అసోసియేషన్ పేరిట మద్యం వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లు చేశారు. అయినా దీనిపైనా చర్యలు లేవు. బెల్ట్ షాపుల నిర్వహకుల నుంచి వసూళ్లు జరుగుతున్నాయి. కొందరు ఎక్సైజ్ సిబ్బందిపై నేరుగా ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో మట్టి దందా, ఇసుక దందా చెలరేగిన నేపథ్యంలో మైనింగ్ శాఖకు వరంగా మారింది. ఎవరు మట్టి దందా చేసినా, ఇసుక దందా చేసినా ఓ ప్రజాప్రతినిధి చేత ఫోన్ చేయించండి అని సలహా ఇస్తున్నారు. ఆ ఫోన్ రాగానే నిశ్చింతగా అక్రమ తోలకాలకు అనుమతులు ఇచ్చి తమకు రావాల్సింది పుచ్చుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఫలానా ప్రజాప్రతినిధి సిఫారసు చేశారని తప్పించుకుంటున్నారు. చివరకు మట్టి దందా చేసిన వాహనాలనే విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ శాఖ సంగతి చెప్పనవసరం లేదు. ఏ రెవెన్యూ శాఖ కార్యాలయంలోనైనా పైసా చెల్లించకుండా పని చేసుకువచ్చే వారు లేరంటే అతిశయోక్తి కాదు. కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా, మీ సేవ కేంద్రాల ద్వారా యథేచ్ఛగా వసూళ్ల సాగుతున్నాయి. గతంలో అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు కఠిన చర్యల సంగతి ఎలా ఉన్నా కనీసం బదిలీ అయినా చేసే వారు. ఇప్పుడు అది లేదు. పలు ఆరోపణలు వచ్చినా అదే స్థానంలో కొనసాగుతున్నారు. ఇంజనీరింగ్ శాఖాధికారులు పనుల నాణ్యత విషయం పట్టించుకోవడమే మానేశారు. ఇప్పుడు నాణ్యత విషయంలో గుత్తేదారులను ఇంజినీరింగ్ అధికారులు ప్రశ్నించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితి దశాబ్ద కాలం క్రితం ఏమన్న ఉండేదేమో కానీ ఇప్పుడు గుత్తేదారులే మండల ఇంజినీరింగ్ అధికారి నుంచి ఉన్నతాధికారుల వరకు శాసించే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదారుల్లో ఒకరిద్దరు మినహా అందరూ ప్రజాప్రతినిధులకు ప్రధాన అనుచరులే. ఏదో ఒక రకంగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో మసులుకుంటున్న వారే. అందరికీ కాకపోయినా కొందరికైనా కప్పం కడుతున్న వారే కావడంతో ప్రభుత్వ పరంగా కూడా ఏమి చేయలేని పరిస్థితి. అందుకనే పలు సందర్భాల్లో నాణ్యతలో డొల్లతనం బయటపడుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని శాఖల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించడంతో పాటు ప్రజల పట్ల సానుకూలత ప్రదర్శించకపోతే దాని ప్రభావం ప్రభుత్వంపై పడుతుంది. మండల కార్యాలయాల్లో పనులు కాకపోయినా లంచాలు మోతాదును మించినా ప్రజలు ప్రభుత్వాన్ని ఆయా ప్రాంతాల్లో ప్రాతినిథ్యం వహిస్తున్న వారిని నిందిస్తుంటారు. ఇప్పుడు జిల్లాలో అదే పరిస్థితి ఏర్పడింది. అధికారులు చర్యలకు జంకుతుండడంతో ప్రజాప్రతినిధులే అవినీతి అధికారులకు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో కొంత వాస్తవం కూడా ఉంది. కమీషన్లు పుచ్చుకుని నువ్వు ఏమి చేసినా ఎవరు మాట్లాడరు. ఎవరైనా మాట్లాడితే నాకు ఫోన్ చేయండి అంటూ ప్రజాప్రతినిధులే గుత్తేదారులకు కొందరు అధికారులకు భరోసా ఇస్తుండడంతో అవినీతి మరింతగా పెరిగిపోతుంది. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న పోలీస్ శాఖపై కూడా పలు సందర్భాల్లో ఆరోపణలు వినవస్తున్నాయి. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అక్రమాలకు పాల్పడటం, సైబర్ నేరాల్లో తలదూర్చడం, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించడం జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. శనివారం కూడా ఓ కానిస్టేబుల్ పై ప్రేమ వ్యవహారంలో కేసు నమోదు కావడం చర్చనీయాంశమైంది. ఇటీవల మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పిని మించి అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఓ ప్రజాప్రతినిధి మద్యం వ్యాపారులను పిలిచి మాట్లాడి కొంత పంపించండి అంటూ ఓ ప్రతిపాదన చేశాడటా అంతే మద్యం ప్రియులను దోచుకుంటే దోచుకున్నారు కానీ మాకు మాత్రం కొంత మేర అందులో వాటా ఇవ్వండి అని అడిగినట్లు ఉంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా గుసగుసలు కూడా వినిపించాయి. మొత్తంగా చర్యలు శూన్యమైతే ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసహనం, వ్యతిరేకత ఏర్పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అవినీతి అధికారులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సమ్మె నోటీసు నుంచి.. అగ్రిమెంట్ల వరకు.. ఎఐటియుసి విజయఢంకా

కార్మికుల డిమాండ్లపై యాజమాన్యంతో కీలక ఒప్పందాలు

హక్కులు సాధించే వరకూ రాజీలేని ఉద్యమం

వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/చుంచుపలి:** సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఎఐటియుసి చేపడుతున్న పోరాటాలకు కార్మికుల నుంచి విశేష మద్దతు లభిస్తోందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. కొత్తగూడెం, కార్పొరేషన్, సత్తుపల్లి ఏరియాల సంయుక్త ఆధ్వర్యంలో శేషగిరిభవన్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 8న ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో ఆర్ఎల్‌సి సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో నిర్వహించిన వరుస చర్చల ఫలితంగా 23 కీలక డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించామని నాయకులు తెలిపారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 2025–26 వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు చర్యలు వంటి అంశాల్లో అంగీకారం సాధించామన్నారు. బదిలీల్లో మూడేళ్ల నిబంధనకు బదులుగా ఖాళీల ఆధారంగా ఏడాది నిబంధన అమలు, అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు ఓవర్‌మెన్ ప్రమోషన్లు హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల సవరణ, సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీతోపాటు వారం రోజుల వరకు వైద్య సేవలు అందించడం వంటి అంశాలపైనా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు.

### ప్రచారం కాదు.. పోరాటమే ఎఐటియుసి విధానం

కార్మికుల సమస్యలను కేవలం ప్రకటనలకు పరిమితం చేయకుండా సమ్మె నోటీసు ఇచ్చి, ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిపి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి అగ్రిమెంట్లు సాధించామని వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఎఐటియుసి సాధిస్తున్న విజయాలను చూసి ఓర్వలేక కొన్ని సంఘాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఇతరుల పోరాట ఫలితాలను తమవిగా చెప్పుకోవడం సులభమేనని, కానీ యాజమాన్యం ముందు నిలబడి కార్మికుల హక్కుల కోసం పోరాడి అగ్రిమెంట్లు సాధించడం అంత సులభం కాదన్నారు. కుదిరిన అగ్రిమెంట్లు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఎఐటియుసి పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రావాల్సిన ప్రతి హక్కు, ప్రతి ప్రయోజనం అందే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, భీమయ్య, సహాయ కార్యదర్శులు, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇన్‌చార్జి ఎర్రగాని కృష్ణయ్య, ఆఫీస్ బేరర్లు, అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రెటరీలు, వివిధ కమిటీల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# వ్యక్తి అనుమానాస్పద మృతి

ఛాతిపై కత్తిపోటు ఆనవాళ్లు

హత్యకోణంలో పోలీసుల దర్యాప్తు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామ శివారులో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. జల్లేరువాగు ఒడ్డున మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మర్కోడు పంచాయతీ సుద్దరేవు గ్రామానికి చెందిన పూణెం రామ్‌నారాయణ(50)గా మృతుడిని గుర్తించారు. గత నాలుగేళ్లుగా గ్రామంలో నివసిస్తున్న ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంత్రాలు, నాటు మందులతో పూజలు చేస్తుంటారని గ్రామస్తులు తెలిపారు. అయితే మృతుడి ఛాతిపై కత్తితో దాడి చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో హత్య జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎస్ఐ సోమేశ్వర్ మాట్లాడుతూ ఛాతిపై కత్తితో దాడి చేసిన ఆనవాళ్లు ప్రాథమికంగా కనిపిస్తున్నాయని, హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి అసలు కారణం, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవుతాయని చెప్పారు.

# స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. శనివారం గ్రామంలో లబ్ధిదారులకు సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన వారందరికి ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కార్డు ఉండాలన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డు ద్వారా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ పథకాల లబ్ధి మరింత సులభతరం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్వని, డీలర్ రాంబాబు, స్థానికులు నర్సింహారావు, నాగేశ్వరరావు, శ్రీను, వెంకటేశ్వర్లు, సందీప్, రమేష్, పిచ్చయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడాలి

చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మేయర్ గణేష్



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు, ఉద్యమాలు నిర్మించాలని కొత్తగూడెం మేయర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మూడ్ గణేష్, రాష్ట్ర సమితి సభ్యుడు సలిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా శనివారం సిపిఐ కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ ఆధ్వర్యంలో 52వ డివిజన్ మేదర్ బస్తీలో వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశపాలన భూ స్వామ్యదోపిడీపై ఎర్రజెండా అండతో వేలాది మంది ప్రాణాలు అర్పించి భూమి భుక్తి విముక్తి కోసం పోరాడారని గుర్తు చేశారు. ఆ చారిత్రక పోరాటంలో ఎలాంటి పాత్ర లేని బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు నేడు రాజకీయ లబ్ధికోసం చరిత్రను వక్రీకరించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆ పోరాట వారసత్వాన్ని నేటితరం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, మాచర్ల శ్రీనివాస్, సపోర్ట్స రవి, ధనరాజ్, అజయ్, సురేష్, హైమద్, రాజా, కల్యాణ్, రాజు, రాము, కైసర్, విక్కీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి ఏచూరి

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సీతారాం ఏచూరి ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి, ప్రజా ఉద్యమాల యోధుడని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. చుంచుపల్లి మండలం ఎన్‌కె నగర్‌లోని కమ్మ కల్యాణ మండపంలో సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ ను శనివారం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, బండారు రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్ర జాస్వామ్యం, లౌకిక విలువల పరిరక్షణకు ఏ చూరి తుది శ్వాస వరకు పోరాడారని తమ్మినేని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ, లౌకిక విలువల పరిరక్షణలో ఏచూరి కీలక పాత్ర పోషించారని అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను ఏకం చేసిన ఏచూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, ఎజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/మధిర:** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం మధిర పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపి సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డు నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుధ్య, నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, బంధువులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్యసేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతిఒక్కరికి నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అంతక ముందు మధిర మండలం కేం ద్రంలో నూతనంగా మూడు కోట్ల అం చనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ, నాలుగు కోట్ల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అదనపు భవనం నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మధిర మండలంలోని సిరిపురంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూ నియర్ కళాశాల నూతన భవనం , అలాగే ఐటిఐ భవనం, ఎఐటిసి సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, సమస్యలుంటేపై అధికారుల దృష్టికి తేవాలని, పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రాంబాబు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాన జల్లులతో పంటలకు జీవం

సాగు విస్తీర్ణంలో ఆశలు..

రైతుల్లో హర్షం

జిల్లాలో ఇంకా లోటు వర్షపాతమే




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగుకు ఊతం లభిస్తోంది. జిలాల్లో ఈ సీజన్లో సుమారు 5 లక్షల ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పడుతున్న వానలతో పంటలకు మేలు చేకూరనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 6,37,800 ఎకరాల్లో పంటలు సాగు అంచనాలు తయారు చేశారు. కానీ ప్రస్తుతం సుమారు 4,69,210 ఎకరాల్లో మాత్రమే సాగు అవుతోంది. ఇందులో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, అపరాలు, తదితర పంటలున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు లేక రైతులు బేల చూపులు చూస్తున్న తరుణంలో ఇప్పుడు పడుతున్న వర్షం మొక్కలకు జీవం పోస్తుందని రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో ప్రస్తుతం 4,69,792 ఎకరాల్లో సాగువుతోంది. ఇందులో వరి 96,897 ఎకరాలు, పత్తి 2,46,491 ఎకరాల్లో, మొక్కజొన్న 6,521 ఎకరాల్లో, పెసలు 6,937 ఎకరాలు, కందులు 2,946 ఎకరాలు, అపరాలు 110 వేల ఎకరాలు కాగా ఇతరాలు 2,12,590 ఎకరాల్లో సాగువుతోంది. ఈ దశలో కురుస్తున్న వర్షాలు పంటల ఎదుగుదలకు మరింత దోహదపడతాయని రైతులు ఆశిస్తున్నారు. కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, వ్యవసాయ బావుల్లో నీటి లభ్యత మెరుగుపడే అవకాశముందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న పంటలు చేతికందుతాయని రైతులు ఆశిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. వ్యవసాయ కూలీలు పొలాల్లో కొప్పెర్లు వేసుకుని పనులు చేస్తూ ఆ కొప్పర్లుతోనే భోజనాలు చేస్తున్నారు. వర్షాలు సాగుకు ఊతమివ్వనుండగా రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు వర్షపాతం తీరును బట్టి పంటల పరిస్థితి మరింత మెరుగుపడి దిగుబడులు పెరిగే అవకాశముంది. జిల్లాలో ఇంకా లోటువర్షపాతమే నమోదవుతోంది. జూన్ మొదలుకుని ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వానలు కురవలేదు. జూన్ నెలలో 168.1 మి.మీ. వర్షపాతం పడాల్సి ఉండగా 151.1 మి.మీ. మాత్రమే కురవగా 10.5 మి.మీ. లోటు నమోదైంది. జులైలో 312.7 మి.మీ. పడాల్సి ఉండగా 200.1 మి.మీ. కురవడంతో 36.0 మి.మీ.లోటు ఉంది. ఆగస్టులో295.0 మిల్లీ మీటర్లు వర్షపాతం ఉడాల్సి ఉండగా కేవలం 151.3 మి.మీ. పడగా 49 మి.మీ. లోటు వర్షపాతం కురిసింది. తాజాగా సెప్టెంబర్ నెల 12 వ తేదీ వరకు 91.0 మి.మీ. వర్షం పడాల్సి ఉన్నప్పటికీ కేవలం 32.6 మి.మీ. కురవగా ఇంకా 64 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పైరుపై ఆశలు వదులుకున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాలతో మొక్కలకు ఊపిరందినట్లు రైతుల ఆశలకు కూడా ఊపిరి పడింది.

## గ్లోబల్ సౌత్ దేశాలు నియమాలు
# రూపొందించేవిగా ఎదగాలి

‘బ్రిక్స్’ సదస్సు ప్రారంభించిన ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ :** గ్లోబల్ సౌత్ నియమాలను రూపొందించేదిగా మారాలని, ప్రపంచ పాలనలో ప్రస్తుతం ఉన్న ‘విశేషాధికారాల పిరమిడ్ నిర్మాణం’ స్థానంలో భాగస్వామ్య వేదికకు దారి ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వాణిజ్య ఘర్షణలు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు పెరుగుతున్న ఆర్థిక ప్రతికూలతలను ప్రేరేపిస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన ఇక్కడ రెండు రోజుల వార్షిక ‘బ్రిక్స్’ సదస్సును పారంభించారు. అనంతరం కీలక ప్రసంగం చేశారు. ప్రస్తుత ప్రపంచ, ప్రాంతీయ సంక్షోభాల వల్ల ప్రాంతీయ ముప్పును ఎదుర్కొంటున్న నావికులకు రక్షణ కల్పించేందుకు ‘నావికుల అత్యవసర సహాయక వ్యవస్థ’ ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తూ, ‘బ్రిక్స్’ విధానం కింద ప్రపంచ పాలనా సంస్కరణల కోసం, ప్రధానమంత్రి 10అంశాల రోడ్ మ్యాప్‌ను కూడా ఆవిష్కరించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతీన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ఇరాన్ ప్రెసిడెంట్ మసూద్ పెజెష్కియన్, దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, అబుదాబి యువ రాజు మోహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్–సిసిలతో సహా పలువురు ప్రపంచ నాయకుల సమక్షంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో నరేంద్ర మోదీ ‘బ్రిక్స్’ ఒక కీలకమైన ప్రపంచ సంస్థగా ఆవిర్భవించడాన్ని ప్రశంసించారు. అలాగే, తీవ్రమైన ప్రపంచ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వీలుగా,




రాబోయే 20ఏళ్లలో ఈ కూటమికి ఒక నూతన, ప్రతిష్ఠాత్మక అజెండా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం, ట్రంప్ ప్రభుత్వ వాణిజ్య , సుంకాల విధానాల వంటి ప్రతికూల ప్రభావాలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న తరుణంలో, న్యూఢిల్లీలో జరుగుతోన్న ఈ శిఖరాగ్ర సమావేశం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. బ్రిక్ అధ్యక్షత హోదాలో ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని సంఘర్షణల ఆర్థిక పరిణామాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలను వేరచేయానికి, భారతదేశం ప్రధానంగా ఆహారం, ఇంధనం, సరఫరా గొలుసు భద్రత కోసం ఆచరణయోగ్యమైన పరిష్కారాలను అన్వేషించడం ద్వారా గ్లోబల్ సౌత్‌ను తన అజెండాకు కేంద్రంగా ఉంచింది. ‘ప్రస్తుత ప్రపంచ పాలనా వ్యవస్థ ఒక పిరమిడ్‌ను పోలి ఉంటుంది. అధికారం, నిర్ణయాధికారం పై స్థాయిలో కేంద్రీకృతమై ఉండగా, కింది స్థాయిలలోని దేశాలు ఆ నిర్ణయాల ప్రభావానికి లోనవుతాయి తప్ప, వాటిని రూపొందించే స్థితిలో ఉండవు’ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ‘నేడు ప్రపంచ సంక్షోభాలలో గ్లోబల్ సౌత్ ముందు వరుసలో నిలుస్తున్నప్పటికీ, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. మనం ఈ ‘విశేషాధికారాల పిరమిడ్’ను భాగస్వామ్య వేదికగా మార్చాలి. అక్కడ ప్రతీ దేశానికి ఒక గొంతుక ఉండాలి. ప్రతీ సభ్యునికీ ఒక వాటా ఉండాలి. చేసే ప్రతీ ప్రయత్నానికి మానవాళి అభివృద్ధి కేంద్రంగా ఉండాలి’ అని మోదీ ఈ దిశగా ‘బ్రిక్స్’ కూటమి సంస్కరణల రోడ్ మ్యాప్ యొక్క విస్తృత చట్రం కింద ప్రపంచ పాలన సంస్కరణల కోసం 10 సూత్రాల రోడ్ మ్యాప్‌ను సంయుక్తంగా రూపొందించాలని ప్రధానమంత్రి ప్రతిపాదించారు. తదుపరి శిఖరాగ్ర సమావేశం నాటికి ఈ రోడ్ మ్యాప్‌ను ఖరారు చేయాలని మోదీ పేర్కొన్నారు. ఈ రోడ్‌మ్యాప్‌ను ‘ప్రాతినిథ్యం’ అనే అంశంపై వివరిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణను ఇకపై వాయిదా వేయలేమని, దానిపై చర్చలను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోకి స్పష్టమైన ఫలితాలతో తీసుకురావాలని మోదీ వివరించారు. ‘మనం గ్లోబల్ సౌత్‌ను నియమాలను పాటించే దేశం నుండి, నియమాలను రూపొందించే దేశంగా మార్చడానికి కృషి చేయాలి’ అని ప్రధాని అన్నారు. ప్రపంచ వాణిజ్య ప్రవాహంలో సముద్రయాన కార్మికులు పోషిస్తున్న కీలకపాత్రను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అయితే, ప్రపంచ పాలనా నిర్మాణంలో సంస్కరణలు తీసుకురావాలని, ‘బ్రిక్స్’ కూటమిని మరింత బలోపేతం చేసే మార్గాలను అన్వేషించాలని మోదీ తన ప్రసంగంలో ప్రధానంగా పిలుపునిచ్చారు. ‘బ్రిక్స్‌లోని మన ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మలచుకోవాల్సిన సమయం ఇది’ అని మోదీ అన్నారు.‘బ్రిక్స్’ కొనసాగింపు, అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని మోదీ పిలుపునిచ్చారు.

## భారత దౌత్యస్థానాన్ని, హోదాను పునరుద్ధరించాలి

బ్రిక్స్ సదస్సు ప్రారంభోత్సవం వేళ మోదీకి కాంగ్రెస్ సూచన



**న్యూఢిల్లీ :** బ్రిక్స్ వేదికగా భారత్ తన దౌత్య బలాన్ని మరోసారి చాటుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బ్రిక్స్ సదస్సు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పలు సూచనలు చేసింది. సంక్షోభ సమయాల్లో భారత్ నమ్మకమైన, నిర్మాణాత్మక భాగస్వామిగా నిలవాలని కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. భారత్ గతంలో అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రత్యేకమైన దౌత్య స్థానం కలిగి ఉండేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు ఆ స్థానం, దౌత్యపరమైన ప్రభావాన్ని తిరిగి సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా ఉంటుందని చెప్పడం మాత్రమే కాకుండా అందుకు తగ్గట్టుగా చర్యలు కూడా ఉండాలని ఖుర్షీద్ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌పై జరిగిన దాడుల విషయంలో భారత్ వైఖరిపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఆ అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో భారత్ దౌత్యపరమైన పాత్ర పరిమితంగా ఉందని విమర్శించింది. బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో కూడా ప్రభుత్వం తగినంత ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. అదే సమయంలో దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశం దక్షిణాఫ్రికాకు భారత్ నుంచి మరింత మద్దతు ఉండాల్సిందని పేర్కొంది.

**బ్లాక్ రాజకీయాలకు దూరంగా!**

ప్రస్తుత బ్రిక్స్ సదస్సును భారత్ దౌత్య నైపుణ్యాన్ని చూపించేందుకు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సూచించింది. సభ్య దేశాల మధ్య ఐక్యత పెంచాలి కానీ బ్రిక్స్‌ను మరో అంతర్జాతీయ బ్లాక్‌గా మార్చే రాజకీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థలు, అనుసంధానం వంటి అంశాల్లో భారత్ ముందుండాలని సూచించింది. భారత్ తన ప్రయోజనాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన ప్రపంచ వ్యవస్థ కోసం పనిచేసే దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా ఉండాలని కాంగ్రెస్ తెలిపింది. గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్ మధ్య భారత్ ఒక విశ్వసనీయమైన వారధిగా వ్యవహరించాలని పేర్కొంది. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వస్తు వాణిజ్యంలో 19.6 శాతం వాటా కలిగి ఉన్నాయని ఖుర్షీద్ తెలిపారు. అయితే బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు సమతూకంగా లేవని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ ఉపయోగించుకోవాలని సూచించారు. భారత వస్తువులు, సేవలకు మరింత మార్కెట్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఇతర దేశాల్లో భారత కంపెనీలు ఎదుర్కొంటున్న వాణిజ్య అడ్డంకులను తగ్గించాలని పేర్కొంది. అదే సమయంలో భారత సంస్థలకు పోటీ చేసేందుకు న్యాయమైన, స్పష్టమైన అవకాశాలు కల్పించాలని సూచించింది. బ్రిక్స్ పే వ్యవస్థపై జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ స్వాగతించింది. సరఫరా వ్యవస్థలు, అనుసంధానంపై కూడా సభ్య దేశాల మధ్య ఒప్పందాలు కుదరాలని కోరింది. 2014లో ఏర్పాటు చేసిన కాంటింజెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించింది. ఇందులో భారత్ 18 బిలియన్ డాలర్ల నిధులకు హామీ ఇచ్చిందని ఖుర్షీద్ గుర్తు చేశారు.

### మలేషియా, యుఏఇ, వియత్నాం, ఇథియోపియా దేశాధినేతలతో..
## ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు






**న్యూఢిల్లీ :** పెరుగుతున్న ప్రపంచ ఉద్రిక్తతల నుండి, వాణిజ్యం, సరఫరా గొలుసులను కాపాడేందుకు శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మలేషియా, వియత్నాం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఇ), ఇథియోపియా నాయకులతో వేర్వేరు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. వారితో కీలక ఖనిజాలు, ఇంధనం, ఆహార భద్రత అంశాలపై చర్చలు జరిపారు.‘ బ్రిక్స్’ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఈ సమావేశాలు జరిగాయి. అబుదాబి యువరాజు మొహమ్మద్ బిజన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో జరిపిన చర్చల్లో, పశ్చిమ ఆసియాలోని మొత్తం పరిస్థితి, భారత్–యుఏఇ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గాల గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనతో చర్చించారు. ‘రక్షణ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), కీలక ఖనిజాలు, ఇంధనం, ఆహారభద్రత, కనెక్టివిటీ రంగాలలో మన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంపై చర్చించాం’ అని మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. పశ్చిమాసియాలో అనిశ్చితి నెలకొన్న తరుణంలో, బలమైన బారత్–యుఏఇ బంధం స్థిరత్వం, శ్రేయస్సు, శాంతికి ప్రతీకగా నిలుస్తుంది అని మోదీ పేర్కొన్నారు. వారి సమావేశంలో, మోదీ, మలేషియా ప్రధానమంత్రి అన్వర్‌బిన్ ఇబ్రహీం వాణిజ్యం, పెట్టుబడి, రక్షణ, భద్రత, సెమీకండక్టర్లు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, ఫిన్‌టెక్ సహా పలురంగాలలో దైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించారు. సబాలోని కోటా కినాబాలులో భారత కాన్సలేట్ జనరల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి మలేషియా అంగీకారం తెలిపిన విషయాన్ని ఇబ్రహీం మోదీకి తెలియజేశారు.ఆసియన్–భారత్ సంబంధాలను బలోపేతం చేయడంలో మలేషియా అందిస్తున్న నిరంతర మద్దతును ప్రధానమంత్రి మోదీ అభినందించారు. ఇరు దేశాధినేతలు పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై పరస్పరం తమ అభిప్రాయాలను పంచుకున్నారు’ అని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) తెలిపింది. భారత్–మలేషియా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ నిబద్ధత కొనసాగుతుందని ఇద్దరు నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారని ఎంఇఏ వెల్లడించింది. మోదీ వియత్నాం ప్రధానమంత్రి లేమిన్ హంగ్‌ల మధ్య జరిగిన సమావేశం ప్రధానంగా ద్వైపాక్షిక వాణిజ్య పెట్టుబడి సంబంధాలపై దృష్టి సారించింది. మోదీ ఇథియోపియా ప్రధానమంత్రి అభియ్ అహ్మద్ అలీతో జరిపిన చర్చలు కూడా రక్షణ, వాణిజ్య రంగాలలో ఇరుపక్షాల సంబంధాలను మరింత విస్తరించే మార్గాలపైనే కేంద్రీకృతం అయ్యాయి. గత ఏడాది డిసెంబరులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అడిస్ అబాబా పర్యటన తర్వాత ఈ సమావేశం జరిగింది. ఇరు నేతలు పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. బహుపాక్షిక వేదికలలో సన్నిహిత సహకారానికి తమ నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు.

## ‘కొత్త రూపంలో పాత ఆరోపణలు’

ఇడి తాజా ఆరోపణలపై కేరళం ప్రతిపక్షనేత పినరయ్ విజయన్



కన్నూర్ : కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) కేసులో తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేసిన తాజా ఆరోపణలను కేరళం అసెంబ్లీ ప్రతిపక్ష నేత పినరయి విజయన్ ‘కొత్త రూపంలో పాత ఆరోపణలు’గా అభివర్ణించారు. చట్టాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడానికి ఆ సంస్థ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఏ) కింద జరిపిన దర్యాప్తు, సోదాలలో సేకరించిన ఆధారాల ఆధారంగా, మాజీ ముఖ్యమంత్రి విజయన్, ఆయన కుటుంబంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఇడి ఇటీవల రాష్ట్ర పోలీసు చీఫ్ రావడ ఎ. చంద్రశేఖర్‌కు లేఖ రాసింది. ‘ఐటి కన్సల్టెన్సీ సేవలు’ అనే ముసుగులో విజయన్ కుమార్తె వీణా టి.కి చెందిన ‘ఎక్సలాజిక్ సొల్యూషన్స్’ (ప్రస్తుతం మూతపడిన సంస్థ)కు సిఎంఆర్ఎల్ రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఆ సంస్థ ఆరోపించింది. కాగా, శనివారం కన్నూర్ విజయన్ విలేకరులతో మాట్లాడుతూ ఇడి లేవనెత్తిన ఆరోపణల స్వభావంలో ఇప్పుడు పెద్ద మార్పు వచ్చిందన్నారు. ఎటువంటి సేవలు అందించకుండానే ఎక్సలాజిక్ డబ్బు తీసుకున్నందున సిఎంఆర్ఎల్ ఆర్థిక నష్టాన్ని చవిచూసిందని గతంలో ఆరోపణలు వచ్చేవని, ఆ ప్రాతిపదికనే దర్యాప్తు, సోదాలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. ‘ఇడి ఇప్పుడు చెబుతున్నది దీనికి పూర్తిగా భిన్నమైన విషయం. ఎక్సలాజిక్ పొందిన డబ్బు సేవలకు సంబంధించిన ప్రతిఫలం కాదని, నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిఎంఆర్ఎల్‌కు అక్రమంగా అనుకూలతలు కల్పించానని, ఆందుకు ప్రతిఫలంగానే ఈ డబ్బును లంచంగా తీసుకున్నానని ఇడి ఇప్పుడు ఆరోపిస్తోంది’ అని ఆయన అన్నారు. లంచం ఆరోపణతో ముందుకు వెళ్లే ముందు ఇడి మొదట ఈ ప్రాథమిక వైరుధ్యానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోపణల రూపం పదేపదే మారినప్పటికీ, ఒక ముఖ్యమంత్రిగా తాను సిఎంఆర్ఎల్‌కు ఎటువంటి అసాధారణ లేదా నిబంధనలకు విరుద్ధమైన అనుకూలతను కల్పించాననే ప్రాథమిక ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకలేదని విజయన్ చెప్పారు.

## పశ్చిమాసియా శాంతి సాధనకు బ్రిక్స్‌దేశాల పాత్ర

### చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు

- రోజురోజుకూ విజృంభిస్తున్న ఏకపక్షవాదం
- ప్రచ్ఛన్నయుద్ధ ఆలోచనాధోరణిని వ్యతిరేకిద్దాం
- మానవాళి ఉమ్మడి భవిష్యత్తుకోసం కలిసి పనిచేద్దాం
- శరవేగంగా వృద్ధిచెందుతున్న దక్షిణార్థగోళ దేశాలు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో శాంతి సాధనకు బ్రిక్స్‌దేశాలు తమ వంతు పాత్ర వహించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. న్యూఢిల్లీ భారత్ మండపంలో శనివారం బ్రిక్స్ 18వ సదస్సులో జిన్‌పింగ్ ప్రారంభోపన్యాసం చేస్తూ,పశ్చిమాసియాలో శాంతి–సామరస్యాల సాధనకు,ఒక ఉత్తమస్థాయీ భవిష్యత్తు నిర్మాణానికి అందరితో కలిసి పనిచేయడానికి బ్రిక్స్ సభ్యదేశాలతో చైనా కలిసి కృషి చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. జిన్హువా వార్తాసంస్థ ఆయన ప్రసంగాన్ని ప్రచురించింది.రోజు రోజుకూ విస్తరిస్తున్న,అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు,అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ వేదిక ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వేదిక అని ప్రశంసించారు.ప్రపంచ కృత్రిమ మేధస్సు సహకార సంస్థలో కలిసి పనిచేయడానికి బ్రిక్స్‌దేశాలకు ఆయన స్వాగతం పలికారు.
పశ్చిమాసియాలో శాంతిసాధనకు ద్విముఖపాత్ర పోషించాలన్నారు. ఈ ప్రాంతంలో యుద్ధ పరిస్థితిలో మార్పులు కొనసాగుతున్నాయని,యుద్ధంవల్ల ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని,ఇది అంతర్జాతీయ సమాజ ఉమ్మడి ప్రయోజనాలకు ఎంతమాత్రం దోహదపడదన్నారు.పరస్పర సంబంధాలు,సంభాషణల ద్వారా,విభేదాలను సజావుగా నియంత్రించుకోవడం ద్వారా బ్రిక్స్ సభ్యదేశాలు గాఢమైన అవగాహన పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడచిన రెండు దశాబ్దాలుగా బ్రిక్స సహకార యంత్రాంగం నిరంతరాయంగా వృద్ధిచెందుతూ,విస్తరిస్తోందని,అద్భుతమైన చైతన్యాన్నీ,వేగాన్ని ప్రదర్శించిందన్నారు.ఇరవై సంవత్సరాలుగా స్వయంసమృద్ధి,స్వీయ శక్తిసామర్థ్యాలను సమకూర్చుకుందని,కూటమి దేశాలు వారి వారి జాతీయ పరిస్థితులకు అనుగుణంగా చాలా క్రియాశీలంగా అభివృద్ధి మార్గాలను విస్తరించుకుంటున్నాయని,మరోవైపు వృద్ధిచెందుతున్న మార్కెట్ల మధ్య ఐక్యతను ప్రదర్శిస్తున్నాయన్నారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం దగ్గర నుండి కోవిడ్–19 మహమ్మారి,వాతావరణ మార్పు వంటి




విస్తారమైన అంశాల వరకూ బ్రిక్స్‌దేశాలు సవాళ్ళను పరిష్కరించుకోవడానికి ఉమ్మడిగా కృషి చేస్తున్నాయన్నారు. ఈ కూటమి దేశాలు చా లాస్థిరంగా దక్షిణార్థగోళ దేశాల ఉమ్మడి ప్రయోజనాలను ఐక్యంగా సంరక్షిస్తున్నాయని,ప్రపంచానికి స్థిరత్వాన్ని,సానుకూల పురోగతిని సమకూరుస్తున్నాయన్నారు. ప్రచ్ఛన్నయుద్ధ ఆలోచనాధోరణి,సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడాన్ని, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని బ్రిక్స్‌దేశాలు తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. శక్తిసామర్థ్యాల విషయంలో దక్షిణార్థగోళ దేశాలు శరవేగంగా వృద్ధిచెందుతున్నాయని,ఈ పరిస్థితుల్లో బహుళధృవ ప్రపంచ వాతావరణ పరిస్థితిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు.ఉమ్మడి,సమగ్ర,సహకార,స్థిరమైన భద్రతాదార్శనికతను బిక్స్‌దేశాలు ప్రముఖంగా చాటి చెప్పాలని,ప్రచ్ఛన్నయుద్ధ మనస్తత్వాన్ని వ్యతిరేకించాలని జిన్‌పింగ్ కోరారు.ఏకపక్షవాదం,అధికార రాజకీయాలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయన్నారు. అంతర్జాతీయ చట్టాలు,అంతర్జాతీయ క్రమశిక్షణ అడుగంటిపోయిందని,శాంతికి,అభివృద్ధికి,భద్రతకు విఘాతం కలుగుతోందన్నారు. బ్రిక్స్‌దేశాలు చరిత్రలో సరైన పక్షంవైపు దృఢంగా నిలబడాలని,కాలానికి మార్గదర్శకులుగా ఉండాలని,అంతర్జాతీయ వ్యవస్థను మరింత న్యాయబద్ధంగా,సమానత్వం దిశగా నడిపించాలని,మానవాళి ఉమ్మడి భవిష్యత్తుకోసం కలిసి పనిచేయాలని కోరారు.

### విజయన్‌పై ఇడి ఆరోపణలు..
## ఎల్‌డిఎఫ్ రాజకీయంగా ఎదుర్కొంటది

కేరళం రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** అవినీతి ఆరోపణల కేసులో కేరళం మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం) సీనియర్ నేత పినరయి విజయన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఇడి ఆదేశించిన నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం శనివారం స్పందించారు. ఈ వ్యవహారాన్ని ఎల్‌డిఎఫ్ రాజకీయంగా ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. విజయన్ విషయంలో ఆయన నేరుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. సిఎంఆర్ఎల్ చెల్లింపుల కేసులో విజయన్, ఆయన కుటుంబంపై కేసు నమోదు చేయాలని కోరుతూ కేరళం డిజిపికి ఇడి రాసిన లేఖ గురించి అడిగినప్పుడు, ఆ కేసు వివరాలు తనకు పూర్తిగా తెలియవని విశ్వం చెప్పారు. శనివారం తిరువనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆ కేసు పూర్తి వివరాలు నాకు తెలియవు అని ఆయన అన్నారు. సిపిఐ వైఖరి గురించి మరింతగా అడిగినప్పుడు, తమ పార్టీ రాజకీయ విధానం ఎల్‌డిఎఫ్, వామపక్షాల విధానమేనని విశ్వం చెప్పారు. కేరళలో సిపిఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌లో సిపిఐ భాగస్వామిగా ఉంది. ‘అన్ని అంశాలపై సిపిఐకి ఒక రాజకీయ వైఖరి ఉంటుంది. వామపక్ష విలువలు మాకు రాజీపడని అంశాలు. కేంద్ర సంస్థలు రాజకీయాలు చేస్తే, ఎల్‌డిఎఫ్ దానిని రాజకీయంగా ఎదుర్కొంటుంది’ అని ఆయన అన్నారు. ఇడితో సహా కేంద్ర సంస్థల పాత్ర అందరికీ తెలిసిందేనని, అవి కొన్నిసార్లు రాజకీయ ఉద్దేశాలతో వ్యవహరిస్తాయని విశ్వం ఆరోపించారు. అటువంటి చర్య జరిగితే, ఎల్‌డిఎఫ్ దానిని వ్యతిరేకిస్తుంది అదే సిపిఐ విధానం అని ఆయన చెప్పారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న విజయన్‌పై కేసు నమోదు చేయాలన్న ఇడి చర్యపై సిపిఐ తన వైఖరిని స్పష్టం చేస్తుందని ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి. రామకృష్ణన్ ఆశించిన మరుసటి రోజే విశ్వం ఈ వ్యాఖ్యలు చేశారు.

### బిజెపి హయాంలో గుజరాత్‌లో
## సుజలాం లేదు.. సుఫలాం లేదూ...

- కలుషిత తాగునీటిపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ :** కొన్ని గ్రామాల్లో నీరు కలుషితమైనట్లు వెల్లడించిన కాగ్ నివేదిక ఆధారంగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం గుజరాత్ బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమ 28 ఏళ్ల పాలనలో ఆ పార్టీ రాష్ట్రంలో కేవలం అబద్ధపు ప్రచారాన్ని మాత్రమే సాగించిందని ఆయన ఆరోపించారు. ‘మోదీ జీ చేసిన ‘హర్ ఘర్ జల్’ (ప్రతి ఇంటికీ నీరు) వాగ్దానాలు కలుషిత నీటిలో కొట్టుకుపోయాయి’ అని ఖర్గే శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్రంలో 90 శాతం నీటి నమూనాలు తాగడానికి పనికిరావని తేలిందని ఆయన తెలిపారు. ‘మోదీ జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2004లో ’సుజలం–సుఫలం’ పథకం గురించి గొప్పగా ప్రచారం చేశారు. కానీ నేటికీ గుజరాత్ ప్రజలు ఒక చుక్క నీటి కోసం తపిస్తున్నారు’ అని ఆయన హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. మోదీ ప్రధానమంత్రి అయ్యాక కూడా అదే తరహా నిష్ప్రయోజనమైన ప్రచారం ‘జల్ జీవన్ మిషన్’ విషయంలోనూ కొనసాగిందని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. ‘2022 నాటికి 100 శాతం కుళాయి కనెక్షన్లు కల్పించామన్న బిజెపి ప్రభుత్వ వాదనను కాగ్ ఇప్పుడు బట్టబయలు చేసింది. ఇంకా 14 లక్షల కుటుంబాలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయి’ అని ఖర్గే ఆరోపించారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, గత వారమే అహ్మదాబాద్ జిల్లాలోని ధోల్కాలో కలుషిత నీరు తాగడం వల్ల క్యాన్సర్‌తో 54 మంది మరణించినట్లు వార్తలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. సౌరాష్ట్రలోని రాజ్‌కోట్, జామ్‌నగర్ వంటి ప్రాంతాలు ఇంకా తాగునీటి కోసం అల్లాడుతున్నాయని, కచ్ సౌరాష్ట్ర ప్రాంతాల్లో రైతులు కరువుతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ‘గుజరాత్ ప్రజలకు 2047 నాటికి ’వికసిత్ భారత్’ (అభివృద్ధి చెందిన భారత్) కలలు చూపించారు, కానీ 28 ఏళ్ల బిజెపి పాలనలో కేవలం తప్పుడు ప్రచారం, కృత్రిమమైన ఆకర్షణీయ చిత్రాల ప్రదర్శన, ప్రజల కళ్లు గప్పే పనులే జరిగాయి! బిజెపి పాలనలో ‘సుజలం’ (స్వచ్ఛమైన నీరు) లేదు, అలాగే ‘సుఫలం’ (పండ్లు, సారవంతమైన పంటలతో సమృద్ధిగా ఉండటం) కూడా లేదు!’ అని ఖర్గే ఆరోపించారు. గుజరాత్‌లో ‘జల్ జీవన్ మిషన్’ అమలులో ఉన్న తీవ్ర లోపాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ బయటపెట్టింది. ప్రాజెక్ట్ జాప్యాలు, ఆర్థిక అవకతవకలు, రాష్ట్రవ్యాప్తంగా నీటి నాణ్యత పరీక్షలలో ఉన్న లోపాలను ఈ నివేదిక ఎత్తిచూపింది. శుక్రవారం నాడు రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాల చివరి రోజున సమర్పించిన కాగ్ నివేదిక ప్రకారం, ఎంపిక చేసిన గ్రామాల్లో పరీక్షించిన నీటి నమూనాలలో దాదాపు 89 శాతం వినియోగానికి పనికిరానివిగా తేలాయి. అలాగే, తప్పుడు లెక్కలు, నిబంధనలకు విరుద్ధమైన ఖర్చుల కారణంగా కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల అదనపు చెల్లింపులు జరిగాయి.ఈ ఆడిట్ నివేదిక 2019–20 నుండి 2023–24 వరకు జల్ జీవన్ మిషన్ అమలు తీరును సమీక్షించింది.

## హాఫీజ్ సయీద్‌పై ఎన్ఐఎ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ



**జమ్ము :** కేంద్రపాలిత ప్రాంతంలో పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలకు ఆయుధాలు, నిధులు సరఫరా, ఆదేశాలు జారీ చేసిన కేసులో భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా భావిస్తున్న లష్కరే తొయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం సయీద్ పాకిస్థాన్‌లో ఉన్నాడు. రెండు నెలల్లో సయీద్‌పై జారీ అయిన రెండవ నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 75 కింద ఉగ్రవాదిగా ప్రకటించబడిన సయీద్‌పై ఎన్ఐఎ దాఖలు చేసిన దరఖాస్తుపై విచారణ జరుపుతూ, జమ్ములోని ఒక ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 8న ఈ నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ ఏడాది ప్రారంభంలో శ్రీనగర్ శివార్లలోని పాండాచ్ వద్ద జరిగిన తనిఖీలో మహమ్మద్ నఖీబ్ భట్ అరెస్టుకు సంబంధించిన కేసులో, పంజాబ్‌లోని (పాకిస్థాన్) సర్గోధా నివాసి అయిన సయీద్‌ను పరారీలో ఉన్న నిందితుడుగా ఆ దరఖాస్తులో పేర్కొన్నారు. బత్‌పోరా నివాసి అయిన భట్ వద్ద నుండి చైనాలో తయారైన ఒక గ్రెనేడ్ 15 సజీవ తూటాలను స్వాధీనం చేసుకున్నారు. జకోరా పోలీస్ స్టేషన్‌లో భట్‌పై యుఎపిఎ, ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు ఒక ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడానికి దారితీసింది. దీని ఫలితంగా ఎల్ఇటి, దాని అనుబంధ సంస్థ అయిన రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్)తో సంబంధం ఉన్న పలువురు ఉగ్రవాదులు, ఇద్దరు పాకిస్తానీ జాతీయులను అరెస్టు చేశారు. నిషేధిత ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు అయిన సయీద్ ప్రమేయం దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని, అరెస్టు అయిన పాకిస్తానీ ఉగ్రవాదులకు అతనితో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఎన్ఐఎ తెలిపింది. ‘సయీద్ పాకిస్తాన్ నుంచి పనిచేస్తూ, కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాదులకు ఆయుధాలు, డబ్బు, ఆదేశాలు అందిస్తున్నాడు. సదరు ఉగ్రవాది ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నాడని, చట్టం కంట పడకుండా తప్పించుకోవడానికి ఉద్దేశపూర్వకంగా అరెస్టును తప్పించుకుంటున్నాడని సమాచారం అందింది’ అని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. ఏజెన్సీ వాదనలు విన్న అనంతరం, ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమ్ సాగర్, దర్యాప్తు సమయంలో సయీద్ ప్రమేయం వెలుగులోకి వచ్చిందని, అతను ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# స్వీడన్ ఎన్నికల్లో వామపక్ష కూటమి ఆధిక్యం

**ముందస్తు నివేదికల వెల్లడి**
**నేడు సార్వత్రిక ఎన్నికలు**



**స్టాక్‌హోం:** ఉత్తర యూరప్ స్కాండినేవియన్ ద్వీపకల్పదేశం స్వీడన్‌లో ఆదివారం సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరుగుతుంది. సోమవారం సాయంత్రం వరకూ ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. సోషల్ డెమొక్రాట్స్ తరపున మాగ్డలీనా ఆండర్‌సన్‌ను ప్రధానమంత్రి పదవిలో ప్రతిష్ఠించేందుకు వామపక్షాలు ప్రజల్లోకి వెళ్ళి తీవ్ర కృషి చేస్తున్నాయి. దేశంలో ఎనిమిది మిలియన్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. స్వీడన్ ప్రజలకు సంకీర్ణ కూటమి రాజకీయాలు అలవాటే. ముందస్తు అంచనా పోలింగ్ సమాచారం ప్రకారం,ఈ ఎన్నికల్లో నాలుగు ప్రగతిశీల పార్టీలు భాగస్వామిగా ఉన్న వామపక్ష కూటమి స్వల్ప ఆధిక్యంలో ఉన్నాయి. ముందస్తు సర్వే నివేదికల ప్రకారం వామపక్ష కూటమికి 50.8 శాతం,మితవాదులకు 47.6 ప్రజల మద్దతు ఉంది. వామపక్ష కూటమిలో భాగస్వామిగా ఉన్న సోషల్ డెమొక్రాట్స్ పార్టీ 28.6 శాతం ఓట్లతో ఆధిక్యంలో ఉంది. వామపక్ష–మితవాద కూటముల మధ్య దేశంలో హోరాహోరీ పోటీ కొనసాగుతోంది. జులై 30వ తేదీన విదేశీలలో ఉండే స్వీడన్ జాతీయులు పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. దేశ అత్యున్నత చట్టసభ రిక్స్‌డాగ్ పార్లమెంటులో మొత్తం 349 స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ కూటమి అయినా 175 స్థానాలు గెలుచుకోవాలి.ఐతే ఆగస్టు 21వ తేదీన ఒక స్వీడన్ విద్యార్థి పెద్ద కత్తి తీసుకుని పాఠశాలపై దాడిచేసి హత్యలకు పాల్పడిన తర్వాత అనేకమంది నాయకులు తమ ఎన్నికల ప్రసంగాలను వాయిదా వేసుకున్నారు. దేశ పార్లమెంటుకు,స్థానిక చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతూ ఉండటంతో స్వీడన్‌లో రాజకీయ కూటములకు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. మోడరేట్స్(ఎం పార్టీ),క్రిస్టియన్ డెమొక్రాట్స్,లిబరల్స్,స్వీడన్ డెమొక్రాట్లతో కూడిన పచ్చిమితవాద కూటమి 2022 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి పరిపాలన సాగించింది. ఈ నాలుగు పార్టీలు టిడో పార్టీలుగా ప్రసిద్ధి చెందాయి. ప్రస్తుతం ఎం పార్టీ నాయకుడు ఉల్ఫ్ క్రిస్టెర్సన్ ప్రధానమంత్రిగా ఉన్నారు. తాను తిరిగి అధికారంలోకి వస్తే పచ్చిమితవాద నాయకులకు మంత్రిపదవులు ఇస్తానని ప్రధానమంత్రి క్రిస్టెర్సన్ హామీ ఇచ్చారు.నయా నాజీ ముఠాల మద్దతు ఉన్న క్రిస్టెర్సన్‌కు స్వీడన్ డెమొక్రాట్ల గట్టి మద్దతు ఉంది. 2024 మార్చిలో స్వీడన్ నాటో కూటమిలో చేరింది.

# ఐర్లాండ్‌కు ఎలాంటి హానీ చేయను:ట్రంప్

**ఎప్పటికైనా ఐర్లాండ్ ఏకీకృతమవుతుంది**



**డబ్లిన్:** ఐర్లాండ్‌కు ఎలాంటి హానీ తలపెట్టాలని కోరుకోవడంలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఏకీకృత ఐర్లాండ్‌ను తాను చూడాలని కోరుకుంటున్నాన్నారు. ఏకీకృత ఐర్లాండ్ ఒక గొప్ప విషయమన్నారు.రెండు రోజుల పర్యటన నిమిత్తం ట్రంప్ ఐర్లాండ్‌కు వెళ్ళారు. ఆ దేశ ప్రధానమంత్రి మైఖెల్ మార్టిన్ (టావోసీచ్),ఇతర నాయకులతో ఆయన సమావేశాలు నిర్వహించారు.ఐర్లాండ్‌తో అమెరికాకు బలమైన బంధం ఉందని మార్టిన్‌తో సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండు దేశాలూ బాగా పనిచేస్తున్నాయని, ప్రస్తుతం ఉన్న అనుబంధం గతంలో ఎన్నడూలేదని అన్నారు.శనివారం ఉదయం డబ్లిన్ విమానాశ్రయంలో డొనాల్డ్ ట్రంప్‌కు ఐర్లాండ్ ఉప ప్రధానమంత్రి సైమస్‌హారిస్,విదేశాంగమంత్రి హెలెన్ మెక్ స్వాగతం పలికారు. ఏకీకృత ఐర్లాండ్ గురించి తొలుత విలేకరులు ట్రంప్‌ను ప్రశ్నించగా ఐర్లాండ్‌కు తాను ఎలాంటి హానీ తలపెట్టదలచుకోలేదన్నారు.ఐర్లాండ్ ఎప్పటికైనా ఏకీకృతమవుతుందని, దీని ఏకీకృతం చేయడానికి ప్రస్తుత ప్రధానమంత్రి సరైన నాయకుడని ప్రశంసించారు. ఈ విషయంలో బ్రిటన్‌కు కూడా ఏదో ఒక అభిప్రాయం ఉండే ఉంటుందని అంటూ, ''ఐర్లాండ్ ఏకీకృతం కావడం ఏ విధంగా చెడ్డవిషయం?''అని ప్రశ్నించారు. బ్రిటన్‌తో తమకున్న విభేదాలమధ్య ఐర్లాండ్ ఒక పావు కాబోదని ఆయన అన్నారు. ఉత్తర అట్లాంటిక్‌లో ఉన్న, యూరప్ ఖండంలోని మూడవ అతిపెద్ద ద్వీపం ఐర్లాండ్. ఈ పర్యటనలో ముందుగా ట్రంప్ ఐరిష్ అధ్యక్షుడు క్యాథరిన్ కొన్నోలీని మర్యాదపూర్వకంగా కలిశారు.ట్రంప్ పర్యటన సందర్భంగా రాజధాని డబ్లిన్‌లో వందలమంది ప్రజలు నిరసన ప్రదర్శనకు సిద్ధపడ్డారు. డెమొక్రటిక్ యూనియన్ పార్టీ నాయకుడు గావిన్ రాబిన్‌సన్ మాట్లాడుతూ, ఉత్తర ఐర్లాండ్ రాజ్యాంగ భవిష్యత్తును అక్కడి ప్రజలే నిర్ణయిస్తారని, వాషింగ్టన్,డబ్లిన్,లండన్ నుండి వ్యాఖ్యలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఐర్లాండ్ భవిష్యత్తును నిర్ణయించలేవన్నారు. ఎన్నికలు ఎంత ముఖ్యమో చాలామంది కంటే ట్రంప్‌కు బాగా తెలుసునన్నారు.ఉత్తర ఐర్లాండ్ బ్రిటన్‌లో ఒక భాగంగా ఉండటమనేది అక్కడి ప్రజల నిర్ణయమని అన్నారు.

## రష్యాపై ఆంక్షలు ఆమోదిస్తే
# భారత్‌కు కష్టకాలం

**ఇప్పటికే భారీగా పెరిగిన చమురు బిల్లు**
**రేపు అమెరికా ప్రతినిధుల సభలో ఓటింగ్**

**వాషింగ్టన్:** రష్యాకు వ్యతిరేకంగా అమెరికా కాంగ్రెస్‌లో ప్రతిపాదించిన ఆంక్షల బిల్లుపై సోమవారం(సెప్టెంబరు 14) ఓటింగ్ జరుగుతుంది. ప్రతినిధుల సభలో ఈ బిల్లు ఆమోదం పొందితే రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్న ప్రధాన దేశాలలో ఒకటైన భారత్‌పై తీవ్రమైన సుంకాల భారం పడే అవకాశాలున్నాయి.ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్రస్థాయిలో విస్తృతమవుతున్న దశలో భారత్‌పై తీవ్రంగా పెరుగుతున్న దిగుమతి ఖర్చుల భారం మరింత పెనుభారం అవుతుంది.భారత్,చైనా సహా రష్యాకు చెందిన ఇతర వాణిజ్య భాగస్వామ్య దేశాలపై తీవ్రమైన సుంకాల భారాలు విధించాలని కోరుతూ ఈ బిల్లును అమెరికా కాంగ్రెస్‌లో ప్రతిపాదించారు.గతనెలలో ప్రతిపక్ష డెమొక్రాట్ల తీవ్ర వ్యతిరేకత మధ్య సెనేట్‌లో ఆమోదం పొందిన బిల్లును ''లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'' అనే పేరుతో ప్రతిపాదించారు. సోమవారం హౌస్ రూల్స్ కమిటీ ఓటింగ్ చేపట్టనున్నది.ఈ బిల్లు ప్రతినిధుల సభ ఆమోదం పొందితే, రష్యాతోపాటు ఆ దేశం నుండి గ్యాస్,చమురు కొనుగోలు చేసే దేశాలపై కఠినమైన ఆంక్షలు విధించడానికి, ఆ దేశాలపై తీవ్రస్థాయిలో సుంకాల భారాలు మోపేందుకు ఇరాన్‌పై ఇప్పటికే ఉన్న ఆంక్షలను మరికొంత కాలం పొడిగించేందుకు ట్రంప్‌కు విశేష అధికారాలు లభిస్తాయి. మైనార్టీ నాయకుడు హకీమ్ జెఫ్రీస్‌తోసహా కాంగ్రెస్‌లో అనేకమంది డెమొక్రాట్లు ఇప్పటికీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.ఈ బిల్లు ఆమోదం పొందితే ట్రంప్‌కు అత్యంత ప్రమాదకరమైన అధికారాలు లభిస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.''ఉక్రేన్‌కు మద్దతు ఇచ్చే విషయంలో సభలో డెమొక్రాట్లు నిబద్ధతతో ఉన్నారు, కానీ లిండ్సే ఓ గ్రాహం బిల్లు మంచి కంటే ఎక్కువగా హాని కలిగిస్తుంది'' అని కాంగ్రెస్‌లో డెమొక్రటిక్‌పార్టీ సభ్యులు గ్రెగొరీ మీక్స్,డాన్ బేయర్,రిచర్డ్ మీల్ చెప్పారు.ఈ బిల్లు దేశాధ్యక్షుడి అధికారాలను నాటకీయస్థాయిలో విస్తరిస్తుంది, అదే సమయంలో ఈ బిల్లు వల్ల ఆంక్షలను అమెరికా అనివార్యం చేయలేదు,రెండూ ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు, దీనివల్ల దేశంలో ధరలు పెరుగుతాయి, ఉక్రేన్‌కు మద్దతు బలహీనపడుతుంది అని డెమొక్రాట్స్ అన్నారు.

# ద్వైపాక్షిక సంబంధాల్లో స్థిరమైన దీర్ఘకాలిక దృక్పథం

- మోదీతో ముఖాముఖీ సంభాషణలో జిన్‌పింగ్ ఉద్ఘాటన
- విభేదాల నియంత్రణతోపాటే సహకార పటిష్టతకు కృషి
- ఆమోదయోగ్యమైన పరిష్కారానికి నాయకులిద్దరి నిబద్ధత

**న్యూఢిల్లీ:** భారతదేశంతో అనుసరించే ద్వైపాక్షిక సంబంధాలను చైనా ఎల్లప్పుడూ స్థిరమైన దీర్ఘకాలిక దృక్పథంతోనే చూస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. బ్రిక్స్ 18వ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ విడిగా ముఖాముఖీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.శనివారం సాయంత్రం జరిగిన ఈ సమావేశం ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు.ఇరు దేశాల నాయకులు ఇదే విషయాన్ని పునరుద్ఘాటించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలియజేసింది.వాణిజ్యం సహా అనేక సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన,నిష్పక్షపాతమైన,న్యాయబద్ధమైన పరిష్కారాలు సాధించాలని మోదీ–జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. సమగ్ర దైపాక్షిక సంబంధాల రాజకీయ దృక్కోణాన్ని, ఇరు దేశాల ప్రయోజాలను దృష్టిలోపెట్టుకుని నిష్పాక్షిక,సహేతుక పరిష్కారాలు సాధించాలని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు.ప్రాంతీయ,ప్రపంచ సమస్యలు,సవాళ్ళను ఎదుర్కోవడంలో ఇరువురు నాయకులకు ఉన్న అవగాహనను మరింతగా విస్తరించుకోవాలని అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలపై ఉన్న ఒప్పందాలను అర్థం చేసుకుని పాటించాల్సిన అవసరం ఉందన్నారు.ఇరు దేశాలూ వాణిజ్యలోటు తగ్గించుకోవడం,ఉగ్రవాద సవాళ్ళు ప్రతిఘటించడం,అనేక దేశాలతో వేదికలు పంచుకునే సమయాల్లో వాణిజ్యంపై నిష్పాక్షిక నిర్ధారణలకు రావడం వంటి అనేక అంశాలపై ఇరువురూ చర్చించారు.పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆసియాలో అగ్రదేశాలైన చైనా–భారత్ ఎక్కువ భారాలను మోయాల్సి వస్తున్నందువల్ల సమ్మిళిత ఆర్థిక భవిష్యత్తుకోసం చేతులు కలపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.మానవాళి భవిష్యత్తును,ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలని,సహకార ప్రోత్సాహానికి ముందుకు వెళ్ళాలని భావించారు.సంబంధాలు స్థిరంగా,నిర్మాణాత్మకంగా కొనసాగుతాయని,ఈ విధానానికే ప్రాధాన్యత ఇస్తామని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఒకవైపు విభేదాలను నియంత్రిస్తూనే,మరోవైపు సంభాషణలను,సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు ఇరు దేశాలు కృషి చేస్తాయన్న విషయాన్ని ఆయన ప్రకటన ప్రతిబింబిస్తోందని ప్రముఖ ఆంగ్ల పత్రిక పేర్కొంది.తక్షణ ఉద్రిక్తతలకు అతీతంగా భారతదేశంతో దీర్ఘకాలిక ద్వైపాక్షిక సంబంధాలను చైనా కోరుకుంటున్నదని చైనా అధ్యక్షుడి మాటలు స్పష్టం చేస్తున్నాయి. అంటే తాత్కాలిక ఉద్రిక్తలను నియంత్రించేందుకు,పరిష్కరించేందుకు, సంయమనం పాటించేందుకు చర్చలు జరుగుతూ ఉంటాయి.కాగా ఇరు దేశాలమధ్యా ముఖ్యమైన సవాళ్ళు ఇంకా మిగిలే ఉన్నాయి.సరిహద్దు సమస్య చాలా సున్నితమైన విషయంగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే అనేక విడతల చర్యలు జరిగాయి. మరిన్ని చర్చలకు ఇరు దేశాలు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆసక్తి ఉన్న అంశాలపై ఇరు దేశాల నిరంతర సంప్రదింపులను జిన్‌పింగ్ ఉద్ఘాటించారు.

బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇచ్చిన సందర్భంగా జరిగిన ఈ సమావేశం అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకుంది.ఒకవైపు సుదీర్ఘమైన సరిహద్దురేఖ వెంట అనేకచోట్ల సమస్యల పరిష్కారానికి ఎడతెగని చర్చలు,మరోవైపు అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు గ్రామాల్లో చొరబాట్ల వివాదం తరుణంలో జిన్‌పింగ్ మాటలకు అధిక ప్రాధాన్యత వచ్చింది. రెండు దేశాలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలుగా రోజురోజుకూ రూపాంతరం చెందుతున్నాయి.ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడితే బ్రహ్మాండమైన సహకారాన్ని దారితీస్తుంది,విస్తారమైన ఈ ప్రాంతంలో స్థిరత్వానికి,అభివృద్ధికి దోహదం చేస్తుంది.లఢఖ్‌లో ఏడు సంవత్సరాలక్రితం ఘర్షణలు చెలరేగి ఇరువైపులా డజన్లమంది మరణించిన తర్వాత సంబంధాల స్థిరీకరణకు రెండు వైపులా ఇటీవలికాలంలో ముమ్మరకృషి జరుగుతోంది. ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా వెళ్ళి అక్కడి విదేశాంగమంత్రి వాంగ్ యీతో 25వ విడత సంభాషణలు చేసిన తర్వాత జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారైంది.న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరయ్యారు. 2014 నుండీ ఇప్పటి వరకూ 21 సార్లు తాను ప్రధానమంత్రి మోదీని వివిధ సందర్భాలలో,వివిధ సదస్సులు,సమావేశాలలో కలుసుకున్నానని జిన్‌పింగ్ ప్రకటించారు.వచ్చే ఏడాది బ్రిక్స్ వేదికకు చైనా అధ్యక్ష బాధ్యతలు వహిస్తుంది. 19వ బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్నది.మరో రెండేళ్ళలో మూడు సువర్ణాధ్యాయాలను బ్రిక్స్ పూర్తిచేసుకుంటుంది. జి–7 కంటే ఎంతో విస్తారమైన,బలమైన ఆర్థిక వేదికగా అవతరించింది. అనేక దేశాలు గడచిన రెండు సంవత్సరాలుగా బ్రిక్స్ సభ్యత్వం తీసుకున్నాయి.ప్రపంచదేశాల స్థూలజాతీయోత్పత్తిలో 40 శాతానికి బ్రిక్స్ కూటమి దేశాలే ప్రాతినిధ్యం వహిస్తున్నాయని ముందురోజే రష్యా అధ్యక్షుడు పుతిన్ వాస్తవావిష్కరణ చేశారు.

**సరిహద్దుల్లో శాంతి–సామరస్యం ముఖ్యం**
**ముఖాముఖీలో స్పష్టం చేసిన మోదీ**

భారత్–చైనా దేశాలమధ్యా సంబంధాలకు సరిహద్దుల్లో శాంతి–సామరస్యం–ప్రశాంతత ఎంతో అత్యవసరమైనవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా మోదీ మాట్లాడుతూ,ఇరు దేశాల సంబంధాలలో పరస్పర గౌరవం,పరస్పర ప్రయోజనం,సున్నితత్వం వంటి అంశాలపై ఇరు దేశాల సంబంధాలు కొనసాగాలని తెలియజేశారు.

## జరిమానాలే
**(మొదటి పేజీ తరువాయి)**

సులభతర వాణిజ్య విధానాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. సుమారు 4 వందలకు పైగా అంశాలను నేర పూరిత పరిధి నుంచి తొలగిస్తున్నామన్నారు.

**న్యాయవ్యవస్థపై భారం తగ్గించాలి : బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**

కోర్టుల్లో లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉండటం పట్ల బిజెపి సభ్యులు పాయల్ శంకర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి చిన్న విషయానికి వేల సంఖ్యలో కేసులు నమోదు కావడం వల్ల న్యాయవ్యవస్థపై విపరీతమైన భారం పెరుగుతోందని, కేసుల విచారణకు గంటలు, రోజుల తరబడి సమయం పడుతుండటంతో వాయిదాల పరంపర కొనసాగుతోందన్నారు. చాలా సందర్భాలలో సబ్ జ్యుడిషియల్ అంశాల పేరుతో అధికారులు జోక్యం చేసుకోకుండా బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారని విమర్శించారు. పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖల పనితీరును కేవలం నమోదైన కేసుల సంఖ్యతో మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదని, అధిక కేసులు నమోదు కావడం మంచి పరిపాలనా వాతావరణానికి సూచిక కాదన్నారు. గ్రామం నుంచి రాజధాని వరకు సమగ్ర అభివృద్ధి జరిగినప్పుడే తెలంగాణ పురోగతి సాధ్యమవుతుందన్నారు.

**'ప్రజా విశ్వాసం' బిల్లుకు మద్దతు తెలిపిన పాల్వాయి హరీష్ బాబు**

డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు చిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేసి జైలు శిక్షలను కేవలం జరిమానాలుగా మార్చడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఫారెస్ట్, ఎక్సైజ్, ఫారెస్ట్ ప్రొడ్యూస్, ఫ్యాక్టరీస్,ఎస్టాబ్లిష్‌మెంట్, లేబర్ వెల్ఫేర్ ఫండ్ వ్యాట్, టిఎస్ఐపాస్ వంటి పలు కీలక చట్టాల్లో సవరణలు తీసుకురావడం మంచి నిర్ణయమన్నారు. అటవీ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను హరీశ్ బాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ కారిడార్‌లో సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాల వల్ల పులుల సంచారానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే గన్నారం గ్రామానికి చెందిన ఓ మహిళ పులి దాడిలో ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన జరిగిందన్నారు. భూములకు సంబంధించి ఫారెస్ట్ లేదా రెవెన్యూ భూమి అనే స్పష్టత లేకుండానే అధికారులు రైతుల ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో తసర్ సిల్క్ ఉత్పత్తి కోసం నల్లమద్ది చెట్లపై పురుగుల పెంపకం చేపడుతున్న రైతులను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. చెన్నూర్, సిర్పూర్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు తునికాకు, బీడి ఆకుల సేకరణకు తక్షణమే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా విశ్వాసం చట్ట సవరణలతో పాటు అటవీ శాఖ అధికారుల అత్యుత్సాహాన్ని కూడా అరికట్టాలని, ప్రజలు, రైతులు, గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని హరీశ్ బాబు కోరారు.

## ప్రత్యేక అధికారులు (మొదటి పేజీ తరువాయి)

ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపి వేం నరేందర్ రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జిహెచ్ఎంసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి), హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని సిఎం చెప్పారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని సిఎం కోరారు. ఈ ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్వాహకులకు సిఎం స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని చెప్పారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి తానే సమీక్ష నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో ఆ వివరాలను నిర్వాహకులు స్థానిక కమిషనరేట్‌కు అందించాలని సిఎం సూచించారు. అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అనుకోని పరిణామాలు జరిగినప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు నిర్వాహకులు అందించే సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

## శాసనమండలిలో ప్రజా విశ్వాసం బిల్లు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు' కు శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది. అంతకుముందు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సభలో బిల్లును ప్రవేశపెట్టి బిల్లు ఉద్దేశాలు, ఉపయోగాలను వివరించారు. తెలంగాణ కార్మిక సంక్షేమ నిధి చట్టం గురించి మంత్రి సంపూర్ణంగా వివరించాలని సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం కోరడంతో శ్రీధర్‌బాబు వివరించారు. కాలనుగుణంగా చట్టాలను మార్చడం మంచిదేనని శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండప్రకాష్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లుపై పెద్దగా చర్చజరగకుండానే ఎకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు.

## విద్యార్థులు మృతి (మొదటి పేజీ తరువాయి)

మిగతా ఇద్దరు విద్యార్థులు కాలువలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కాలువలో గాలింపు చర్యలు చేపటారు. ఈనేపథ్యంలో ఇద్దరు మృతదేహాలను వెలికితీశారు. ఘటనపై మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బ్రిక్స్ దేశాలు ఆందోళన
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రవేశించిన తరుణంలో ఈ కీలక తీర్మానం చేసింది. న్యూఢిల్లీ భారత్ మండపంలో శనివారం మొదటిరోజు సదస్సులో ప్రపంచ నాయకుల సమక్షంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏకాభిప్రాయ తీర్మాన పత్రాన్ని ప్రకటించారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్,రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్,ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,అబుధాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌సహా ఇతర అగ్రనాయకుల సమక్షంలో మోదీ బ్రిక్స్ తీర్మాన పత్రాన్ని ప్రకటించారు.తీర్మానంలో ఉన్న చివరి అంశం వరకూ ఈ చర్చలు జరిగాయి.అడ్డగోలు వాణిజ్య విధానాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) నిబంధనలకు విరుద్ధంగా పెరుగుతున్న ఏకపక్ష సుంకాలపై కూడా సదస్సు తీర్మానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సుంకాలు, టారిఫేతర చర్యలను విచక్షణారహితంగా పెంచుతున్నారని, పర్యావరణం ముసుగులో, రక్షణవాదం ముసుగులో సుంకాలను అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా పెంచడాన్ని తీర్మానంలో సభ్యదేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. డబ్ల్యుటివో నిబంధనలకు వ్యతిరేకంగా వాణిజ్యాన్ని సుంకాలతో పరిమితం చేయడంపట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదంపట్ల జీరో టోలరెన్స్ (ఎంతమాత్రం సహించకూడదు) పాటించాలని తీర్మానం పేర్కొంది.ఈ ముప్పు ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు విడనాడాలని పిలుపు ఇచ్చింది.గాజాలో అదేపనిగా, నిరంతరం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ హింసాకాండ కొనసాగడంపై తీర్మానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్–పాలస్తీనా హమాస్ మధ్య శాంతి ఒప్పందం జరిగింది. అప్పటినుండీ ఉల్లంఘనలు ఆగకుండా కొనసాగుతున్నాయని విమర్శించింది. గాజా స్ట్రిప్ నుండి పాలస్తీనియన్లను తరిమికొట్టి వారిని స్థానభ్రంశం చేసే చర్యలు నిలిపివేయాలని,పాలస్తీనా ప్రజల అభేద్యమైన హక్కులకు భంగం కలిగించే ఆక్రమణలను చట్టబద్ధంచేసే చర్యలను విధానాలను, ఏర్పాట్లను నిలిపివేయాలని తీర్మానం పిలుపు ఇచ్చింది.''పశ్చిమాసియాలో విరామం లేకుండా విస్తరిస్తున్న ఉద్రిక్తలపై మేం ప్రగాఢమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నాం, మా దేశాల వైఖరులను మేం మననం చేసుకుంటూ ఈ యుద్ధంపై గరిష్ఠ సంయమనం పాటించాలని కోరుతున్నాం, యుద్ధ పరిస్థితులు తీవ్రతరం కాకుండా దూరంగా ఉండాలని బ్రిక్స్ సభ్యదేశాలుగా పిలుపు ఇస్తున్నాం'' అని ప్రకటన పేర్కొంది.''అమెరికా దాడులు చేసింది'' అనే ప్రత్యక్ష ప్రస్తావన లేకుండా పశ్చిమాసియా యుద్ధంపై ఏకాభిప్రాయ తీర్మానం చేయడం భారతదేశ దౌత్యవిజయంగా మీడియా ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలకు లోబడి సంభాషణల ద్వారా,దౌత్య మార్గాల ద్వారా యుద్ధం ముగించాలని భారత్ ఉద్ఘాటించిన వైఖరికి హాజరైన సభ్యదేశాల నాయకులు కట్టుబడి ఉన్నట్లు కనిపించిందని పిటిఐ వార్తాసంస్థ వ్యాఖ్యానించింది.అదేవిధంగా ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలకు కూడా బ్రిక్స్ సదస్సు ఏకగ్రీవ తీర్మానపత్రం పిలుపు ఇచ్చింది.ఆఫ్రికా,ఆసియా,లాటిన్ అమెరికా,కరీబియన్ ప్రాంతాలలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సమితిలో,భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావాలని తీర్మానపత్రం ప్రత్యేకంగా కోరింది. బహుళ పక్షాలతో నిర్మాణాత్మకస్థాయిలో భద్రతామండలిలో సమతుల్యంతో కూడిన ప్రాతినిధ్యం,నవీనీకరణకు పిలుపు ఇచ్చింది.ఉగ్రవాదాన్ని తీర్మాన పత్రం తీవ్రంగా ఖండించింది. భద్రతామండలిలో కీలక పాత్ర పోషించాలని అభిలషిస్తున్న భారత్,బ్రెజిల్ దేశాలకు సమితి శాశ్వతసభ్యదేశాలైన చైనా–రష్యా తమ మద్దతును పునరుద్ఘాటించాయని పేర్కొంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ప్రపంచ దేశాల బాధ్యత అనీ,ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచ చట్టాల ప్రకారం చేసే ప్రయత్నాలకు అనుగుణంగా బాధ్యతలను దేశాలు నెరవేర్చాలని తీర్మానం పేర్కొంది. జాతి,మత,సమూహాలతో ముడిపెట్టకుండా, వాటితో సబంధం లేకుండా ఉగ్రవాదానికి బాధ్యులైనవారిని చట్టం ముందు నిలబెట్టాలని,ఉగ్రవాదంలో పాల్గొన్నవారినీ, వారికి మద్దతు ఇచ్చినవారినీ అంతర్జాతీయ చట్టాల ముందు దోషులుగా నిలబెట్టాలని,జవాబుదారీ చేయాలని పునరుద్ఘాటిస్తున్నట్లు మోదీ ఆ తీర్మాన పత్రాంశాలను చదవి సభకు వినిపించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం దేశాల ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ 2025 ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీరులో ఉగ్రవాదులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తీర్మానం పేర్కొంది. ఈ దాడిలో ఆనాడు 26 మంది మరణించారని తీర్మానం తెలియజేసింది.బ్రిక్స్ వేదిక ఎల్లప్పుడూ ఏకాభిప్రాయంతోనే ముందుకు వెళుతుంది.బ్రిక్స్ నియమావళి ప్రకారం ఏ ఒక్కరు వ్యతిరేకించినాగానీ తుది తీర్మానం స్తంభించిపోయినట్లే అవుతుంది. ఈ దశలో భిన్న వైఖరులను సమర్థించే సభ్యదేశాల మధ్య మోదీ ప్రకటించిన తీర్మాన పత్రాన్ని విధానపరంగా సభ్యదేశాలన్నీ ఆమోదించినట్లే. దీనిని భారతదేశ దౌత్యవిజయంగా అభివర్ణించారు.




## శుభపరిణామం
**(మొదటి పేజీ తరువాయి)**

అవినీతి కూడా అదే స్థాయిలో ఉండేదని, కాలక్రమేనా వాటిని సరళీకరించుకుంటూ రావడంతో అవినీతి తగ్గడమే కాకుండా త్వరితిగతన అనుమతులు రావడం తద్వారా వ్యాపార రంగం అభివృద్ధి చెంది దేశం ప్రపంచస్థాయిలో పోటీపడే స్థాయికి చేరుకుందని తెలిపారు. ఈ బిల్లుకు సిపిఐ పూర్తిగా మద్దతు తెలుపుతోందన్నారు. తెలంగాణ అటవీ చట్టం కింద చిన్నచిన్న తప్పులకు కూడా జైలు శిక్షలు, పిడి యాక్ట్ ప్రయోగం వంటి చర్యలు తీసుకోవడం సరికావన్నారు. భూమి కోసం, పేదల హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు పెట్టకుండా సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించాలని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. వన్యప్రాణుల దాడులను నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్సైజ్ చట్టం కింద సైతం పెద్ద నేరస్తుల కంటే చిన్న గుడుంబా తయారీదారులనే జైలుకు పంపుతున్నారని విమర్శించారు. గంజాయి కేసుల్లోనూ అక్రమంగా కేసులు బనాయించే ఆరోపణలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్మిక సంక్షేమం, ఫ్యాక్టరీలు, సంస్థల చట్టాల్లోనూ చిన్న ఉల్లంఘనలకు జైలు శిక్షలకు బదులు జరిమానాలు విధించాలని సాంబశివరావు సూచించారు. కార్మికులకు వేతనాలు అందని సందర్భాల్లో యజమానులను జైలుకు పంపడం కాకుండా లేబర్ శాఖ జోక్యంతో బకాయిలు ఇప్పించాలని కోరుతూ చట్టంలో పేర్కొన్న 30 రకాల నేరాలకు సంబంధించిన శిక్షలు, కేసుల వివరాలను ప్రభుత్వం సభ్యులకు సమగ్రంగా అందించాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## భూములు తగ్గాయ్
**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్న భూముల సంఖ్య తగ్గిందే తప్ప పెరగలేదని మంత్రి స్పష్టం చేశారు.

**22ఎ కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నది అవాస్తం**

భూములను 22ఎ లో పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపివేసారనే ఆరోపణలలో వాస్తవంలేదని, భూముల రిజిస్ట్రేషన్ జరిగిన తేదీలను మంత్రి చదివి వినిపించారు. అలాగే, గత ప్రభుత్వంలో 22ఎ లో భూమికి జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, డిటిసిపి లేఔట్‌లకు ఇచ్చిన అనుమతులకు సంబంధించి రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఉదాహరణలు ఇచ్చారు. 22ఎ వల్ల గడిచిన 3 నెలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందనే ప్రచారానికి గత ఏడాది కంటే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.1,359 కోట్లు పెరిగిందని నెలల వారీగా పెరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను మంత్రి సభ ముందుంచారు. ధరణి వచ్చిన తరువాత తయారు చేసిన 22ఎ జాబితానే హై కోర్ట్ ఆదేశాల మేరకు డిసెంబర్ 3, 2025న ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసే సమయంలో పొరపాటు చోటుచేసుకుందని, దానిని సరిదిద్దడం జరిగిందని చెప్పారు. ఉమ్మడి ఎపి రాష్ట్రం నుంచి ఉన్న 22ఎ సమస్యను పదేళ్ల అధికారంలో ఉన్నవాళ్ళు పరిష్కరించి ఉంటే ప్రస్తుతం ఈ సమస్య వచ్చి ఉండేదికాదన్నారు. దొంగే పోలీస్‌ను పట్టుకుని దొంగా... దొంగా... అని అరిచినట్టుగా బిఆర్ఎస్ నాయకుల వైఖరి ఉందని మంత్రి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22ఎ సమస్య ఉందని, వీటిలో అర్హత కలిగిన ప్రతి సమస్యను ప్రభుత్వం పూర్తిగా చట్టబద్ధంగా పరిష్కరిస్తూ వస్తోందని చెప్పారు.

**రాజీనామా చేయాల్సింది ఎవరు?**

22ఎ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అగ్రహం వ్యక్త చేశారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండగా, అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని మంత్రి ప్రశ్నించారు. రూపాయి జీతం తీసుకుని పేదల కోసం పనిచేస్తున్న తాను రాజీనామా చేయలా?, రూ.21 కోట్లు తీసుకుని అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమైన ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావు రాజీనామా చేయలా? అని హరీష్ రావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

**పొంగు అంటే బిఆర్ఎస్‌కు ఎందకంత భయం?**

''పొంగులేటి , పొంగు, పొంగు, పొంగు అని బిఆర్ఎస్ నేతలు అంటున్నారు. పొంగు అంటే బిఆర్ఎస్ నాయకులకు ఎందుకంత భయం. గృహప్రవేశం చేస్తూ పొంగించే పాలు పొంగు శుభసూచికం. అదే అటు గోదావరి, ఇటు కృష్ణా నదులు ఉగ్ర రూపం దాల్చినప్పుడు పొంగితే బిఆర్ఎస్ నేతలే కాదు మొత్తం ఆ పార్టీ కొట్టుకుపోతుంది. అదేనా బిఆర్ఎస్ మీ భయం?'' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బిజెపి నేతల నాటకాలు పనిచేయవని, వచ్చే ఎన్నికల్లోనూ కొలువు దీరేది ఇందిరమ్మ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు. 'అధికారంలో ఉంటే అవినీతి చేస్తావు. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్ మెయిల్ చేస్తావు. ఈ తాటాకు చప్పుళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదు' అని మంత్రి స్పష్టం చేశారు. కెసిఆర్ భూమి మీద పొర్లాడినా మరోసారి ముఖ్యమంత్రి కాలేరని, ఆనాడు ఖమ్మం సభలో నేను చెప్పినట్లుగానే వచ్చే ఎన్నికల్లో కూడా ఈ సభలో కూర్చునది కూడా ఇందిరమ్మ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు.

**భూమికి ... మనిషికి వీడదీయరాని బంధం**

'రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ కు సంబంధించిన సమస్యల'పై జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ భూమికి మనిషికి విడదీయరాని అనుబంధం ఉంటుందని, కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి భూ దోపిడీకి తెర లేపిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం జిహెచ్ఎంసి పరిధిలో సామాజిక బాధ్యత పేరుతో 51 చెరువులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించారని, వాటి వివరాలను వెలికితీయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు అనురుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పరిరక్షించబడాలంటే 22ఎ ఉండాల్సిందేనన్నారు. గత ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ భూములను ఎలా కాజేశారో వివరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే ఇప్పటికే ఇలాంటి భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## వాంఖడేలో సచిన్, రహానే పేర్లతో లాంజ్‌లు



భారత మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, అజింక్యా రహానే లకు మరో గౌరవం దక్కనుంది. దిగ్గజ ఆటగాళ్లుగా కితాబులందుకున్న వీరి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ముంబై క్రికెట్ సంఘం నిర్ణయించింది. టీమిండియాకు, ముంబై క్రికెట్‌కు విశేష సేవలందించినందున విశ్రాంతి గదులకు సచిన్, రహానే పేర్లను ఎంసిఎ ఖరారు చేసింది. వీరితో పాటు దివంగత మాధవ్ మంత్రి పేరుతో నూ లాంజ్ ఉంటుందని శుక్రవారం ఎంసిఎ తెలిపింది.ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి ముంబై క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన వార్షిక సమావేశంలో మాజీ క్రికెటర్ల పేర్లను లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ఎంసికె తీర్మానించింది. దేశవాళీలో ముంబైకి ఆడిన సచిన్ టెండూల్కర్, ఇటీవలే వీడ్కోలు పలికిన అజింక్యా రహానే.. ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత మాధవ్ మంత్రి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు పెట్టనుంది. సచిన్, రహానే, మాధవ్ పేర్లనే ఏ లాంజ్‌కు పెట్టాలి? వాటిని తీర్చిదిద్దేబాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీకి, కార్యదర్శులకు అప్పగించామని ఎంసిఎ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు. ఎంసిఎ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్ ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఉన్నారు. వార్షిక సమావేశంలోనే అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ మొత్తంగా రూ.100 కోట్లు కేటాయించాలని ఎంసిఎ నిర్ణయించింది

## ఢిల్లీ మ్యాచ్‌కు వరుణుడి అడ్డంకి!

### ఈ మ్యాచ్ రద్దయితే వైభవ్‌కు పెద్ద ఎదురుదెబ్బే



శ్రీలంకపై టెస్ట్ సిరీస్ విజయం సాధించిన అనంతరం భారత క్రికెట్ జట్టు మళ్లీ టీ20 క్రికెట్‌పై దృష్టి సారించింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆదివారం(సెప్టెంబర్ 13) తొలి పోరుకు టీమిండియా సిద్ధమైంది. అయితే ఈ తొలి మ్యాచ్‌కు వర్షం భారీ అడ్డంకిగా మారే అవకాశం కనిపిస్తుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపైనే ఉంది. విదేశీ పర్యటనల్లో ఇంగ్లాడ్, జింబాబ్వేలపై మెరుపు ఇన్నింగ్స్‌లతో కేవలం 6 టీ20 మ్యాచ్‌ల్లోనే వైభవ్ సూర్యవంశీ సంచలనం సృష్టించాడు. జింబాబ్వేపై రెండు హాఫ్ సెంచరీలతో సహా 189కి పైగా స్ట్రైక్ రేట్‌తో 193 పరుగులు సాధించి అందరినీ ఆకట్టుకున్నాడు. కానీ ఇప్పటివరకు ఇండియాలో జాతీయ జట్టు తరఫున ఆడే అవకాశం వైభవ్ సూర్యవంశీకి లభించలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో తుది జట్టులో చోటు దక్కితే.. సొంత గడ్డపై తొలిసారి జెర్సీ ధరించి సత్తా చాటాలని ఆశిస్తున్న వైభవ్ సూర్యవంశీకి ఈ మ్యాచ్ రద్దయితే పెద్ద ఎదురుదెబ్బే అవుతుంది.ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం పరిసరాల్లో వర్షం కురిసే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆక్యూవెదర్ నివేదికలు సూచిస్తున్నాయి. ఇప్పటికే శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో తేలికపాటి వర్షం కురవడంతో స్టేడియం పరిస్థితులపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఆదివారం కూడా ఆకాశం మేఘావృతమై ఉండి జల్లులతో పాటు ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.. ముఖ్యంగా మ్యాచ్ జరిగే సాయంత్రం సమయంలో వర్షం ప్రభావం మరింత ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. భారత్ వర్సెస్ ఆఫ్ఘనిస్తాన్ టీ20 రికార్డులు టీ20 క్రికెట్ చరిత్రలో భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు ఇప్పటివరకు 9 సార్లు తలపడగా.. టీమిండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 2023 ఆసియా క్రీడల సందర్భంగా వర్షం కారణంగా రద్దయిన ఓ మ్యాచ్ మినహా మిగిలిన అన్నింటిలోనూ భారత్ విజయం సాధించింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలో జరగబోయే మ్యాచ్ ద్వారా ఇండియాపై తమ రికార్డును మెరుగుపరచుకోవాలని ఆఫ్ఘనిస్తాన్ భావిస్తుండగా.. మ్యాచ్ సజావుగా సాగాలని అభిమానులు కోరుకుంటున్నారు.





### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 76,515.43 పాయింట్లు. ముగింపు 74,781.76 పాయింట్లు. నష్టం 1,733.67 పాయింట్లు.
**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 23,897.70 పాయింట్లు. ముగింపు 23,398.10 పాయింట్లు. నష్టం 499.60 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు వరుసగా ఐదో వారం కూడా నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా 'బేర్' జోరు కొనసాగింది. స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి).

## నష్టాల బాట వీడని స్టాక్ మార్కెట్లు



భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో వారంలోనూ నష్టాలను చవిచూడటం ప్రస్తుత పరిస్థితుల్లో సాధారణ సాంకేతిక దిద్దుబాటుగా మాత్రమే చూడలేం. అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల పెరుగుదల, రూపాయి బలహీనత, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా వడ్డీ రేట్లపై పెరుగుతున్న అనిశ్చితి తదితర అంశాలన్నీ కలిసి మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరుస్తున్నాయి. ఈ వారం దాదాపు అన్ని ప్రధాన రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా ఐటి, ఆర్థిక సేవలు, ఆటో, ఇంధన సంబంధిత షేర్లలో ఒత్తిడి ఎక్కువగా నమోదైంది. వచ్చే వారం మార్కెట్ దిశను నిర్ణయించే ప్రధాన అంశం పశ్చిమాసియాలోని ఉద్రిక్తతే. అమెరికా–ఇరాన్ ఘర్షణ కారణంగా బ్రెంట్ క్రూడ్ ధర 100 డాలర్లకు పైగా కొనసాగుతోంది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకుంటున్నందున అధిక చమురు ధరలు ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు, రూపాయి విలువ, కంపెనీల లాభదాయకతపై ఒత్తిడి పెంచుతాయి. అందువల్ల చమురు ధరలు తగ్గకపోతే ఈక్విటీ మార్కెట్లో బలమైన పునరుద్ధరణకు అవకాశం పరిమితంగానే ఉంటుంది. రూపాయి బలహీనత మరో ప్రతికూల అంశం. డాలర్‌తో పోలిస్తే రూపాయి ఈ వారం గణనీయంగా క్షీణించింది. చమురు దిగుమతుల ఖర్చు పెరగడం దీనిపై మరింత ఒత్తిడి తెస్తోంది. రిజర్వ్ బ్యాంక్ మార్కెట్‌లో జోక్యం చేసుకుంటున్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలించకపోతే రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చు. వచ్చే వారం అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి వడ్డీ నిర్ణయంపై మార్కెట్లలో ఇప్పటికే అనిశ్చితి పెరిగింది. అమెరికా 'బాండ్ ఈల్డ్స్' పెరగడం కొనసాగితే విదేశీ పెట్టుబడిదారులు అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది. అది భారత మార్కెట్‌పై అదనపు అమ్మకాల ఒత్తిడిని కలిగించవచ్చు. అయితే దేశీయంగా మార్కెట్‌కు కొంత రక్షణ ఉంది. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, ఆర్థిక వ్యవస్థలోని ప్రాథమిక బలాలు, పన్ను వసూళ్ల వంటి అంశాలు పతనాన్ని కొంతవరకు నియంత్రించగలవు. అందువల్ల వచ్చే వారం ఏకపక్షంగా భారీ పతనం తప్పనిసరి అని చెప్పడం సరికాదు. ప్రతికూల వార్తల మధ్య కూడా మధ్యలో బలమైన కొనుగోళ్లు రావచ్చు. మొత్తం మీద, చూస్తే వచ్చే వారం అస్థిరతతో కూడిన ప్రతికూల ధోరణి కొనసాగే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నది.కాబట్టి వచ్చే వారం పెట్టుబడిదారుల దృష్టి కంపెనీల కంటే ముందుగా చమురు, రూపాయి, అమెరికా ద్రవ్యోల్బణం, ఫెడ్ నిర్ణయం, పశ్చిమాసియా పరిణామాలపైనే ఉండే అవకాశం ఉంది.

## భారత్‌లో పెరుగుతున్న ప్యాకర్స్ అండ్ మూవర్స్ వ్యాపారం

భారత్‌లో పట్టణీకరణ వేగం పెరుగుతున్న కొద్దీ ఇళ్ల మార్పిడి, ఉద్యోగాల కోసం నగరాల మధ్య వలసలు, అద్దె ఇళ్లలో మార్పులు, వ్యాపార సంస్థల కార్యాలయాల తరలింపు వంటి అవసరాలు పెరుగుతున్నాయి. దీంతో ప్యాకర్స్ అండ్ మూవర్స్ సేవలకు డిమాండ్ క్రమంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు స్థానికంగా పరిచయాల ఆధారంగా నడిచిన ఈ రంగం ఇప్పుడు సాంకేతికత, ఆన్లైన్ బుకింగ్, డిజిటల్ చెల్లింపులు, రియల్‌టైమ్ ట్రాకింగ్ వంటి మార్పులతో కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. ఇల్లు లేదా కార్యాలయాన్ని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చడం అనేది చాలామందికి శారీరక శ్రమతో పాటు మానసిక ఒత్తిడిని కూడా కలిగిస్తుంది. సామాన్లు సురక్షితంగా ప్యాక్ అవుతాయా, రవాణాలో పాడవుతాయా, నిర్ణయించిన సమయానికి చేరుతాయా, చివర్లో అదనపు చార్జీలు వస్తాయా అనే సందేహాలు వినియోగదారులను వేధిస్తాయి. ముఖ్యంగా అసంఘటిత రంగంలో ప్రమాణాలు, బాధ్యత, ధరల్లో పారదర్శకత లేకపోవడం ఈ ఆందోళనను పెంచుతుంది. సాంకేతిక ఆధారిత సేవలు ఈ సమస్యలను కొంతవరకు తగ్గిస్తున్నాయి. వినియోగదారులు తమ సామాన్ల వివరాలను నమోదు చేసి, సేవల రకాన్ని ఎంచుకుని, ముందుగానే ధరను తెలుసుకుని బుకింగ్ చేసుకునే విధానం పెరుగుతోంది. ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, గాజు సామాన్లు వంటి సున్నితమైన వస్తువులకు ప్రత్యేక ప్యాకింగ్ అవసరాలను ముందుగానే గుర్తించడం, కదలికను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేయడం వంటి సదుపాయాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ రంగం విస్తరణ యువతకు స్వయం ఉపాధికి మంచి అవకాశాన్ని కల్పించగలదు. పెద్ద పెట్టుబడితో సంస్థను ప్రారంభించాల్సిన అవసరం లేకుండా, ఒక ప్రాంతంలో ప్యాకింగ్, లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్ సేవలను సమన్వయం చేస్తూ చిన్న స్థాయి వ్యాపారాన్ని అభివృద్ధి చేయవచ్చు. సరైన శిక్షణ, నాణ్యమైన ప్యాకింగ్ మెటీరియల్, విశ్వసనీయ రవాణా వాహనాలు, డిజిటల్ బుకింగ్ వ్యవస్థ, పారదర్శక ధరలు, వినియోగదారుల వస్తువులపై బాధ్యత వంటి అంశాలను పాటిస్తే ఈ వ్యాపారంలో స్థిరమైన అవకాశాలను సృష్టించుకోవచ్చు. యువతకు మరో అవకాశం సేవలను ప్రత్యేక విభాగాలుగా అభివృద్ధి చేయడంలో ఉంది. వృద్ధుల ఇళ్ల మార్పిడి, కార్యాలయాల తరలింపు, విద్యార్థుల సామాన్ల రవాణా, అంతర్రాష్ట్ర రవాణా వంటి ప్రత్యేక సేవలను అందించవచ్చు. ఈ అవసరాన్ని క్రమబద్ధమైన సేవగా మలచగల యువతకు ఇది ఉపాధి కల్పించే రంగంగా మరింత విస్తరించే అవకాశం ఉంది.



### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర(సుమారుగా)
24 క్యారెట్లు: రూ.1,52,890
22 క్యారెట్లు: రూ.1,40,150
18 క్యారెట్లు: రూ. 1,14,670
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ ఇంగ్లాండ్ జయభేరి





ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ ఇంగ్లాండ్ జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు డకౌటైనా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్) కీలక భాగస్వామ్యంతో పాక్ ఆశలపై నీళ్లు చల్లారు. మొహమ్మద్ అబ్బాస్(2–27) నిప్పులు చెరిగినా.. ఈ జోడీ నింపాదిగా ఆడడడంతో ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. వరసగా మూడు మ్యాచుల్లో గెలుపొందిన ఇంగ్లాండ్ 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. స్వదేశంలో ఇంగ్లాండ్ పంజా విసిరింది. మూడు టెస్టుల సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో పాకిస్థాన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలిరోజు నుంచే పట్టుబిగించిన ఇంగ్లాండ్ నాలుగో రోజే మ్యాచ్‌ను ముగించింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌ను 449 పరుగులకే కట్టడి చేసి.. అనంతరం 130 పరుగుల ఛేదనకు దిగిన ఆ జట్టు ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే ఓపెనర్లను కోల్పోయింది. పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్(2–20) ఓవర్లో తొలి బంతికి డకెట్(0) వికెట్ కీపర్ చేతికి చిక్కగా.. ఆఖరి బంతికి ఎమిలియో గే(0)ను ఎల్బీగా వెనుదిరిగాడు. అబ్బాస్ విజృంభనతో సున్నాకే రెండు వికెట్లు పడినా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వలేదు. 23 పరుగుల వద్ద బౌల్డయ్యాడు. కానీ, అది నో బాల్ కావడంతో రూట్ బతికిపోయాడు. పాక్ పేసర్లను ధీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం శతక భాగస్వామ్యం నెలకొల్పగా ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది ఇంగ్లాండ్ ఎడ్జ్‌బాస్టన్‌లో ఇప్పటివరకూ ఒక్క మ్యాచూ గెలవని పాక్ ఈసారి కూడా అదే తడబాటుతో మూల్యం చెల్లించుకుంది. ఇక బెన్ స్టోక్స్ వీడ్కోలు తర్వాత మళ్లీ కెప్టెన్సీ చేపట్టిన రూట్ తొలి సిరీస్‌ను ఒడిసిపట్టాడు. డాన్ లారెన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, ఓలీ రాబిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యారు.



మహబూబ్‌నగర్ జిల్లాలో...



చింతకాని మండలంలో...



హనుమకొండ జిల్లాలో...

# త్యాగధనుల పునాదులపై నిజాం సర్కార్‌ను గద్దె దించాం

### తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ :** అప్పంపల్లి అమరత్వం అజరామరమైనదని త్యాగధనుల పునాదులపై నిజాం సర్కార్‌ను గద్దె దించి తెలంగాణ గడ్డలో గోరి కట్టమని తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నేతృత్వంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండల పరిధిలోని అప్పంపల్లి రైతాంగ సాయుధ పోరాట కేంద్రాన్ని సందర్శించి నిజాం సర్కారులు నేలరాలిన అప్పంపల్లి అమరవీరుల స్మారక స్తూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకంగా ఆనాడు జరిగిన కమ్యూనిస్టు సాయుధ రైతాంగ పోరాటంతో తెలంగాణ ప్రాంతంలో ఐదువేల అమరవీరుల రక్తపుర్పణంతో పది లక్షల ఎకరాల భూ పంపిణీతో భారత్ యూనియన్‌లో కల్పిన త్యాగం కమ్యూనిస్టు పార్టీదని వారు అన్నారు. చారిత్రాత్మక సాయుధ పోరాట ఘట్టాలను త్యాగాలను కుట్రపూరితకంగా బిజెపి వక్రీకరిస్తూ హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ నేటి సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తుందని వారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఆ నాటి పోరాటంలో ఎందరో త్యాగాలు చేశారని వారిని స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని కేంద్రంలో అధికారం లో ఉన్న వాజపేయ్ సర్కార్‌ని అడిగితే వారిని గుర్తించకుండా మొండి చూపిందని వారి సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్నటువంటి మోదీ సర్కార్ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కుటుంబాలను గుర్తించి వారికి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, ప్రముఖ గాయని శ్యామల, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు ఎస్.దేవానంద్, భార్గవి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### సాయుధపోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు చేపట్టాలి : భాగం

**చింతకాని :** నైజాం నిరంకుశపాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధులు తాళ్ళపల్లి రాములు స్థూపం వద్ద వారోత్సవాల్ని ఆయన ప్రారంభించారు. తొలత తాళ్ల పల్లి రాములు విగ్రహానికి పూలమాల వేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి



మణుగూరులో...

జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, ఏనుగు గాంధీ, రావి శివరామకృష్ణ, పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, చిన్నమండవ సర్పంచ్ పర్చా రామచంద్రరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, వ్యకాస మండల కార్యదర్శి గోగుల ఆది, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, నాయకులు పెంట్యాల చలమయ్య, తుపాకుల సైదులు, అంజయ్య, తాళ్లపల్లి అజయ్, చేబ్రోలు ఇంద్రసేన, షేక్ దస్తగిరి, చాట్ల రమేష్, బారాస నాయకులు పాపినేని రంగారావు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య : సాబీర్ పాషా

**మణుగూరు :** సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు శనివారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ జక్కుల రాజబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, ఆ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని సాబీర్ పాషా విమర్శించారు. ముందుగా సిపిఐ జెండాను రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సర్ రెడ్డి పుల్లారెడ్డి ,మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి మాట్లాడారు. మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు వై రాంగోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, సాంబయ్య గూడెం సర్పంచ్ చీడం ఉషారాణి రామంజవరం సర్పంచ్ బాడీశ కల్పన, బాడిస సతీష్, ఎస్ కే సర్వర్, పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్, జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోరచారి, కరకగూడెం మండల కార్యదర్శి వంగర సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పోరాట యోధుల విగ్రహాలు ట్యాంక్ బండ్‌పై పెట్టాలి : భిక్షపతి

**ధర్మసాగర్ :** ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రైతన్న సాయుధ పోరాటంలో అడ్రస్ లేని బిజెపి,ఆర్ఎస్ఎస్ నాటి పోరాటాన్ని ముస్లిం, హిందువుల యుద్ధం అని చేస్తున్న అబద్ధ ప్రచారం మానుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో, కర్ణాటకలోనూ, మహారాష్ట్రలోనూ ఏ గ్రామం ఏ ప్రాంతంకు వెళ్లినా నాటి ఆనవాళ్లు ఇంకా కనిపిస్తాయని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన చరిత్రను ప్రజలకు ఇప్పటికీ గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి, మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, గోకల రాజయ్య, సాయి పేట రాజన్న,సునీల్, రత్తమ్మ, కొమురయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

### పోరాట వాస్తవాలు మరుగుపరచాలని చూస్తున్న బిజెపి : రాజారెడ్డి

**జనగామ:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను నాలుగున్నర వేల మంది అమరవీరుల బలిదానాలను తప్పుడు పద్ధతుల ద్వారా మరుగు పర్చాలని మతోన్మాద బిజెపి చూస్తుందని జనగామ మాజీ ఎమ్మెల్యే సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో కావటి యాదగిరి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 15న జనగామ జిల్లాలో తెలంగాణ రైతాంగ సాయుధ ఓరాట కొదమ సింహం తెలంగాణ టైగర్ నల్ల నర్సింహులు విగ్రహం నుండి ప్రారంభించి నాగారంలోని వీరన్నగౌడ్, కామారెడ్డి గూడెం లోని షేక్ బందగి, జాటోత్ వీరుల స్థూపాలు, పాలకుర్తిలోని చాకలి ఐలమ్మ, రఘునాథపల్లి మండలం గబ్బెటలోని గబ్బెట తిరుమల్‌రెడ్డి, గబ్బెట గోపాల్ రెడ్డి, మోహన్‌రెడ్డి స్థూపాల వద్ద సభలు నిర్వయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, కార్యవర్గ సభ్యులు సొప్పరి జోమయ్య, సదానందం,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

### కరీంనగర్ రూరల్ మండలానికి చొక్కారావు పేరు : పంజాల

**కొత్తపల్లి :** తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పేదల కోసం పోరాటాలు నిర్వహించిన చామనపల్లి చొక్కారావు పేరు కరీంనగర్ రూరల్ మండలానికి పెట్టాలని, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంతోపాటు సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చామనపల్లి చొక్కారావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, చామనపల్లి సర్పంచ్ భోగండ ఐలయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోసుల సంతోష చారి, గ్రామ శాఖ కార్యదర్శి మెరుగు కొమురయ్య, నాయకులు పెద్ది రాజు, ఇరుకుళ్ల బాబు, ఎం. రాములు, నాంపల్లి పోనాని రాజేశ్వర్ రావు, పెరుమాళ్ల శ్రీనివాస్, కాల్వల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### రైతాంగ సాయుధ పోరాటం పోరాటాలకే స్ఫూర్తి : బెజవాడ

**అనంతగిరి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పోరాటాలకే స్ఫూర్తిగా నిలిచిందని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని శాంతినగర్‌లో ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి ఎర్రసాని రవి, మండల ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి దేగ వీరన్న, శాఖ కార్యదర్శి బత్తిని వీరబాబు, గ్రామ సర్పంచ్ వాడకొప్పుల ఉమా, ఉప సర్పంచ్ గరిడేపల్లి స్వాతి, వ్యకాస జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించం : లక్ష్మణ్

**కోటపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర అణువంత కూడా లేదని, చరిత్రను వక్రీకరించి తమ ఖాతాలో వేసుకోవాలని బిజెపి చూస్తే ప్రజలు తిప్పికొడతారని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, దాగం మల్లేష్, రేగుంట చంద్రశేఖర్ హెచ్చరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతాల్లో వారు మాట్లాడారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే చలో హైదరాబాద్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అందే పురుషోత్తం, నాయకులు నెన్నెల సమ్మయ్య, బడికెల మధునయ్య, దేనబోయిన బాపు, వెంకటేష్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లాలో...



కరీంనగర్ జిల్లాలో...



సూర్యాపేట జిల్లాలో...



మంచిర్యాల జిల్లాలో...



## బిసిల కులగణన చేపట్టకపోతే బిజెపిని గద్దె దించేందుకు బిసిలు ఐక్యం

దూళిపాళ ధనుంజయనాయుడు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో చేపడుతున్న జనగణనలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బిసి కుల గణన కూడా తప్పని సరిగా చేర్చాలని అందుకు బిజేపి సిద్ధపడకపోతే బిజేపిని గద్దె దించేందుకు రాజకీయాలకు అతీతంగా బిసిలు ఐక్యమై బిజేపిని గద్దె దించేందుకు సిద్ధపడాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బిసి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖచ్చితమైన జనాభా లెక్కలు తేలితేనే బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో దామాషా ప్రకారం న్యాయం జరుగుతుందని , కులగణన లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర జనాభాలో బిసిలు 56 శాతం ఉన్నారని తేలిందని అసెంబ్లీలో తీర్మానం చేసిన విధంగా బిసిలకు స్థానిక సంస్థల్లో 422శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎఐటియుసి నాయకులు జడ శ్రీనివాస్, బిసి హక్కుల సాధన సమితి నాయకులు కొమ్రరాజు వెంకట్, జక్కుల రమేష్, జక్కుల రమణ పాల్గొన్నారు.

## ఆభరణాలు దొంగిలించే ముఠా అరెస్టు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** బస్టాండ్‌లలో బస్సులు ఎక్కే ప్రయాణికుల నుండి బంగారు ఆభరణాలను దొంగలించే అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు పంపినట్లు దేవరకొండ డిఎస్పి ఎం.వి శ్రీనివాసరావు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం మార్చి నుండి జూలై వరకు జరిగిన మూడు నేరాలలో దొంగలించిన 5 తులాల బంగారు ఆభరణాలను ఈ అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులైన తిరపతమ్మ, కేశవ, జ్యోతిల వద్ద నుండి రికవరీ చేసి ఒక బజాజ్ ఆటో, ఒక హోండో డిలక్స్ మోటార్ సైకిల్‌ను సిజ్ చేసినట్లు తెలిపారు. దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది కరుణాకర్, హెచ్ కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుల్ హేమునాయక్, భాస్కర్, రాంబాబు, శేఖర్, మహిళా కానిస్టేబుల్ నాగసంధ్యలను డిఎస్పి అభినందించారు.

## అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల భిక్షాటన



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన నాగార్జునసాగర్‌లో విదేశీ బౌద్ధ భిక్షువుల బృందం శనివారం సంప్రదాయ బద్ధంగా పిండపాత (భిక్షాట) కార్యక్రమాన్ని నిర్వహించింది. థాయిలాండ్, కంబోడియా దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు వర్షావాస కార్యక్రమంలో భాగంగా నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో భిక్షాటన చేపట్టారు. బౌద్ధ సంప్రదాయంలో భాగమైన పిండపాత కార్యక్రమాన్ని విదేశీ భిక్షువులు తమ దినచర్యలో భాగంగా నిర్వహించారు.ఈసందర్భంగా భిక్షువులు వీధుల గుండా వెళ్తుండగా స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వచ్ఛందంగా తమకు తోచిన ఆహార పదార్థాలను దానం చేశారు.అంతేకాకుండా పలువురు స్థానికులు బౌద్ధ భిక్షువులను తమ నివాసాలకు స్వయంగా ఆహ్వానించి ఆహార పదార్థాలను స్వీకరించాలని కోరడం విశేషంగా నిలిచింది.ఈకార్యక్రమం స్థానికుల్లో బౌద్ధ సంప్రదాయాల పట్ల ఆసక్తిని,భక్తిభావాన్ని పెంపొందించింది.ఈ పిండపాత కార్యక్రమంలో బుద్ధవనం సిబ్బంది కూడా పాల్గొని విదేశీ బౌద్ధ భిక్షువులకు సహకరించారు.

## పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలనే వాడాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అని సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్డులో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెవిఆర్ ఈ మొబిలిటి ఎలక్ట్రికల్ బైక్ షోరూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెట్రోల్, డిజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్, నిర్వహణ తక్కువ ఖర్చు ఉండటంతో వాహనదారులు ఎలక్ట్రికల్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. ప్రపంచానికి పర్యావరణ కాలుష్యం ముప్పుగా మారిన నేపథ్యంలో విద్యుత్ వాహనాల వాడకం తప్పనిసరి అన్నారు. అనంతరం జెవిఆర్ ఈ బైక్స్ ఎండి శింగంశెట్టి నీరజ ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ తమ కంపెనీ ఎలక్ట్రిక్ బైక్స్‌ను సామాన్యులకు అందుబాటులో ఉండేలా పర్యావరణ హితమైన తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెవిఆర్, రామసాని శ్రీనివాస నాయుడు, దంతాల రాంబాబు, మాజీ ఎంపిపి లక్ష్మి రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, మౌనిక, రామకృష్ణ పాల్గొన్నారు.

## పంట వివరాలు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని రైతులందరూ డిజిటల్ క్రాప్ సర్వేలో తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ తెలిపారు.వానాకాలం సీజన్‌లో జిల్లాలోని రైతులు పత్తి,వరి,కంది,ఉద్యానవన పంటలు,వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారని తెలిపారు. దాదాపు అన్ని రకాల పంటలకు మద్దతు ధరతో పాటు వరి పంటలో ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న వడ్లను సాగు చేసిన వారికి క్వింటాల్ కు రూ.500 బోనస్ కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుత సీజన్‌లో ప్రతి సర్వే నంబర్ లో సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా గ్రామాలలో నియమించబడిన సర్వేయర్లు ప్రతి చేనుకు వెళ్లి ఫోటో తీసి నమోదు చేస్తున్నారని తెలిపారు.ఈ సర్వేలో పంట నమోదుకు ఈనెల 30 వరకు ఉంటుందన్నారు.

# త్యాగాల చరిత్ర పోరాటాలకు మార్గదర్శి

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో తెలంగాణ ప్రాంతంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నేటి తరానికి దిక్సూచి లాంటిదని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఇందిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట నాయకుల త్యాగాల చరిత్ర నేటి దోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు మార్గదర్శిగా నిలుపుకోవాలని కోరారు. నిజాం దోపిడికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం ప్రారంభమై దేశంలో రైతు కార్మికుల హక్కుల కోసం, సమానత్వం కోసం,. సాయుధ పోరాటం స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, సోమగాని సైదులు, ఇందిరాల వెంకటేశ్వర్లు, చెన్నగాని సైదులు, మామిడి వెంకయ్య, యల్లావుల ఉమా, జడ వెంకన్న, జక్కుల శ్రీనివాస్, మామిడి నర్సయ్య, జక్కుల రమేష్ పాల్గొన్నారు.

# 12,283 పెండింగ్ కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ :** లోక్ అదాలత్ కొరకు జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసి 12 వేల 283 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగిందని జిల్లా జడ్జి,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.వసంత్ తెలిపారు.శనివారం రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండలోని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.వసంత్ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ కొరకు జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈలోక్ అదాలత్ లో 33 సివిలు, 2813 క్రిమినలు, 68మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు,9281ట్రాఫిక్ చలాన్ కాసులు,77 బ్యాంకు రికవరీ కేసులు 11 సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం 12 వేల 283 పెండింగ్ ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఇందులో ప్రమాద భీమా కేసులలో రూ.7,62,44,348 నష్టపరిహారం ఇప్పించగ,బ్యాంకు రికవరీ 6217000 ట్రాఫిక్ చలాన్ 31,32,180 సైబర్ క్రైమ్ కేసులలో రూ.117262 రికవరీ డబ్బులు ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి హిమబిందు గొల్ల, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.సతీష్ కుమార్,బి.అశోక్ కుమార్, ఇతర న్యాయవాదులు,కక్షిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధనలో ప్రజలంతా భాగస్వాములవ్వాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సిటి టాలెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ మురళి అన్నారు. శనివారం సిటి టాలెంట్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుల్లెట్ సాధనకు మద్ధతుగా ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లెట్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో మాట్లాడారు. వాణిజ్యపరంగా సూర్యాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బుల్లెట్ ట్రైన్ వస్తే అభివృద్ధి మరింత జరిగే అవకాశం ఉందన్నారు. శంషాబాద్ నుండి వయా సూర్యాపేట మీదుగా చెన్నైకి బుల్లెట్ ట్రైన్ మొదటగా అలైట్‌మెంట్ ఇచ్చిన దాన్ని రద్దు చేస్తూ సూర్యాపేట ప్రజలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. సూర్యాపేట ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షైన రైల్వే మార్గం వచ్చేలా ప్రభుత్వాలు సహకరించాలన్నారు. అంతకముందు ఆమ్ ఆద్మీని పార్టీ ఆధ్వర్యంలో రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటి టాలెంట్ పూర్వ విద్యార్థులు అంతటి సాత్విక్ సాయి, సుంకరబోయిన ఉదయ్ కుమార్, వాస హర్ష, రేవంత్ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు కుంట్ల ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, సట్టు నాగయ్య, రాములు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కొర్ర కృష్ణ కాంత్ నాయక్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు బాణావత్ సైదులు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మూడ్ తిరుపతి నాయక్, వడ్త్య వెంకట్రామ్ నాయక్, కురూవా నాయక్ హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న డీఏ, పీఆర్‌సీ అమలు, సీపీఎస్ రద్దు తదితర ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ నెల 18వ తేదీ లోగా ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రకటన చేయాలని కోరారు.ఈహెచ్‌ఎస్ విషయంలో ఉపాధ్యాయుల నుంచి గత 6 నెలలుగా ప్రభుత్వం కాంట్రిబ్యూషన్ తీసుకుంటున్నప్పటికీ కార్డుల ద్వారా ఆసుపత్రుల్లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తక్షణమే ఈహెచ్‌ఎస్ కార్డులను వినియోగించుకునే విధంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్య సేవలకు అనుమతి కల్పించాలని డిమాండ్ చేసింది. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో అమలవుతున్న అడ్వకసీ విధానాన్ని రద్దు చేయాలని, పదోన్నతుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ధీరావత్ విద్యా చందర్, భాషా నాయక్, హను మ నాయక్, హరి నాయక్, నెహ్రూ నాయక్, సక్రు నాయక్, స్కైలాబ్ నాయక్, ధీరావత్ హరి, తులసి రామ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, హేమానాయక్ పాల్గొన్నారు.



## ‘నా పల్లె-గుండ్రాంపల్లి’ పాట రచయితకు ఘన సన్మానం

పోరాట చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన సాయి శశాంక్ గౌడ్ :ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను, గుండ్రాంపల్లి అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటిచెప్పేలా 'నా పల్లె గుండ్రాంపల్లి' పాటను రచించి,ఆలపించిన గాయకుడు,రచయిత గంగాపురం సాయి శశాంక్ గౌడ్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ, నెల్లికంటి సత్యం శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా గుండ్రాంపల్లిలోని స్థానిక అమరవీరుల స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో సాయి శశాంక్ గౌడ్ రూపొందించిన పాట ద్వారా గ్రామ పోరాట చరిత్ర, అమరవీరుల త్యాగాలు,నాటి పోరాట స్ఫూర్తి ప్రజల్లోకి,ముఖ్యంగా భావితరాల్లోకి చేరుతున్నాయని అభినందించారు. చరిత్రను కేవలం పుస్తకాల్లో కాకుండా పాట రూపంలో ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు,శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య,సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం,సహాయ కార్యదర్శి కేతా రాజు అంజయ్య,సీమ అంజయ్య,సీనియర్ నాయకులు జిల్లా లక్ష్మయ్య, బొబ్బిల శంకర్ రెడ్డి,బొడిగె బక్కశెట్టి,పానుగుల శివ,జిల్లా లింగస్వామి,రెడపాక రవి,రత్నం లింగస్వామి, సర్గాల అశోక్,కసర్ల శంకర్,లింగస్వామి పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ నిర్వాహకులకు అవగాహన



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు.ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని,పోలీస్ శాఖ సూచనలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు స్పష్టంగా తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలని కోరారు.శాంతిభద్రతలు,ప్రజా క్రమాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి,వన్ టౌన్ ఎస్ఐలు జి.ముత్తయ్య,జె.సైదులు, టూ టౌన్ ఎస్ఐసైదాబాబు,రూరల్ ఎస్ఐ శివ ప్రసాద్,మున్సిపల్ అధికారులు,విద్యుత్ శాఖ అధికారులు,శాంతి కమిటీ సభ్యులు,హిందూ, ముస్లిం,క్రిస్టియన్ మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆందోళన

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను కనీసం 12 గంటల పాటు నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. మండలంలోని య ర్కారం సబ్‌స్టేషన్ ఎదుట రైతాంగంతో కలిసి బిఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం సూర్యాపేట జనగాం ప్రధాన రహదారిపై బైఠాయించి తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన 12 గంటల విద్యుత్ అందించాలని బిఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు వారికి అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## తప్పని గ్యాస్ ఇబ్బందులు

చందంపేట మండలంలో పనులు మానుకొని మరీ పడిగాపులు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో గ్యాస్ వినియోగదారుల ఇబ్బందులు కొనసాగుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కోసం ఒక రోజు పనులను సైతం మానుకొని తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. మండలానికి గ్యాస్ ఎప్పుడు వస్తుందో, రాదో తెలియని పరిస్థితులలో వినియోగదారులు అయోమయంలో ఉన్నారు. చాలా కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికి సంబంధిత అధికారులు, గ్యాస్ సరఫరా సంస్థలు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లోకి వారానికి ఒక రోజు గ్యాస్ వాహనం వస్తుందనే సమాచారం తెలిసిన వెంటనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సిలిండర్ల కోసం పరుగులు పెట్టాల్సి వస్తుందని అన్నారు.

ప్రభుత్వ ధర కంటే అధిక వసూళ్లు....గ్యాస్ సిలిండర్ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, కొందరి వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ. 70 నుండి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించి అధిక ధరలను కట్టడి చేయాలని వినియోగ దారులు కోరుతున్నారు. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు మండలంలో తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. మండలానికి ప్రభుత్వం, ఆయిల్ సంస్థల ద్వారా గ్యాస్ సరఫరా అవుతున్నప్పటికి వినియోగదారులకు మాత్రం కొరత ఎందుకు ఏర్పడుతుందో అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చందంపేట మండలంలోని అన్ని గ్రామాలకు నిరంతరంగా, పారదర్శకంగా గ్యాస్ సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సిలిండర్లు ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు అధికారులను, గ్యాస్ సరఫరా దారులను కోరుతున్నారు.



# ఓటర్ల నమోదు సద్వినియోగం చేసుకోండి

అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్



**ప్రజాపక్షం/నూతనకల్/తుంగతుర్తి/అర్వపల్లి/-నాగారం/మద్దిరాల :** కొత్తగా ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు నేరుగా తమ సమీపంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులను సమర్పించవచ్చని అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్ తెలిపారు. ఈ మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో సంబంధిత బిఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. శనివారం నూతన ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు, ఓటరు నమోదు సంబంధిత దిద్దుబాట్లు, నోటీసుల సమర్పణకు సంబంధించి నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, అర్వపల్లి మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సర్ ప్రక్రియ, కొత్త ఓటు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటరు జాబితా నమోదు లేదా సవరణలకు సంబంధించి అధికారులు జారీ చేసిన నోటీసులకు ప్రతిస్పందించాలనుకునే వారు, తమ వద్ద ఉన్న సరైన ధృవీకరణ పత్రాలు తీసుకొచ్చి బిఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం ఓటరు జాబితాలో పేరు చేర్చేందుకు బిఎల్‌ఓలు పూర్తి సహకారం అందిస్తారని, దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే నివృత్తి చేస్తారని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి సూచించారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని 81వ పోలింగ్ కేంద్రం పరిధిలో కొనసాగుతున్న నోటీసుల విచారణ పనులను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. గీత మందిర్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన ప్రత్యేక విచారణ శిబిరాన్ని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దామరచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన నోటీసుల విచారణ తీరును తహసీల్దార్ జవహర్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. రాళ్లవాగు తండాలోని 213వ పోలింగ్ బూత్‌లో జరుగుతున్న విచారణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి బిఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, జవహర్‌లాల్, కౌన్సిలర్ షబానా అయుబ్, బిఎల్‌ఓ సూపర్‌వైజర్ శ్రీనివాస్, బిఎల్‌ఓలు గౌసియా, విజయ, వెంకటేశ్వర్లు, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily



## గణేష్ మంటపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/నెక్కొండ: మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులు తమ మండపాలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని నెక్కొండ సిఐ ఫణీందర్ సూచించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ సూచించిన భద్రతా, ట్రాఫిక్ నిబంధనలను నిర్వాహకులు పాటించాలని కోరారు. ఆన్‌లైన్ నమోదుకు policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. సందేహాలు, సహాయం కోసం నెక్కొండ పోలీస్‌స్టేషన్ 8712685026 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## కరాటేలో సత్తా చాటిన 'కివి' పాఠశాల విద్యార్థులు



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కరీమాబాద్‌లోని కివి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని శ్రీ లక్ష్మీ భవాని ఫంక్షన్ హాల్‌లో జీఎంఆర్ కరాటే అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ తెలంగాణ, మంచిర్యాల బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ 2026లో విద్యార్థులు పతకాలు సాధించారు. రాష్ట్రంలోని 17 జిల్లాల నుండి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో కివి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కటాస్, కుమిటే విభాగాల్లో సత్తా చాటారు. జే లలిత్, ఎస్ సాత్విక్, ఏ ఇసాకు, ఎం యోగిత్, ఎస్ వరుణ్‌లు బంగారు పతకాలు సాధించగా, ఈ సాత్విక్, ఏ వెంకటరమణ, బి నందకిశోర్‌లు వెండి పతకాలు కైవలం చేసుకున్నారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, కోచ్‌లు బండారి సంతోష్, యు రణదీప్, జి వైష్ణవి అభినందించారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం / వరంగల్ : భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న కుటుంబ వివాదంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లోకి పరుగెత్తిన ఘటన వరంగల్‌లో శుక్రవారం కలకలం రేపింది. ఈ ఘటనలో యువకుడితో పాటు అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. మిల్స్‌కాలనీ పోలీసుల వివరాల ప్రకారం కట్ల హర్షిత్ (25)కు ప్రేమ వివాహం జరిగిందని, భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కుటుంబ వివాదాలు కొనసాగుతున్నాయని, వీరికి ఓ కుమారుడు ఉన్నట్లు సమాచారం. వివాదం నేపథ్యంలో సుమారు రెండు నెలల క్రితం విడాకుల కోసం కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం కోర్టుకు హాజరయ్యే సమయంలో హర్షిత్ పెట్రోల్ బాటిల్ తీసుకెళ్లి భార్య కుటుంబ సభ్యులను బెదిరించినట్లు సమాచారం. అనంతరం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలతోనే పోలీస్‌స్టేషన్‌లోకి పరుగెత్తగా పోలీస్‌లు వెంటనే స్పందించి అతడిని కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో హర్షిత్‌తో పాటు స్టేషన్ రైటర్ ప్రవీణ్, హెడ్‌కానిస్టేబుల్ మగ్దూంకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

## ఆదర్శలో మాక్ పోలింగ్



ప్రజాపక్షం/కాటారం;ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతోపాటు ఓటు హక్కు విలువను తెలియజేయడానికి కాటారం మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు.పాఠశాల స్థాయిలోనే ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా పరిచయం చేస్తూ విద్యార్థులకు ప్రత్యేక అనుభవాన్ని కల్పించారు. స్కూల్ లీడర్,హౌజ్ కెప్టెన్లు,స్పోర్ట్స్ లీడర్ తదితర నాయకత్వ పదవులకు మాక్ ఎన్నికలు నిర్వహించారు.విద్యార్థులే అభ్యర్థులుగాపోటీ చేయడంతో పాటు ఓటర్లుగాపోలింగ్ అధికారులు,ఎన్నికల సిబ్బందిగా బాధ్యతలు నిర్వహించారు.ఇవిఎంతో ఓటింగ్ మాక్‌పోలింగ్‌లో భాగంగా ప్రత్యేకంగా ఇవిఎంలను ఏర్పాటు చేసి విద్యార్థులతో ఓటు వేయించారు. పోలింగ్ కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలు,ఓటు వేసే విధానం, ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఓటర్లు వ్యవహరించాల్సిన తీరు తదితర అంశాలను ఉపాధ్యాయులు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ మాట్లాడుతూ మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థుల్లో నయకత్వ లక్షణాలు,బాద్యత,నిర్ణయాత్మక సామర్థ్యం పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు,ప్రిన్సిపల్ కృషిత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామంలో రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగిస్తాం



ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ మండలం గూడూరులో శివాలయం దగ్గర చెరువు కట్ట వద్ద రోడ్డు పక్కన ఉన్న పెరుమాళ్ళ బావి ఫెన్సింగ్ చుట్టూ ముళ్ళ చెట్లు విపరీతంగా పెరిగి బాట మూసుకుపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయాన్ని గ్రామస్థులు సర్పంచ్ బండి వనజ కళాధర్ దృష్టికి తీసుకురాగా, వారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్‌ఆర్ఐ సమ్మయ్యను పంపించగా, ఆయన సమక్షంలో పాలకవర్గం జెసిబి సహాయంతో ముళ్ళ పొదలను, ఫెన్సింగ్‌ను, రోడ్డుపై ఉన్న అక్రమ ర్యాంప్‌ను తొలగించి దారిని వెడల్పు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో రోడ్ల పైకి అక్రమ నిర్మాణాలు చేస్తే తొలగిస్తామని, రోడ్లపై వ్యర్థాలు ఉంచకుండా ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను పంచాయతి ట్రాక్టర్ వేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం, ఉప సర్పంచ్ పాక మమత నాగరాజు, పిల్లల రాజు, బయగని సుమంత్, పాక రాజు, నద్దునూరి శివ, కన్నూరు శృతి వేణు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

హనుమకొండలో ముమ్మరంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 90 వసంతాల వేడుకలు



ప్రజాపక్షం/హనుమకొండ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర 90 వసంతాల ముగింపు వార్షికోత్సవాలు సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో, వార్షికోత్సవాల ఏర్పాట్లను ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులతో కలిసి పరిశీలించారు.మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మొదటిరోజు కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో బహిరంగ సభ, అనంతరం రెండు రోజులపాటు బాలసభ మీటింగ్ హాల్‌లో రాష్ట్రస్థాయి మహాసభలు నిర్వహించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా హాజరయ్యే ప్రతినిధులకు కల్పిస్తున్న వసతి, భోజన సదుపాయాలతో పాటు సభా వేదిక, మీటింగ్ హాల్, డైనింగ్ హాల్ తదితర ఏర్పాట్లను నాయకులు క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ ఏర్పాట్లను ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కర్రె భిక్షపతి, ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు క.మణికంఠ రెడ్డి పరిశీలించి, కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా నాయకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వార్షికోత్సవాల నిర్వహణకు సంబంధించిన స భా వేదిక, డెలిగేట్ల వసతి, భోజన ఏర్పాట్లు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలను ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా కార్యదర్శి భాషాబోయిన సంతోష్ నాయకులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొడ్డి పార్థసారథి, జిల్లా కార్యదర్శి శరత్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్, వేల్పుల చరణ్, శ్రీపతి వినయ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఈ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నాయకులు, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు కామ్రేడ్ సంతోష్ కుమార్,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ విద్యావేత్తలు,ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు, 600 మంది డెలిగేట్స్ పాల్గొననున్నట్లు తెలిపారు.విద్యారంగ సమస్యల పరిష్కారం కో సం"చదువు – పోరాడు" అనే నినాదంతో జరిగే ఏఐఎస్‌ఎఫ్ 90 వసంతాల ముగింపు వార్షికోత్సవాలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు నేదునూరి జ్యోతి




ప్రజాపక్షం/హసన్ పర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సన్నద్ధంకావలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు.శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన ఎల్లాపూర్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభను నిర్వహించారు.సభకు ముఖ్యఅతిథిగా భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు నేదునూరి జ్యోతి హజరైనారు.ఈసందర్భంగా మాట్లాడుతూ బద్దం ఎల్లారెడ్డి, ముగ్దూం మోహినుద్దీన్, నల్ల నరసింహులు,రావినారాయణరెడ్డి లాంటి విప్లవ వీరులు అర్పించిన త్యాగాల స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక పోరాటాలకు సన్నద్ధం కావాలని జ్యోతి పిలుపునిచ్చారు.సీనియర్ నాయ కులు మోతె లింగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నేదునూరి రాజమౌళిలు సంయుక్తంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం పౌర హక్కుల్ని కాపాడు కొనుటకు మరో స్వాతంత్ర పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబు,రేణికుంట్ల రాజయ్య గోపుబుచ్చిరెడ్డి,గోపు శ్రీనివాస్ రెడ్డి ముజ్జిగ పరశు రాములు, గోపరాజు భద్రయ్య, మహిపాల్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా భద్రకాళి బండ్ అభివృద్ధి పనులు పూర్తి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : భద్రకాళి బండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.శనివారం భద్రకాళి బండ్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే పూర్తయిన బండ్ అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు.భద్రకాళి బండ్ అభివృద్ధిలో భాగంగా గ్రానైట్ పనులు, పాత్‌వేలు, గ్రీనరీ, లైటింగ్, డ్రైనేజీ తదితర పనులు పూర్తయినట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ భద్రకాళి బండ్ కు సంబంధించిన అభివృద్ధి పనులలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రకాళి బండ్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ గ్రీనరీని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చేపట్టిన అన్ని పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఇఇరవి కుమార్, డిఇలు, ఎఇలు,హార్టికల్చర్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ యూనివర్సిటీలో జార్ఖండ్ కార్మికుడు మృతి



ప్రజాపక్షం/హసన్‌పర్తి : హసన్ పర్తి పోలీస్ స్టేష న్ పరిధి అనంతసాగర్ గ్రామ పరిధిలోని ఎస్సార్ యూనివర్సిటీలో భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు ఇనుప రాడ్ తలపైపడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హసన్‌పర్తి పోలీస్‌ఇన్స్‌పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం, లాతేహార్ జిల్లా, ము రుపు పోస్ట్, బాలుగాడి గ్రామానికి చెందిన పప్పు కుమార్ (31) తన సోదరుడు గుడ్డు భయ్య, తో టి మేస్త్రీ ప్రదీప్‌లతో కలిసి బతుకుదెరువు కోసం వరంగల్‌కు వచ్చి ఎస్సార్ యూనివర్సిటీ భవన ని ర్మాణంలో రాడ్ బెండింగ్ పనులు చేస్తున్నారు.ఈ నెల 9న ఉదయం భవనం 4వ అంతస్తు నుండి గ్రౌండ్ ఫ్లోర్‌కు, అలాగే గ్రౌండ్ ఫ్లోర్ నుండి 4వ అ ంతస్తుకు ఇనుప రాడ్లను రవాణాచేస్తుండగా, ప్ర మాదవశాత్తు ఒక ఇనుప రాడ్ 4వ అంతస్తు నుం డి కింద పడి పప్పు కుమార్‌కు తీవ్రంగా గుచ్చుకు ంది. తీవ్రగాయాలపాలైన పప్పుకుమార్‌ను వెంట నే అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజిఎం ఆస్పత్రి కి తరలించారు. అనంతరం డ్యూటీ వైద్యుల సల హా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 10న రాత్రి సమయంలో పప్పు కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై మృతుని సోదరుడు గుడ్డు భయ్య శనివారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ ఎ. మహేందర్ పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ప్రాతినిధ్యంపై హర్షం



ప్రజాపక్షం/హనుమకొండ : తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలు అభినందనీయమని ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర సలహాదారుడు, ప్రభుత్వ పాలిటెక్నిక్ అలుమ్ని అధ్యక్షుడు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ దృక్పథానికి నిదర్శనంగా మూడు ముఖ్యమైన అంశాల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు నెలవారీ పెన్షన్ అందించే నిర్ణయం ఎంతో మానవతా దృక్పథంతో కూడుకున్నదని ఇ.వి. శ్రీనివాస్ రావు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, విద్యార్థులు, సిబ్బంది, సాంకేతిక విద్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఓ 97లో అవసరమైన మార్పులకు ప్రభుత్వం సానుకూలంగా ఉండటం స్వాగతించదగిన పరిణామమని అ న్నారు. అలాగే ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన వారికి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే చర్య సమాజంలోని అన్ని వర్గాలకు సమాన గౌరవం అని ఇ.వి. శ్రీనివాస్ రావు అన్నారు. ప్రభు త్వం సానుకూలంగా స్పందించడానికి సహకరించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మంత్రివర్యులు ధనసరి సీతక్క, గడ్డం వివేక్ వెంకటస్వామి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవన్ కుమార్




ప్రజాపక్షం/భూపాలపల్లి : ప్రజలకు ఉచితంగా, సత్వర న్యాయం అందించే లక్ష్యంతోనే చట్టపరంగా న్యాయసేవాధికార సంస్థలు ఏర్పాటయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జె.జీవన్ కుమార్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు, హైకోర్టు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు లోక్ అదాలత్‌లు నిరంతరం కొనసాగుతున్నాయని, రాజీకి అవకాశం ఉన్న (కంపౌండబుల్) క్రిమినల్, మోటార్ వాహన ప్రమాదాలు, కుటుంబ వివాదాల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి తాడూరు మహతి వైష్ణవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, భూపాలపల్లి ఆర్.డి.ఓ హరికృష్ణ, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ.రాములు, భూపాలపల్లి డిఎస్‌పి, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో రాజీపడిన దంపతులు**

కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక వైవాహిక జంట వారి మధ్య తలెత్తిన చిన్న చిన్న వివాదాల కారణంగా కేసు పెట్టుకోవడం జరిగింది. సి.సి. 1598 /2024 గా ఈ కేసు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరుగుతుంది. జాతీయ లోక్ అదాలత్ లో రాజి కుదుర్చుకొని కేసు విరమించుకున్నారు.


## అన్నంపల్లి రైతులకు దేవాదుల నీరు

మంత్రి సీతక్క ఆదేశాలతో
పంటలకు నీటి విడుదల



ప్రజాపక్షం/ములుగు: వర్షాలు లేక ఎండిపోతున్న పంటల ను కాపాడేందుకు అన్నంపల్లి రైతులకు దేవాదుల పైపులైన్ ద్వారా నీటిని విడుదల చేశారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూ య సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అ శోక్ సూచనల మేరకు ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చై ర్మన్ బానోత్ రవిచందర్ శనివారం నీటిని విడుదల చేశారు. ములుగు మండలం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నంపల్లి రైతులు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, నీటిని విడుదల చేసి ఆదుకోవాలని మంత్రి సీతక్కను కోరారు. రైతుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించడంతో దేవాదుల పైపులైన్ ద్వారా పంటలకు నీటిని విడుదల చేసినట్లు బానోత్ రవిచందర్ తెలిపారు. రైతుల ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి నీటి విడుదలకు మంత్రి చొరవ చూపారని పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్న సమయంలో నీటిని విడుదల చేయడంతో రైతుల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ స్వీట్లు పంచుకున్నారు. రైతుల కోసం భూమిని అందించిన భూక్య భిక్షపతిని కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరెం వెంకన్న, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, జిల్లా ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలావత్ దేవ్‌సింగ్, మండల పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుంటోజు శంకర్‌చారి, లక్కీ, విజయ్ యాదవ్, వార్డు సభ్యులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు డ్రా




ప్రజాపక్షం/జనగామ : స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని స్టేషన్‌ఘనపూర్, లింగాలఘనపురం, జఫర్‌గడ్ మండలాల పరిధిలో 108 డబుల్ బెడ్ రూం ఇళ్లకు లక్కీ డ్రా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శనివారం క లెక్టరేట్‌లోని సమీకృత కార్యాలయంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ లక్కీ డ్రా నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ డ్రా మొత్తం వీడియో చిత్రీకరణ, జిల్లా స్థాయి కమిటీ సమక్షంలో ఇన్ కెమెరా విధానంలో చేపట్ట డం జరిగింద న్నారు. డ్రా పూర్తిగా రెండు దశల్లో ఉ ంటుందని, మొదటి దశలో అర్హత కుటుంబాల ఎ ంపిక, రెండో దశలో ఎంపికైన కుటుంబాలకు ఫ్లా ట్ కేటాయింపు జరుగుతుందన్నారు. డ్రా అనంతరం ఎంపికైన కుటుంబాలకు తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసి మండల స్థాయి బృందాలు అర్హతలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాయని తెలిపారు. అర్హత నిర్ధారణ అనంతరం తుది కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసి గృహాలు స్వాధీనం కల్పిస్తామన్నారు. ఎంపిక జాబితాలు గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాయాలు, తహాసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ ఆర్‌డిఒ కిరన్ ప్రకాష్, ఆడిట్ అధికారి దేవేందర్, లింగాలఘనపురం , జఫర్‌గడ్, స్టేషన్‌ఘనపూర్ తహాశీల్దార్లు స్వప్న, శ్రీనివాస్, అండాలు పాల్గొన్నారు.

## బొజ్జ గణపయ్య ప్రతిష్ఠకు వేళాయే!

*ఉత్సవాలకు సిద్ధమవుతున్న మంటపాలు* భక్తిశ్రద్ధలతో వేడుకలకు సన్నాహాలు
* భద్రతకు పెద్దపీట..విద్యుత్ అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాపక్షం/గూడూరు; విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలకు వేళైంది. సోమవారం నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు ప్రార ంభం కానుండటంతో గూడూరు మండలంలోని పలు గ్రామాలు పట్టణ ప్రాంతాల్లో గణనాథుడి మంటపాలు ముస్తాబవుతున్నాయి.యువజన సంఘాలు భక్తి బృందాలు ఇప్పటికే విగ్రహాలను సిద్ధం చేసుకోవడంతో పాటు మంటపాల నిర్మాణం అలంకరణ విద్యుత్ దీపాల ఏర్పాటు పూజ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. గణపయ్యను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు.సామూహికంగా నిర్వహించే వినాయక నవరాత్రి ఉత్సవాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమా



దానికి దారితీసే అవకాశం ఉండటంతో నిర్వహకులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మంటపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

**మంటపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి : గూడూరు సిఐ**



గూడూరు సిఐ వినయ్‌కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.వినాయక మంటపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని తె లిపారు. మంటపాల ఏర్పాటు విద్యుత్ సౌకర్యాలు ఊరేగింపు నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి నిబంధన లు పాటించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా నిర్వాహకులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పో లీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ని మజ్జనం సమయంలో ట్రాఫిక్ శాంతిభద్రతలకు ఇబ్బ ంది కలుగకుండా పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉత్సవాల పేరుతో మద్యం సేవించి గొడవలకు దిగడం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం ప్రజలకు ఇబ్బంది కలిగించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.శాంతి భద్రతలకు వి ఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ వినయ్ కుమార్ హెచ్చరించారు. వినాయ క నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధ ఐక్యతకు ప్రతీకగా ని ర్వహిస్తూ గణనాథుడి ఆశీస్సులు అందరూ పొందాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
ఆదివారం
13-09-2026
www.prajapaksham.in

“న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి.”

## రామ్ పోతినేని సరసన సంయుక్త



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రతిష్టాత్మక 23వ సినిమా లో ఎక్సయిటింగ్ స్టార్ చేరారు. టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఆమె ఈ సినిమాలో భాగమైన విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆమె చేరికతో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్యూరియాసిటీ పెరిగింది. నియోనోయిర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. రామ్ పోతినేని దర్శకుడిగా తొలిసారి పరిచయం అవుతున్నారు. తన విజన్‌ను తెరపైకి తీసుకొచ్చే బాధ్యతను ఆయనే పూర్తి గా తీసుకున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) విజువల్స్ అందిస్తున్నారు. సామ్ సిఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. విక్రమ్ మోర్, పీటర్ హెయిన్ యాక్షన్ సీక్వెన్స్‌లకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

## 18న వస్తున్న ‘హనుమాన్ అంశ్’



బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించి, రికార్డ్ స్థాయి వసూళ్లు అందుకుంటున్న ‘హనుమాన్ అంశ్’ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని 18న తెలుగులో థియేట్రికల్ రిలీజ్ చేస్తోంది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్ర ఆధారంగా దర్శకుడు డా. విశాల్ చతుర్వేది ‘హనుమాన్ అంశ్’ సినిమాను రూపొందించారు. రాగిని ఎస్, నమ్రత. జి. సింగ్, అనుప్రియ ఎ నగర్, డా.విశాల్ చతుర్వేది నిర్మించారు. ‘హనుమాన్ అంశ్’ సినిమాలో శోభిత్ శ్రీవాత్సవ, చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి, విహాన్ షెగ్డే కీలక పాత్రల్లో నటించారు. గత నెల 7వ తేదీన బాలీవుడ్‌లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 150 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండటం మరింతగా అంచనాలు పెంచుతోంది. తెలుగు ఆడియెన్స్ ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో తెలుగులో ‘హనుమాన్ అంశ్’ సినిమా మంచి విజయం సాధిస్తుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.

## ‘నీ పరిచయం’ సాంగ్‌కు హ్యూజ్ రెస్పాన్స్



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న ‘టార్టాయిస్’ సినిమా మ్యూజికల్ గా బ్లాక్ బస్టర్ జర్నీ స్టార్ట్ చేసింది. ఈ సినిమా నుంచి ఇటీవల రిలీజ్ చేసిన ‘నీ పరిచయం..’ సాంగ్ మ్యూజిక్ లవర్స్‌ను అలరిస్తూ అతి తక్కువ టైమ్‌లో 10 మిలియన్స్‌కు పైగా డిజిటల్ వ్యూస్ సాధించింది. సినిమా నుంచి రిలీజ్ చేసిన తొలి పాటే ఇంత హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకోవడం ‘టార్టాయిస్’ మూవీపై అంచనాలు పెంచుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ బ్యూటిఫుల్ మెలొడీ ట్యూన్‌తో ‘నీ పరిచయం..’ సాంగ్‌ను కంపోజ్ చేసి మ్యాజిక్ చేశారు. ప్రేమికుల మనసుకు అద్దం పడుతూ, వారి ప్రేమ భావాలను ఈ పాటలోని సాహిత్యంలో అందంగా వ్యక్తీకరించారు ఆస్కార్ విన్నింగ్ లిరిక్ రైటర్ చంద్రబోస్. సింగర్ చిన్మయి ఈ పాటను మళ్లీ మళ్లీ వినేలా పాడారు. వీళ్లందరి ఎఫర్ట్స్‌తో ‘నీ పరిచయం..’ గ్రేట్ మెలొడీగా రూపుదిద్దుకుంది. ఇటీవల రాజ్ తరుణ్ చిత్రాల్లో మ్యూజికల్‌గా మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్న సినిమా ‘టార్టాయిస్’ అనే చెప్పుకోవచ్చు. ‘టార్టాయిస్’ ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘టార్టాయిస్’ సినిమాను ఎస్ కె గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌విఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్ కో– ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించింది.

## మరుగున పడ్డ జాతి కథ

**‘ది ప్యారడైజ్’ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల**

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో నాని మాట్లాడుతూ సెప్టెంబర్ 24న వస్తున్నాం. ఆయా షేర్, ఏష నాగుల కట్ట, గ్లింప్స్, టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకి ఒక డెస్టినీ ఉంది అనే బలమైన నమ్మకం వచ్చింది. సెప్టెంబర్ 24న ఆడియన్స్‌కి ఒక అద్భుతమైన అనుభూతిని అందించడానికి నిద్రాహారాలు లేకుండా పని చేస్తున్నాం. మీరందరూ చాలా అంచనాలతో థియేటర్‌కి వస్తారని తెలుసు. మేమందరం దానికోసం కష్టపడుతున్నాం అన్నారు.



డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ సినిమా మొదలైనప్పటి నుంచి మీడియా వారు చాలా సపోర్ట్ చేస్తున్నారు. సినిమా రిలీజ్ అయ్యే వరకు ఈ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సినిమా నుంచి ఏది వచ్చినా సరే ఆడియన్స్‌లో బ్లాస్ట్ అవుతుంది. సాంగ్స్, టీజర్‌ను చాలా పాజిటివ్‌గా తీసుకుంటున్నారు. నా ‘సినిమా’ అనేకంటే ‘జనం సినిమా’ అనడం కరెక్ట్ అని నాకు అనిపిస్తుంది. అంతలా ఈ కంటెంట్‌ను ఆదరించారు. ఇది రెవల్యూషనరీ ఎమోషనల్ ఫిలిం. ఒక తల్లీ, కొడుకుల కథ. ఒక సవారీ జాతి కథ. పుట్టుక మనది, చావు మనది, బతుకంతా దేశానిది అని కాళోజీ గ మాట ఉంటుంది. ఆ దేశం కోసం కొట్లాడిన వారిని ఆ దేశంతోనే సంబంధం లేదు అంటే.. వాళ్లందరూ ఏం చేయాలో తెలియక, మరుగునపడ్డ జాతి కథ. ‘ది ప్యారడైజ్’ కథ ఏమిటో అవగాహన కోసం ఇది చెప్తున్నాను అన్నాడు. ఈ ప్రెస్ మీట్‌లో నిర్మాత సుధాకర్ కూడా పాల్గొన్నారు.

## ఆదర్శ కుటుంబం— AK47’ టీజర్ విడుదల

విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ‘ఆదర్శ కుటుంబం – AK47’ టీజర్ విడుదలైంది. కుటుంబ నేపథ్యంతో కూడిన వినోదం, యాక్షన్, చమత్కారమైన సంభాషణలతో టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. మధ్యతరగతి కుటుంబం.. ఆ కుటుంబంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు.. వాటి చుట్టూ అల్లుకున్న వినోదం.. ఇలా ‘ఆదర్శ కుటుంబం – AK47’ ప్రపంచాన్ని టీజర్ ఆసక్తికరంగా పరిచయం చేసింది. వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో అలరించగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ మార్క్ చమత్కారమైన రచన, పదునైన సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే సమయంలో టీజర్‌లోని ఎనర్జిటిక్ యాక్షన్ సన్నివేశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువినా, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్‌బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం థమన్ ఎస్, ప్రొడక్షన్ డిజైన్ ఏ.ఎస్. ప్రకాష్, ఎడిటింగ్ నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ రవి కె. చంద్రన్.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మక బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదర్శ కుటుంబం – AK47’ అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది



## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనుల్లో పురోగతి



కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ఎయిర్‌పోర్ట్ పురోగతిపై న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జెయుఎ) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును మిషన్ మోడ్‌లో ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ, పౌర విమానయాన శాఖలు, తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని, డిపిఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రన్ వే నిర్మాణం కోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాలు సేకరించనుందని, ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలతో పాటు సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన

# 4.20 లక్షల కేసుల పరిష్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన మూడో జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 4,20,626 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో 2,78,335 ప్రీ లిటిగేషన్ కేసులు, 1,40,565 పెండింగ్ కోర్టు కేసులు ఉన్నాయి. వినియోగదారుల, కార్మిక వివాదాలు సహా వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారం, రాజీ, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 340 లోక్‌అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. కక్షిదారులకు లోక్‌అదాలత్ ద్వారా వివాదాలను వేగంగా, స్నేహపూర్వకంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే అవకాశంపై న్యాయ సేవా సంస్థలు అవగాహన కల్పించాయి. లోక్‌అదాలత్‌లో జరిగిన పరిష్కారాల ఫలితంగా వివిధ కేసుల్లో లబ్ధిదారులకు మొత్తం రూ. 266 కోట్ల పరిహారం అందింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ప్యాట్రన్ ఇన్‌చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. సామ్ కోషీ, హైకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయ సేవల కమిటీ చైర్మన్ జస్టిస్ కె. లక్ష్మణ్ నేతృత్వంలో మూడో జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు.

**హైకోర్టులో 182 కేసుల పరిష్కారం**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం రెండు లోక్‌అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. జస్టిస్ కె. సుజన, జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ నేతృత్వంలోని ఈ బెంచ్‌లలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, బీమా సంస్థలు, ఇతర భాగస్వాముల సహకారంతో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న 182 కేసులను ఇరుపక్షాలు ఏకాభిప్రాయంతో పరిష్కరించుకున్నాయి. వీటిలో మోటార్ ప్రమాద పరిహారం కేసులు తదితర కేసుల పరిష్కారం ద్వారా క్లెయిమ్‌దారులకు మొత్తం రూ. 14,81,00,000 పరిహారం అందింది. లోక్‌అదాలత్‌లో పరిష్కారమైన ముఖ్యమైన కేసుల్లో ఒకటి 06.07.2016న జరిగిన ట్రక్కు ప్రమాదానికి సంబంధించినది. ఏపీ 05 టీయూ 9198 నంబరు గల ట్రక్కు ప్రమాదంలో ఎం. రవి కుమార్ మృతిచెందగా, ఆయన భార్య ఎం. సునీత, ఇతర కుటుంబ సభ్యులు పరిహారం కోసం మోటార్ ప్రమాద క్లెయిమ్‌ల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. రూ.10 కోట్ల పరిహారం కోరుతూ దాఖలైన క్లెయిమ్‌లో మధ్యవర్తిత్వం, చర్చల అనంతరం శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రూ.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. చీఫ్ జడ్జి, సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్ సమక్షంలో పరిహారం మొత్తానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మరో రోడ్డు ప్రమాద కేసులో గోపాల్‌నాథ్ పరిధిలో ట్రక్కు ఢీకొనడంతో మృతిచెందిన ఎం. నరేంద్ర కుమార్ కుటుంబానికి రూ.1,75,000 చెల్లించేందుకు శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అంగీకరించి చెక్కును అందజేసింది.

## స్వాతంత్ర్య సమరయోధుడు పి.ఎన్. మూర్తి జీవిత చరిత్ర ‘వారధి’ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్వాతంత్ర్య పోరాట చరిత్ర, రజాకారులపై తిరుగుబాటు, సాయుధ పోరాటం, స్వాతంత్ర్యానంతర పరిపాలనకు సంబంధించిన అనేక ఆసక్తికర అంశాలను ఆవిష్కరించే ‘వారధి’ పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ శాసనసభ కమిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ నాయకుడు పి.ఎన్.మూర్తి జీవిత చరిత్ర ఆధారంగా ఆయన కుమారుడు పూర్ణబోధ శ్రీకాంత్ రచించిన ఈ పుస్తకాన్ని రాజమండ్రికి చెందిన రచయిత శ్రీపాద శ్రీనివాస్ కూర్పు చేశారు. పి.ఎన్.మూర్తి శతజయంతి సందర్భంగా ‘వారధి’ని రూపొందించారు. పి.ఎన్. మూర్తి 1952–53లో హైదరాబాద్ రాష్ట్రంలో, 1953–56లో ఆంధ్ర రాష్ట్రంలో, అనంతరం 1956 నుంచి 1996 వరకు కాంగ్రెస్ పార్టీకి సుమారు 44 ఏళ్లపాటు సేవలందించినట్లు పుస్తకంలో వివరించారు. మూర్తి సేవలను స్మరించుకుంటూ చారిత్రక ఘట్టాలను ఇందులో పొందుపరిచారు. పూర్ణబోధ శ్రీకాంత్ కూడా మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ శాసనసభాపక్షం కార్యాలయ కార్యదర్శిగా సేవలందించారు. సిఎల్‌పి నేత పి.జనార్దన్‌రెడ్డి హయాం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరకు కాంగ్రెస్ శాసనసభా పక్షం కార్యాలయ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ ఒఎస్‌డిగా పనిచేస్తున్నారు.

## పైప్‌లైన్ మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

1200 కి.మీ (745మైళ్ళు) నిడివిగల భారీ చమురుపైపులైను నిర్మించింది. హోర్ముజ్ జలసంధి మూతపడినప్పటికీ అనేక దేశాలకు ఈ పైపులైన్ ద్వారా నేరుగా ఎగుమతులు చేయడానికి వీలుగా చమురు ఇన్నాళ్ళూ రవాణా జరుగుతూ వస్తోంది. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం ఏడవనెలలోకి ప్రవేశించిన తర్వాత హౌతీ ఉగ్రవాదులు విజయపథంలో ముందుకు దూసుకుపోతున్న తరుణంలో ఈ పైపులైను మూత పడింది. ఇప్పుడు ఈ చమురు పైపులైను మూత పడటంతో అతి పెద్ద సమస్యకు తెరలేచింది. సౌదీ అరేబియాపై తమ భూభాగంనుండే దాడులు జరిగాయని ఇరాక్ పాలకులు కూడా అంగీకరించారు. తమ పొరుగున తూర్పు–పశ్చిమ సౌదీ అరేబియా చమురు పైపులైన్లపై తమ దేశంలోని రాష్ట్రాల నుండే డ్రోన్ దాడులు జరిగాయని ఇరాన్ అంగీకరించి ఒక సైనిక కమాండర్‌ను కూడా పదవి నుండి తొలగించింది.
ఈ విషయంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. హౌతీలు ఈ తీర ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకోవడంతో యుద్ధంలో ఇరాన్‌కు మరింత ఆధిపత్యం వచ్చింది.చమురు రవాణాను స్తంభింపజేయడానికి మరో కొత్త వార్‌ఫ్రంట్‌కు తెరలేచింది. ఇప్పటివరకూ చమురు రవాణాకోసం సౌదీ అరేబియాకు బాబ్ ఎల్‌మండ్ ద్వీప ప్రాంతం ఒక ప్రత్యామ్నాయ రవాణామార్గంగా ఉపయోగపడుతూ వచ్చింది.ఇరాన్ అనుకూల హౌతీ తిరుగుబాటు సైన్యాలు యెమెన్ ప్రభుత్వ సైన్యాలను తరిమికొట్టి ఆ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాయి. యెమెన్ ప్రభుత్వం సౌదీఅరేబియా పాలకులకు అనుకూలంగా ఉంది.దీంతో అంటే ఇరాన్‌కు చెందిన అత్యున్నతస్థాయీ రాయబారులు,ఇటు సౌదీ అరేబియాకు చెందిన అత్యున్నత స్థాయీ రాయబారులు ఈ సమస్య పరిష్కారంకోసం చర్చల ద్వారా అనుసంధానమై ఒక అంగీకారానికి వచ్చే ప్రయత్నాలు కూడా ప్రారంభమయ్యాయి.మోఖా ఓడరేవును రెండు రోజుల క్రితమే హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దశలోనే హౌతీలు–సౌదీ అనుకూల యెమెన్ ప్రభుత్వ దళాలకు మధ్య హోరాహోరీ పోరాటంలో వందలమంది ఇటీవలి వారాల్లో హతులయ్యారు. ఆ తర్వాత బాల్ అల్ మందాబ్ ద్వీపంవైపు దూసుకుపోయారు. దీనివల్ల ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలను కూడా హౌతీలు స్తంభింపజేయగలుగుతారు. దీంతో ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థకు మరింత తీవ్ర ప్రమాదం పెరుగుతుంది.ప్రస్తుతంప్రామాణిక ప్రపంచ ముడి చమురు ఒక బ్యారెల్ ధర 106 డాలర్లకు పైగా పెరగడం తీవ్ర అనిశ్చిత పరిస్థితికి తార్కాణంగా మారింది.

## టెర్రరిజాన్ని నిర్వచించే అర్హత అమెరికాకు లేదు: ఇరాన్

టెర్రరిజాన్ని నిర్వచించే అర్హత అమెరికాకు లేదని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ హెచ్చరించారు. ప్రపంచ ఉగ్రవాదానికి శిక్షణఇచ్చే నాయకుడుస్థానంలో అమెరికా ఉందని,ఉగ్రవాదాన్ని అమెరికా ప్రోత్సహిస్తోందని, అందువల్ల ఉగ్రవాదానికి నిర్వచనం ఇచ్చే అర్హత ఆ దేశానికి లేదని బఖాయీ అన్నారు.ఎక్స్‌వేదికగా శనివారం ఈ మేరకు ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. సెప్టెంబరు 11వ తేదీన అమెరికా ట్విన్‌టవర్స్‌పై అల్‌ఖైదా దాడుల సంస్మరణ వార్షికోత్సవం సందర్భంగా అమెరికా యుద్ధమంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలను బఖాయీ ఖండించారు. ఇరాన్‌పై చట్ట విరుద్ధమైన యుద్ధాన్ని సమర్థించుకోవడానికి ఈ వార్షికోత్సవాన్ని అమెరికా ఒక పావుగా ఉపయోగించుకుంటున్నదని విమర్శించారు. ఆయన ప్రసంగ కథనంలోనే వైరుధ్యాలున్నాయన్నారు. “మీరు పిరికిపంద హత్యలు చేస్తూ,ప్రజల ప్రాణాలకు తీవ్ర హాని కలిగిస్తూ,అదేసమయంలో ఉగ్రవాదాన్ని నిర్వచించడానికి, ఎవరికి హింస చేయడానికి అర్హత ఉందనే విషయాన్ని నిర్వచించడానికి ఎలాంటి అర్హతా ఉండదన్నారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమాయకులైన ప్రజలను అమెరికా హతమార్చిందని,విస్తృతమైన విధ్వంసానికి కారణమైందని విమర్శించారు.

## వసూళ్లుండవు

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జిఎస్‌డిపి 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని వివరించారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ఎదిగిన హైదరాబాద్ ఐటి, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జిసిసి) ప్రధాన నిలయంగా మారిందన్నారు. నగరం ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించినందున, రాబోయే రోజుల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ వంటి కీలక శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సిఎం అధ్యక్షతన అత్యున్నత పాలక మండలి పని చేస్తుందని, కాలం చెల్లిన నిబంధనలను తొలగిస్తూ 5 భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లతో ఈ బిల్లును ప్రవేశపెట్టామని, జిహెచ్‌ఎంసిని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే ట్రై కార్పొరేషన్లుగా విభజించి, ఒకే చట్టం కింద సమర్థవంతమైన సేవలు అందిస్తామని వివరించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చామని, 20 టిఎంసిల గోదావరి జలాలను నగరానికి తరలించే చర్యలు ముమ్మరం చేశామన్నారు. రవాణా వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ ప్రజా జీవన ప్రమాణాలను పెంచడానికే ఈ క్యూర్ చట్టానికి శ్రీకారం చుట్టామన్నారు. అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేయబోమని గత ప్రభుత్వంలో జారీ చేసిన జిఒను ప్రస్తుత క్యూర్ బిల్లులోకూడా అమలు చేస్తున్నామని వివరించారు. కార్పొరేషన్ల పాలక మండలికి ఉన్న అధికారాలను తొలగించబోమని, సిఎం అధ్యక్షతన అత్యున్నత సలహా పాలకమండలి ఉంటుందని, ఈ మండలి కేవలం పాలసీకి సంబంధించిన అంశాలకే పరిమితం అవుతుందని, కార్పొరేషన్ల అధికారాలలో జోక్యం చేసుకోబోదన్నారు.
ప్రస్తుతం ఉన్న యూనిట్ ధరను రద్దు చేసి, ఆ స్థానంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న క్యాపిటల్ విలువ ఆధారిత ఆస్తిపన్ను విధానాన్ని అమలు చేయనున్నామన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 375 చదరపు అడుగులకు కనీసం పన్ను రూ. 101 యధావిధిగానే కొనసాగుతుందన్నారు.

### హైదరాబాద్ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేయండి

హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన సలహాలు, సూచనలు తీసుకోవాలని సభ్యులు దానం నాగేందర్, రాజాసింగ్ ప్రభుత్వాన్ని కోరారు.

**ఈ బిల్లు ఆత్మహత్య సదృశ్య మే..:** బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ క్యూర్ బిల్లు వల్ల ప్రజలపై న ఆస్తిపన్నుల భారం పడుతుందని, ఈ బిల్లును ప్రవేశపెట్టడమంటేనే ఆత్మహత్యసదృశ్యమ ని అన్నారు. స్థానిక సంస్థల అధికారాలకు గొడ్డలిపెట్టులాంటిదని ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com